# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

అక్టోబర్
2024

వెల: రూ.
25/-





# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 17 సంచిక: 10


సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు


ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్: **పత్తి సుబ్రమణ్యం,**
శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్‌చంద్ర

**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


## లోపలి పేజీల్లో


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| అఖిలాండ బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవములు | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 10 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 22 |
| ఆనందాల పర్వం – దీపావళి పర్వం | 28 |
| హరినామము కడు ఆనందకరము | 31 |
| శక్తి స్వరూపిణి దుర్గాదేవి | 36 |
| రామాయణ రత్నాకరం | 40 |
| ముకుందమాల | 44 |
| మీ ప్రశ్న మా సమాధానం | 47 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 48 |
| శ్రీకృష్ణ తత్వం | 54 |
| తిరుమల సర్వస్వం | 56 |
| దుర్గా నవరాత్రి ఉత్సవం | 59 |
| ఆంధ్రప్రదేశ్‌లో బతుకమ్మ ఉత్సవాలు | 62 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


# జీవితం యుద్ధభూమి

ప్రతి మనిషికి జీవితం ఒక యుద్ధభూమి. ఎప్పటికీ ఏదో ఒక సమస్య వెంటాడుతూనే ఉంటుంది. ఇలా సమస్యల్లో చిక్కి జీవితాంతం సమస్యల నివారణకు, మనకు సంతోషం కలిగించుటకు మాత్రమే భగవంతుణ్ణి ప్రార్థించునట్లు పరిస్థితులు కల్పించబడతాయి. కాని ఎవరైనా ఈ పరిస్థితులకు వెరవక స్థితప్రజ్ఞతతో నిలిచి తమ ఉన్నతి కోసం భగవంతుణ్ణి ప్రార్థించువాడు ధన్యుడు. ప్రతి సమస్య భగవంతుని ఆజ్ఞచే మనలో ఏదో మార్పు తీసుకు రావడానికే కల్పించిందనేది సత్యం. దీనిని సద్వినియోగం చేసుకుని ఆ దిశగా అడుగులు వేయటం ఉత్తమం. ఇక లోకం మీదికి వచ్చిన ప్రతి మనిషికి అహంకారం తప్పకుండా ఉంటుంది. పూర్వం మూడడుగులు దానమిచ్చిన బలిచక్రవర్తి సమస్త ఆస్తిని హరించిన తరువాత కూడా ఆయనలో అహంకారం నశించలేదట. చివరికి నా చేయి పైన ఉన్నది, శ్రీమహావిష్ణువు చేయి క్రింద ఉన్నదని భావించి, తానే గొప్పవాడని భావించేటట్లు ఈ అహంకారం చేసింది. ఇక మనలాంటి అల్పుల విషయం చెప్పనక్కరలేదు. ప్రతి సమస్య మన ఉన్నతిని దృష్టిలో పెట్టుకుని భగవంతుడు ప్రసాదిస్తాడు. ఎవరిపై స్వామి కరుణ చూపాలనుకుంటాడో... వారి సకల సంపదను హరించివేస్తాడు. సంసార సంబంధ మైకంలో పడి ఎవరు లోకాన్ని, స్వామివారిని ధిక్కరిస్తారో అతడు అనేక జన్మలెత్తి అవస్థలు పడవలసి ఉంటుంది. ధనం, వయస్సు, రూపం, విద్య, బలం, ఐశ్వర్యం, కర్మ తదితరాల వల్ల వచ్చే గర్వం, ఇతర మాలిన్యాలు లేనివారిని స్వామివారు అక్కున చేర్చుకుంటారు. భగవంతుణ్ణి త్రికరణ శుద్ధిగా నమ్మినవారు లోభం, అభిమానం, సంసారం, వైభవం అనే వాటివలన చెడిపోరు. ఎవరైతే మన జీవితం అనే యుద్ధంలో వచ్చు సమస్యలకు వెరవక స్వామికి శరణాగతులైనవారు ఆయనకు ఇష్టులు. భూమిపైకి వచ్చిన ప్రతి మనిషికి వికారాలు ఉండుట సహజం. కాని ఈ వికారాల ప్రభావం వలన చెడు పనులు చేస్తూ అదే లోకంలో పేరు తెచ్చిపెడుతుందని భావించి నడుచుకోవటం తగదు. వికారాలను త్యజించి మనని మనం సంస్కరించుకొనుటకు ప్రయత్నించాలి. జీవితంలో ఎదురగు ప్రతి సమస్య ఒక పాఠం లాగా భావించి మనలోని వికారాలను కొంత కొంత తొలగించుకొనుటకు ప్రయత్నించాలి. మరియు సంవత్సరమునకు ఒకసారి మనలో మనం ఎంత సాధించామనే విషయం చర్చించుకోవాలి. ఇలా చేస్తే భగవంతుడు ఆశించిన విధంగా ఈ జీవితంలో ఉన్నతిని సాధించి భగవంతుని కృపను పొందగలము. సర్వాంతర్యామియైన భగవంతుడు మనం చేసే ప్రతి ప్రయత్నాన్ని నిశితంగా పరిశీలించి మనకు సహకరించగలడనుటలో సందేహం లేదు. ఎలాగైతే బిడ్డ ఉన్నతిని తండ్రి కోరునట్లు, మన ఉన్నతిని చూచి భగవంతుడు ఆనందించుటే కాకుండా మనతో తగిన సంబంధమును ఏర్పరచి, తగిన ఆదేశాలు కూడా ఇస్తూ, మరింత ముందుకు నడిపించగలడు. ఇది సాధించాలంటే మనలోని అరిషడ్వర్గాలనే కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలను వికారాలను తీసివేసి భగవంతుడే కావాలనే దృఢ విశ్వాసముతో జీవించుట మాత్రమే ఏకైక మార్గము. సదా ఆయనకు శరణాగతులమై వారి నామస్మరణతో జీవించువాడు ధన్యుడు.

నమో వేంకటేశాయ

**వినా వేంకటేశం న నాథో న నాథః ।**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి॥**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354,** Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.

లేదా

శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను


లేదా

**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:______________________
______________________
చిరునామా:______________________
______________________
______________________
______________________
______________________
పిన్‌కోడ్:______________________
చందా వివరాలు:______________________


మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com


**చందాదారులకు స్వామివారి పవిత్ర పాదాలు (10"x8") ఉచితం**



# శ్రీ వేంకటేశ్వర స్తుతి

శ్లో॥ ఏలాలవంగ ఘనసార సుగంధి తీర్థం
దివ్యం వియత్సరితి హేమ ఘటేషు పూర్ణమ్ ।
ధృత్వాద్య వైదిక శిఖామణయః ప్రహృష్టాః
తిష్ఠంతి వేంకటపతే తవ సుప్రభాతమ్ ॥

తాత్పర్యం – వైదికోత్తములు ఆకాశగంగ తీర్థమునుండి పవిత్ర జలమును బంగారు బిందెలలో నిండుగా నింపి, తీసుకొని వచ్చి అందు ఏలకులు, లవంగాలు, పచ్చకర్పూరము కలుపుటచే సుగంధము గలవానిగా చేసి తలపై పెట్టుకుని వాకిట నిలిచియున్నారు. ఓ వేంకటేశా! నీకు శుభోదయమగుగాక!

శ్లో॥ బ్రహ్మాదయ స్సురవరా స్సమహర్షయస్తే
స్సంత స్సనందనముఖా స్త్వథ యోగి వర్యాః ।
ధామాంతికే తవ హి మంగళ వస్తు హస్తాః
శ్రీవేంకటాచలపతే! తవ సుప్రభాతమ్ ॥

తాత్పర్యం – అత్రి, వసిష్ఠాది మహర్షులు, బ్రహ్మాది దేవతలు, సనందనాది యోగులు నీకు కానుకలుగా సమర్పించుటకై మంగళ ద్రవ్యములను చేతులలో ధరించినీ దర్శనమునకై నీ ఆలయం ఎదుట నిలిచి యున్నారు. శ్రీవేంకటేశా! నీకు సుప్రభాతము.



# ముక్తిమార్గము

భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య



## నాట

తనకేడ చదువులు – తనకేడ శాస్త్రాలు
మనసు చంచల బుదిధ మానీనా? ||పల్లవి||

1. జడ్డు మానవుఁడు – చదువ జదువ నాస
వడ్డి వారుఁ గాక – వద లీనా?
గుడ్డి కుక్క సంత – కుఁబోయి తిరిగిన
దుడ్డు పెట్టేకాక – దొరకీనా? ||తన||

2. దేవదూషకుఁడై – తిరిగేటి వానికి
దేవతాంతరము – తెలిసీనా?
శ్రీవేంకటేశ్వరు – సేవా పరుఁడు గాక
పావనమతియై – పరగీనా? ||తన||



భావము :

మనో నిగ్రహము లేనివానికి
చదువు లెందుకు? శాస్త్రము
లెందుకు? ఎంత చదివినను
వాని మనస్సు చాంచల్యమును
విడువదు గదా!

జడుడైన మనుజుడు
చదువగా చదువగా
ఆశ పెంపొందునే గాని
వదలిపోవునా? గ్రుడ్డికుక్క
ఏదైన దొరికినచో తినవలెనని
సంతకు వెళ్ళి తిరిగినను
దానికి దుడ్డుదెబ్బలే కాని
తిండి దొరకదు గదా!

ఈ దేవత ఆ దేవత అను
భేదము లేకుండ దేవతలనెల్ల
దూషించుటే స్వభావముగా
గలవాడు వివిధ దేవతలలోని
తారతమ్యమును
గుర్తింపలేడు. దేవతలలో నెల్ల
మేటియైన శ్రీవేంకటేశ్వరుని
సేవయందాసక్తుడు
కానివాడు పవిత్రబుద్ధి
కాజాలడు.



## అఖిలాండ బ్రహ్మాండ నాయకుని

# బ్రహ్మోత్సవములు

– చింతలపాటి శివశంకర శాస్త్రి

**శ్లో|| “భూపాదౌయస్యనాభిః విజయదసురనిలః చంద్ర సూర్యాచ నేత్రే**
**కర్ణావాసాశ్శిరోద్యౌః ముఖమపి దహనో యస్యవాస్తేయ మబ్ధిః**
**అన్తస్థం యస్యవిశ్వం సుర నర ఖగ గో భోగి గన్ధర్వ దైత్యైః**
**చిత్రం రం రమ్యతే తం త్రిభువన వపుషం విష్ణుమీశం నమామి”**

అనంతుడు, అచ్యుతుడు, అప్రమేయుడు, జ్యేష్టుడు, సనాతనుడు, ఆశ్రిత భక్తవత్సలుడు, స్థితికారకుడు శ్రీమహావిష్ణువు. ‘విష్’ అను ధాతువు నుండి “విష్ణు” అను పదము పుట్టింది. “విష్” యనగా సర్వత్రా వ్యాపించి యుండటం. అంతటా ఆవరించి ఉండటం.

**“యద్ విషితో భవతి – తద్ విష్ణుర్భవతి”**

అంతటా ప్రవేశించి ఉండేవాడు విష్ణువు. “దేవేష్టి ఇతి విష్ణుః” అని శంకరాచార్యుల వ్యాఖ్యానం.

భారతీయుల జీవన మే యజ్ఞమయం. యజ్ఞమంటే సమర్పణ. ఈ యజ్ఞం అమూర్త యజనం, సమూర్త యజనం అని రెండు విధాలు. అమూర్త యజనంలో అగ్ని ద్వారా దేవతలకు హవిస్సును సమర్పిస్తాము. అర్చామూర్తికి మనం చేసే సమర్పణాత్మక సేవలన్నీ సమూర్త యజనమే. నేటి ఆలయ సంస్కృతికి మూలకందం సమూర్త యజనమే. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే విఖనో మునిగా ఆవిర్భవించి సమూర్త యజన రూపమైన ఆగమ శాస్త్రాన్ని భృగువు, మరీచి, అత్రి, కశ్యపులకు

ఉపదేశించాడు. సాక్షాత్తు వైకుంఠమే వేంకటాచలమయింది. వైకుంఠ వాసుడయిన శ్రీమన్నారాయణుడే శ్రీనివాసుడై, శ్రీవేంకటాచలంలో, కలియుగంలో భక్తకోటిని ఉద్ధరించేందుకు అవతరించాడు. స్వయం వ్యక్త మూర్తి అయిన ఆయన అర్చారూపంలో వేదనిష్ఠులైన వైఖానసులచే యుగ యుగాలుగా ఆరాధింపబడుతున్నాడు.

ఒకనాడు బ్రహ్మ ధ్వజారోహణ పూర్వకంగా ఉత్సవం చేయడానికి సంకల్పించి, అందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా స్వామిని ప్రార్థించాడు. బ్రహ్మ సంకల్పానికి స్వామివారి అనుమతి లభించింది. విధాత వైఖానస ప్రముఖులతో కూడి మునిజన సమేతుడై కన్యారాశిలో సూర్యుడు ప్రవేశించి యున్న కన్యామాసంలో ధ్వజారోహణ పూర్వకంగా ఉత్సవాన్ని ప్రారంభించాడు.

కన్యామాస శ్రవణ నక్షత్రము నాడు స్వామి ఆవిర్భవించిన రోజు. ఆ దినమున చక్రస్నానాన్ని సంకల్పించి నవాహ్నిక దీక్షతో అంగరంగ వైభవంగా ఆచరింపబడేది బ్రహ్మోత్సవం. ధ్వజారోహణ, వివిధ వాహన సేవలు, కుంభ ఆరాధన హోమం, ఆలయబరి, నవసంధి, మొదలగు ప్రక్రియలు వైఖానస ఆగమ శాస్త్ర రీత్యా నిర్వహిస్తారు.

**"ఉదిత్యుత్కృష్ట వచనం సవో యజ్ఞ ఉదా హృతః**
**తస్మా దుత్కృష్ట యజ్ఞత్వా దుత్సవః పరిభాష్యతే"**

అని భృగువు ఉత్సవ పదాన్ని నిర్వచించాడు. ఉత్+సవః – ఉత్సవః. 'ఉత్' అనగా ఉన్నతమైన, 'సవః' అనగా యజ్ఞమని అర్థము. అన్ని యజ్ఞముల కంటె సమున్నతమైనది కనుక స్వామికి జరిపే ధ్వజారోహణ పూర్వకమైన ఈ సేవను ఉత్సవమని అత్ర్యాది మహర్షులు కూడా ప్రవచించారు.

చతుర్ముఖ బ్రహ్మ చేత ఆరంభింపబడిన ఉత్సవములనేది ఒక అర్థము కాగా, సచ్చిదానంద పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీవేంకటేశ్వరునికి సంబంధించిన ఉత్సవాలని రెండవ అర్థము. ''నారాయణ పరబ్రహ్మ తత్వం నారాయణః పరః'' ఇత్యాది శృతి వాక్యములచే కీర్తింపబడుతున్న బ్రహ్మాత్మకుడైన శ్రీమన్నారాయణునకు చేస్తున్న ఉత్సవము.



''బ్రహ్మణః ఉత్సవః అథవా బ్రహ్మణే క్రియా మాణః ఉత్సవః బ్రహ్మోత్సవః'' అనేది మరియొక నిర్వచనం. తొమ్మిది దినములలో జరుగుటచే శ్రీవారికి జరుగుతున్న ఈ ఉత్సవమును సర్వకామకమైన బ్రహ్మోత్సవమని ఆగమ శాస్త్రము చెబుతోంది. కలియుగ ప్రత్యక్ష దైవం, ఆశ్రితుల కొంగుబంగారం, ఆపద మొక్కులవాడు అయిన శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు అనంత ఫలదాయకాలు. నవబ్రహ్మలు నవాహ్నిక దీక్షతో తొమ్మిది రోజులు 'నభూతో – నభవిష్యతి'గా నిర్వహించే ఉత్సవాలు కాబట్టి ఇవి బ్రహ్మోత్సవాలు. సంతోషాన్నీ, ఉల్లాసాన్నీ కలిగించేవి ఉత్సవాలు. ఆలయాలలో ఉత్సవాలు అనేక రకములుగా నిర్వహించుచున్నప్పటికిని, అన్ని ఉత్సవాల కంటే బ్రహ్మోత్సవాలు కమనీయం, రమణీయమైనవి. మరియు సుప్రసిద్ధమైనవి.

శ్రీవేంకటేశ్వరుని ఆదేశం మేరకు సూర్యుడు కన్యారాశిలో సంచరించేటప్పుడు చిత్తా నక్షత్రం రోజున ధ్వజారోహణ, ఉత్తరా నక్షత్రం నాడు రథోత్సవం, శ్రవణా నక్షత్రం నాడు తీర్థవారితో (చక్రస్నానం) బ్రహ్మదేవుడు వీటిని ప్రారంభించాడు కనుక ఇవి బ్రహ్మోత్సవములు. బ్రహ్మ పర్యవేక్షణకు సంకేతంగా నేటికీ బ్రహ్మోత్సవాలలో బ్రహ్మకు శూన్యరథం సిద్ధం చేస్తారు. ఉత్సవ వాహన సేవల్లో బ్రహ్మరథం ముందుగా వెళుతూంటుంది. దేవాలయం బయట చుట్టూ అష్టదిక్కులలోను బలిని వేస్తూ మలయప్పస్వామి దేవేరి సహితుడై పరివార దేవతలతో ఊరేగుచుండగా అష్టదిక్పాలురు ఆహ్వానింపబడతారు. ఇట్లు దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించిన తరువాత మలయప్పస్వామి ఆలయంలోకి ప్రవేశిస్తాడు. అనంతరం శ్రీవారు ధ్వజస్తంభములో ఉండగా (మండపం) స్వామివారి అనుమతితో అర్చకులు గరుత్మంతుని రూపం చిత్రించిన నూతన కేతనాన్ని పండితులు వేదమంత్రములను స్వరయుక్తంగా పఠించుచుండగా, మంగళ వాద్యములు మ్రోగుచుండగా ''ఓం తత్పురుషాయ విద్మహే స్వర్ణ పక్షాయ ధీమహి, తన్నో గరుడః ప్రచోదయాత్'' అను గరుడ గాయత్రిని పఠించి బంగారు ధ్వజస్తంభముపై ఎగురవేస్తారు. ఈ ధ్వజారోహణ ఉత్సవం కనులపండుగగా, కడువైభవంగా జరుగుతుంది.

బ్రహ్మోత్సవాలలో జరిగే వాహన సేవలలో శ్రీదేవీ భూదేవీ సమేతుడైన మలయప్పస్వామి 1.పెద్ద శేషవాహనం 2. ముత్యాల పందిరి 3. కల్పవృక్షవాహనం 4. సర్వభూపాల వాహనం 5. సువర్ణ రథం 6. రథోత్సవం 7. బంగారు తిరుచ్చి వాహనాలలో వేడుకగా తిరుమల మాడ వీధులలో ఊరేగుతాడు.

ధ్వజారోహణం జరిగిన రోజు రాత్రి ఉభయ దేవేరులతో ఏడు తలల బంగారు శేషుని వాహనంగా చేసుకొని శ్రీవేంకటేశ్వరుడు విశేషాలంకరణతో తిరు మాడవీధులలో భక్తులకు కనువిందు చేస్తాడు. బ్రహ్మోత్సవాలలో అగ్ర తాంబూలం ఆదిశేషునికే

దక్కుతుంది. శేషుడు శ్రీవారికి నివాసస్థలం, పడక, సింహాసనం, పాదుకలు, వస్త్రం, దిండు, గొడుగు ఇలా ఆయా సమయాలకు అనుగుణంగా కామరూపియై సేవలందిస్తాడు.

రెండవరోజు చిన్నశేష వాహనంపై కృష్ణమూర్తి రూపియై ఉదయం దర్శనమిస్తాడు. గీతాచార్యులు అర్జునునితో ''అనంతోశ్చాస్మి నాగానః సర్పణామస్మి వాసుకిః'' అని పేర్కొన్నారు. అనగా నాగజాతిలో అనంతుడిని, సర్పజాతిలో వాసుకిని అని తెలియజేశారు. పెద్దశేషవాహనం ఆదిశేషుడిగా, చిన్నశేషువాహనం వాసుకిగా భావించవచ్చు. ఆరోజు రాత్రి స్వామివారు హంసవాహనంపై ఉభయ దేవేరులతో కలిసి అధిష్ఠించి పురవీధులలో ఊరేగుతారు. లక్షలాది మంది భక్తులు ఊరేగింపులో పాల్గొని తన్మయులవుతారు.

అనంత తేజోమూర్తి, శిష్టజన రక్షకుడు, శ్రీవేంకటేశ్వరుడు బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడవరోజు సింహవాహనంపై భక్తులకు దర్శనమిస్తాడు. భగవద్గీతలో కృష్ణభగవానుడు ''మృగాణాంచ మృగేంద్రీహం'' – మృగాలలో నేను సింహాన్ని అని తెలియజేశాడు. యోగశాస్త్రంలో సింహం వాహన శక్తికి, గమనశక్తికి ప్రతీకగా భావిస్తారు.



సాయం సమయంలో ముత్యపు పందిరి వాహనంలో సంచరిస్తాడు. భక్తులకు కనువిందు కలిగిస్తాడు. ఆదిశేషుని వేయి పడగలను శ్రీహరికి ముత్యాల గొడుగుగా కీర్తిస్తారు.

నాలుగవరోజు శ్రీవారు కల్పవృక్షం వాహనంపై భక్తులకు దర్శనమిస్తాడు. కల్పవృక్షం కోరిన కోరికలు తీర్చే దేవతా వృక్షం. శ్రీనివాసుడును కల్పవృక్షము వలె కోరిన కోరికలను తీర్చే కరుణార్ద్ర హృదయుడు. కల్పవృక్షం కన్నా అధికమైన ఫలాన్ని అనుగ్రహించగలడని, ఆ స్వామి దర్శనం అక్షయానంద దాయకమని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఆనాటి రాత్రి స్వామి ''సర్వభూపాల వాహనం''పై భక్తులకు దర్శనమిస్తాడు. విశ్వానికే ప్రభువైన వేంకటేశ్వరుడు బ్రహ్మోత్సవాలలో భాగంగా సర్వభూపాల వాహనంపై అధిరోహించి తన సర్వలోకైశ్వర్యత్వాన్ని చాటే విశిష్టమైన ఆ శ్రీహరి వైభవం ఆశ్రిత భక్తకోటికి అధికార సంపదను ప్రసాదిస్తుంది.

బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రధానమైన రోజు అయిదవ రోజు. ఆనాటి ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం జరిగే గరుడసేవ విశిష్టమైనవి. అన్ని వాహనసేవలు వాహన మండపం వద్ద నుండి ప్రారంభమైతే, మోహినీ అవతారం మాత్రం శ్రీవారి ఆలయంలోనుండి ప్రారంభమవుతుంది. ఆనాటి రాత్రి స్వామి గరుడ వాహనారూఢుడై మాడవీధులలో విహరిస్తాడు. ఈ గరుడవాహనసేవ అన్ని సేవల కంటె సర్వోత్కృష్టమైనది. వైనతేయుడు తన తల్లి దాస్యాన్ని దూరం చేసిన ధన్యుడు. సవతి తల్లి కోరికపై సుర లోకమునుండి అమృతాన్ని తెచ్చిన దక్షుడు. స్వామివారి సేవలో తరించాలన్న కాంక్షతో వాహనారూఢుడిగా ఉండి తరించిన భక్తాగ్రేసరుడు.

ఆరవరోజు గజవాహనంపై శ్రీనివాసుడు భక్తులకు దర్శనమిస్తాడు. గజం ఐశ్వర్యానికి ప్రతీక. శ్రీనివాసుడు పార్వేటలో గజరాజును తరిమినప్పుడు పద్మావతిని చూసినట్లు, శ్రీ శ్రీనివాస పద్మావతీ దేవిల కళ్యాణానికి కూడా ఒక గజరాజం మూల కారణమైంది. వసంతోత్సవ వేళ స్వామి కళ్యాణమూర్తిగా గజవాహనంపై దర్శనమిస్తాడు. శ్రీవేంకటేశ్వర సహస్ర నామాలలో ''గజ రక్షకః'' అని శ్రీహరిని పేర్కొనడం జరిగింది.

తెల్లని చంద్రవాహనంపై విహరించే శ్రీహరిని సేవిస్తే భక్తకోటికి ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవికమనే త్రివిధ తాపాలు తొలగుతాయి. చంద్రుడు భగవంతుని మనస్సు నుండి జన్మించాడు. అందువల్ల చంద్రుడు ఉదయించినా, చంద్రశబ్దం చెవిన పడ్డా ప్రకృతి చల్లదనంతో పులకించిన అనుభూతిని, హాయిని గొల్పుతుంది. బ్రహ్మోత్సవాలలో చంద్రప్రభ వాహనంపై దర్శనాన్ని అనుగ్రహించే వేంకటేశ్వరుడు ఆశ్రిత భక్తులకు శాశ్వతమైన సిరిసంపదలనే కాక, ముక్తిని కూడా కలిగిస్తాడని భక్తకోటి విశ్వాసం.



చతురంగ బలాలలో అత్యంత ప్రధానమైనది అశ్వం. ఇది రాజసానికి చిహ్నం. అశ్వారూఢుడైన అనంతుని దర్శనం అనంత ఫలప్రదం.

''రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే'' – రథంపై శ్రీనివాసుని దర్శిస్తే జన్మరాహిత్యం, పరమపద ప్రాప్తి కలుగుతాయి. బ్రహ్మోత్సవాలలో శ్రీవారు ఉభయ దేవేరులతో భక్తుల మనోరథాన్ని ఈడేర్చే కొంగుబంగారం వేంకటేశ్వరుడు రథోత్సవంలో భక్తులకు కనువిందు చేస్తాడు. వివిధ వర్ణాల పుష్పాలతో, అరటి మొలకలతో, మామిడి ఆకులతో అలంకరింపబడిన రథంపై అత్యంత విలాసంగా దర్శనమిస్తాడు. రథవాహనంపై ఉన్న మలయప్పస్వామి దర్శనం జ్ఞానాన్ని, జన్మకర్మాణి బంధములు లేని శాశ్వతముక్తిని అనుగ్రహిస్తుంది. గీతాచార్యుడు సకల వేద వేదాంత సారమైన గీతను రథంపైనే నరుడికి బోధించాడు. అంతేకాక రుక్మిణీ అమ్మవారిని గౌరీపూజ అనంతరం వివాహార్థం తీసుకుని వెళ్ళింది రథంపైననే.

వివిధ వాహనసేవలలో అత్యంత విలాసంగా సేవలు అందుకున్న వేంకటేశ్వరుడు సేద తీరడానికి అందుకునే కైంకర్యం అవభృద స్నానం. స్వామిపుష్కరిణీ తీరంలో క్షేత్ర నాయకుడైన వరాహస్వామి ఆలయ ప్రాంగణంలో వివిధ ద్రవ్యాలతో అభిషేకాన్ని అందుకుని దివ్యమంగళ స్వరూపుడై భాగవతులను రంజింపచేస్తాడు. స్వామిపుష్కరిణిలో మంగళస్నానం అందుకోవడంతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణమవుతాయి. చక్రస్నానం



జరిగిన సాయంత్రం శ్రీవారి దేవాలయంలో ధ్వజస్తంభంపై ఎగురవేసిన దేవతాహ్వాన పూర్వక ధ్వజపటాన్ని అవరోహణం చేస్తారు. బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించిన ముక్కోటి దేవతాకోటికి ధ్వజావరోహణం గరుడాళ్వారు సాక్షిగా వీడ్కోలు పలుకుతారు.

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగ ప్రత్యక్షదైవం, ఆశ్రితుల కొంగుబంగారం అయిన శ్రీవేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవములు అనంత ఫలదాయకములు. కైవల్య పద సోపానములు. శ్రీవారి బ్రహ్మోత్సవ వేళ శ్రీనివాసుని కమనీయ, రమణీయ, ముగ్ధమనోహర రూపాన్ని దర్శించుకుని ధన్యులమవుదాము.


★ ★ ★



19వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం

## స్వామి వారి దివ్య లీలలు



**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**— గోవింద దాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)

**దిశా నిర్దేశం :** సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. **అందులో భాగంగా ప్రస్తుతపు 19 వ భాగపు లీలల ప్రచురణ. (సెప్టెంబర్ 2006 నుండి మే 2007).**

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు సామ దాన భేద దండోపాయాలను ఉపయోగించి మమ్మల్ని తన దారిలోకి తెచ్చుకునేవారు. స్వామివారు ఆదేశించిన ఒక మాసపత్రికను ప్రారంభిస్తే, వ్యాపారము చేయలేమని భావించి విరమించుకున్నాము. అప్పటినుండి మా ఆర్థిక పరిస్థితి దినదినము దిగజారిపోయింది. ఒక దశలో పనీ పాట లేక సోమరిగా ఉండే పరిస్థితి ఏర్పడ్డది. చివరికి స్వామివారు చెప్పినట్లు మాసపత్రిక ప్రారంభించుటకు ఇలా జరుగుచున్నదనే అనుమానం వచ్చి, ఆ దిశగా అడుగులు వేశాము.

### చింతించిన మాజీ ప్రధాని శ్రీమాన్ దేవగౌడ

గతంలో ఒకసారి తిరుమల శ్రీవేంకటేశ్వరునికి మేల్ ఛాట్ వస్త్రం సేవను బుక్ చేసుకున్నాము. ఇది మాకు తేది. 28-07-2006 న దొరికింది. ఆనాడు స్వామివారికి అభిషేకము చేయు సమయమున మాజీ ప్రధాని శ్రీమాన్ దేవగౌడ వారి కుమార్తెతో పాటు స్వామివారి అభిషేకమునకు వచ్చారు. టి.టి.డి వారి ప్రమేయంతో వారు నా ముందు కూర్చున్నారు. నేను వారి వెనుక కూర్చున్నాను. ఫలితంగా నేను స్వామివారిని అత్యంత దగ్గర నుండి చూడలేకపోయాను. ఈ అభిషేకము తరువాత తేది 16-08-2006 నాడు స్వామివారికి చతుర్థ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ చేస్తున్నామని, మీరు వచ్చి ఈ కార్యక్రమము చేసినచో బాగుండునని శ్రీమాన్ దేవగౌడ గారిని ఆహ్వానించాను. దానికి వారు ఒప్పుకున్నారు. తరువాత నేను వారికి ఈ కార్యక్రమము ఆహ్వానమును పంపాను. ఫోన్ చేసి చెప్పాను. కాని వారు రాలేదు.

**తేది 24-09-2006 కల :** ఇది ఒక హృదయాంతర భావం. దీనిలో శ్రీమాన్ దేవగౌడ

గారు మరియు వారి పుత్రిక ఇద్దరూ కూడా నా ఆహ్వానం మీద తిరు పతికి రానందుకు ఈ కార్యక్రమములో పాల్గొననందుకు చింతించారు.

ఈ కలలోని రెండవ సన్నివేశంలో తరువాత రోజులలో నా వ్యాపారం విస్తరించుటకు, మరింత అభివృద్ధి చెందుటకని రకరకాల ప్రాంతాలు తిరుగుచున్నట్లు చూపారు. నిజానికి నేను అలాగే తిరిగాను.

## మా వంశంలో నన్ను ప్రధాన వ్యక్తిగా చూపుట

ఏదో సాధించుటకు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు మా గ్రామాన్ని, వంశాన్ని, మా కుటుంబాన్ని, ముఖ్యంగా నన్ను ఎన్నుకున్నాడు. ఇందులో ప్రతి ఒక్కరు వారి వారి పాత్రలను నిర్వహిస్తారు. ఈ విధంగా ఒక పర్యాయం మా పూర్తి కుటుంబాన్ని చూపి అందులో నన్ను ప్రధాన వ్యక్తిగా ఈవిధంగా చూపెట్టారు.

మాది సిద్ధిపేటకు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నగుండవెల్లి గ్రామం. మా నాన్న వారు ఇద్దరు అన్నదమ్ములు. మా నాన్న చిన్నవాడు. నేను పుట్టకముందునుండే విడిగా ఉంటున్నారు. ఇద్దరివీ ప్రక్క ప్రక్క ఇళ్ళు. మా పెద్దనాన్న ఇంట్లో చాలామంది ఉంటారు, పెద్ద కుటుంబం. మాది చిన్న కుటుంబం. ఈనాటి కలలో మేమందరం ఉమ్మడి కుటుంబంగా జీవిస్తున్నామట. ఆ కల ఈవిధంగా ఉంది.

**తేది 02-10-2006 కల (విజయదశమి) :** ఈ కలలో మేము మరియు మా పెద్దనాన్న ప్రక్క ప్రక్కన విడిగా ఇండ్లలో ఉంటున్నప్పటికీ అందరం ఉమ్మడి కుటుంబంగా జీవిస్తున్నాము. మా నాన్న మరియు మా పెద్దనాన్న జీవించి ఉన్నారట. ఈ పండుగకు సత్యనారాయణ స్వామి వ్రతం చేయాలని నిర్ణయించి, మా పెద్దనాన్న వారింట్లో అన్ని ఏర్పాట్లు జరుగుచున్నవి. సత్యనారాయణ పీటను చక్కగా పూలతో అలంకరించారు. ఇంతలో ఎవరో ఒక అదృశ్య వక్తి ఈ వ్రతమును ఎవరు చేస్తారు? అంటే పీటలపైన ఎవరు కూర్చుంటారని అడిగారు. ఇంతలో మా పెద్దనాన్న మనుమరాలు భారతి (నాకంటే పెద్దది) సాయిరెడ్డి, సురేఖలు కూర్చుంటారు, దీని దగ్గరికి ఎవ్వరూ రాకూడదని గట్టిగా అన్నది. ఈ కలలో పూలతో అలంకరించిన సత్యనారాయణ స్వామి పీటను, మరియు మా తండ్రి గారిని స్పష్టంగా చూశాను. ఇంతే కల.

మా వంశంలో నన్ను ప్రధాన వ్యక్తిగా ఎన్నుకున్నారని అర్థం.

## మా తోట బావి వద్ద రెండు ఆలయాలు నిర్మిస్తానని సూచించుట

నేను శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠమును స్థాపించి 4 సంవత్సరములు పూర్తైంది. ఈ విజయదశమి రోజు ప్రత్యేక పూజలు చేశాను. మరియు ఇలా ప్రార్థించాను.

నేను 2005 నుండి హబ్సీగూడ లోని కాకతీయ నగర్ లో నివసిస్తున్నాను. ఈ కాలనీలో శ్రీమహంకాళి సమేత శ్రీ రామాలయం ఉన్నది. ఇదే ఆలయంలో పురాతన పోచమ్మ దేవాలయం ఒకటుంది. గత కొన్ని రోజుల ముందు ఈ అమ్మవారి ముందు ఉన్న గద్దె పైన సింహాన్ని నా ఖర్చులతో ప్రతిష్ఠించాలనుకున్నాను. ఈ విధంగా ప్రతిష్ఠించాలనే విషయాన్ని మా అమ్మ లక్ష్మీమాత ఆజ్ఞాపిస్తే బాగుండునని అనుకున్నాను. అమ్మవారిని పలుమార్లు ప్రార్థించాను, లాభం లేకపోయింది. కాని ఇంతలో వేరేవారు ఈ పని చేశారు. దీనిని తేది 30-09-2006 నాడు తెలుసుకుని బాధపడ్డాను. నాకు అమ్మవారు సరైన సమయంలో ఆజ్ఞ ఇవ్వలేదని చాలా రోజులు చింతించాను. అప్పుడు వారు చింతించకు, నీకు మరో ప్రతిష్ఠ చేసే అవకాశం లభిస్తుందన్నట్లు ఈ లీలలో చూపారు.

**తేది 30-10-2006 కల :** నేను నా భార్య కలిసి మా సొంత డబ్బుతో మా ఊరిలోని మా తోటబావి భూమిలో రెండు చిన్న ఆలయాలను నిర్మించామట. మరియు అందులో విగ్రహ ప్రతిష్ఠ కూడా చేశామట. వీటిని క్రొత్తగా ప్రతిష్ఠించినందున ఆ ప్రాంతపు ప్రజలు, మా గ్రామస్థులు మాకు తెలిసిన చాలామంది ఈ ఆలయాలను, అందులోని దేవతలను చూచుటకు లైన్ కట్టారు. నేను మా ఊరిలో ఒక సంవత్సరం క్రిందనే మంచి ఇల్లు ఒకటి నిర్మించుకున్నానట. నేను, నాతోపాటు మరికొందరు ఈ ఇంటి పోర్టికో క్రింది నుండి ఈ ఆలయాన్ని చూచుటకు బయలుదేరాము. కాని చిత్రం ఏమిటంటే నేను ఆ గుడి దగ్గరకు పోనప్పటికీ ఆ దేవతను స్పష్టంగా చూడగలిగాను. ఆమె 2 అడుగుల ఎత్తుతో ఉన్న ఎల్లమ్మ లేక పోచమ్మ లేక మరో దేవత. మొత్తం మీద లక్ష్మీ రూపవతి. అత్యంత నల్లగా ఉంది. కల చెదిరింది.


దీనర్థం నాకు రాబోవు కాలంలో మా ఊరిలోని మా తోటబావి భూమిలో రెండు ఆలయాల నిర్మాణ అవకాశం లభించునని, మరియు అందులోని దైవం ఎప్పటికీ నా కళ్ళలో కనబడునని భావం. బహుశా స్వామి మరియు అమ్మవారిది రెండు ఆలయాలు నిర్మిస్తానని సూచించారు.

## మా తోట బావి వద్ద నిర్మించిన ఆలయాలు దివ్యదేశం లాగా ఉండగలవని సూచించుట

చిన్నగుండవెల్లి లోని మా తోటబావి పొలము వెనకాల 'దొల్లోని కుంట' అనే ఒక చిన్న చెరువు ఉన్నది. స్వామివారు దీనిని ఉపయోగించి ఈ క్రింది లీలను చూపారు.

స్వామివారిని చూడక చాలారోజులైంది. ఆయనను కాని

ఆయన లీలలను కాని చూడాలని ఎంత ప్రయత్నించినప్పటికీ లాభం లేకపోయింది. శ్రీవేంకటేశ్వరుడు నా ప్రార్థనతో సంబంధం లేకుండా వారి ఇష్టానుసారమే లీలలను చూపుననే అభిప్రాయం దృఢపడసాగింది. ఈరోజు ఒక ప్రత్యేకమైన కల కన్నాను. అది ఇలా ఉంది.




చలి కాలములో పొగలు కక్కుచున్న చెరువు

**తేది 05-01-2007 కల :** నేను, నా ఇద్దరు సహచరులతో కలిసి మా తోటబావి పొలము ప్రక్కనున్న చిన్న చెఱువు వద్దకు స్నానానికని పోయాము. అది చలికాలము కాబట్టి నిండా కప్పుకుని వణుకుచు పోయాము. కాని ఆ చెఱువులో నీరు చాలా వేడిగా పొగలు క్రక్కుచున్నవి. ఆ నీటి వేడి ఎలా ఉన్నదంటే, బదరీనాథ్ లో అంత దట్టమైన చలిలో, గుడివద్దనున్న ఉష్ణగుండం నుండి పొగలు ఏవిధంగా వస్తుందో అదేవిధంగా ఈ చెఱువులోని నీటినుండి వేడి పొగలు వస్తున్నాయి. ఇది చలికాలము, తీవ్రమైన చలి ఉంది. నేను స్నానానికని పోయాను. కల చెదిరింది.

మొదట్లో దీనర్థం గ్రహించలేదు, కాని దీని నిజమైన అర్థం – మా తోట బావి వద్ద నిర్మించే ఆలయాలు (బద్రీనాథ్ లాగా) ఒక దివ్యదేశము లాంటి శక్తి కలవిగా ఉండునని భావించాను. బహుశా మా తోటబావి కాడి ఆలయాలను బద్రీనాథ్ తో పోల్చాలనే జ్ఞానాన్ని కలిగించుటకు వీలుగ, గతంలో స్వామివారు నన్ను బద్రీనాథ్ తీసుకెళ్ళారనిపించింది.

## సురేఖను అనుగ్రహించుట

మా 'నమో వేంకటేశాయ' రథం అత్యంత సుందరంగా ఉంటుంది. ప్రతి ప్రక్క స్వామివారు, వారిపైన పద్మ రేకులతో ఉన్న ఒక చక్కని డిజైన్ కప్పులాగా ఉంటుంది. దాని క్రింద ప్రతి ప్రక్క 'నమో వేంకటేశాయ' అని వ్రాసి ఉంటుంది. మేము దీనిని స్వామివారి సేవకు తప్ప ఇతరత్రా వాడము, ఎవరికీ ఇవ్వము. కాని ఒక సందర్భంలో నా మిత్రుడు కె.కె.రాజా మరియు ఎం.ఎన్. ఆర్ విద్యాసంస్థల అధిపతి ఎం.ఎన్.రాజు గారి అభ్యర్థన మేర, ఈ రథమును తేది 02-01-2007 నుండి 10 రోజులవరకు వారి శ్రీవేంకటేశ్వర ఆలయ మొదటి బ్రహ్మోత్సవాల నిమిత్తమై ఇచ్చాము. సంగారెడ్డి పరిసర ప్రాంతాలలో 150 గ్రామాలలో త్రిప్పుచు ప్రచారం చేస్తామని తీసుకెళ్ళారు. స్వామివారిని ఆజ్ఞ ఇవ్వమని ప్రార్థించి, మా డ్రైవర్ మరియు పాండురంగారావు గారిని తోడుగా ఇచ్చి రథాన్ని ఇచ్చాము. ఈ యాత్ర ముగించుకుని తేది 11-01-2007 రాత్రి దాదాపు 3.20 గంటలకు తిరిగి మా ఇంటికి వచ్చింది. ఆ రాత్రి నా భార్య సురేఖ లేచి తలుపులు తీసి రథమును షెడ్డులో పెట్టేవరకు ఉండి తిరిగి పడుకుంది. అప్పుడు వచ్చింది ఆమెకు ఈ కల.

శ్రీవేంకటేశ్వరుడు సురేఖను ఒక ప్రత్యేక పద్ధతిలో అనుగ్రహిస్తాడు. ప్రతి రథయాత్ర వస్తుందనగా ఒక చుట్ట చుట్టుకున్న పాములో కదలికలు మొదలవుతాయి. రథయాత్ర జరిగినన్ని రోజులు ఈ పాము తిరుగుతూ ఉంటుంది. రథయాత్ర అయిపోగానే వచ్చి మా రథం షెడ్డులో తిరిగి చుట్ట చుట్టుకొని పడుకుంటుంది. ఈనాడు కూడా ఇదే విధంగా జరిగింది కాని కొంచెం తేడాతో కల కన్నది.

**తేది 12-01-2007 కల :** ఈ లీలలో ఆమెకు రథం కనబడింది. అందులో రథం పైన ఉన్న 'నమో వేంకటేశాయ' అని వ్రాసి ఉన్న స్థలము చాలా పెద్దగా కనిబడినదట. ఈ తామర రేకుల క్రింది భాగమునుండి దాదాపు 1' 6" వ్యాసము కలిగిన చాలా పొడవైన ఒక నల్లని త్రాచుపాము ప్రాకుచు, అడ్డముగా పోవుచు చివరికి ఈ రథములో ఉన్న శ్రీవేంకటేశ్వరుని పాదాలకు చుట్టుకొని పడుకున్నదట. ఈ సంఘటన చూచి భయపడి సురేఖ గాబరాగా మేల్కొన్నది. కల అని భావించి తిరిగి పడుకున్నది. ఈవిధంగా సురేఖను స్వామివారు అనుగ్రహించారు.

## దేవతలకు లభించని భాగ్యాన్ని ప్రసాదించుట

స్వామివారిని కాని ఆయన లీలలను కాని వరుసగా 10 రోజులు చూడనిచో మనస్సు కలత చెందును. ఈ మధ్యన స్వామి లీలలను చూడలేదు. నేనేదో తప్పు చేశానని, ఫలితంగా స్వామివారు కనబడుట లేదని భావించాను. చాలా బాధ పడ్డాను. ఎన్నోసార్లు క్షమించమని వేడుకున్నాను కాని లాభం లేకపోయింది. చివరికి తేది 15-01-2007 నుండి నాకు సహాయం చేయమని, స్వామివారి దర్శనాన్ని కలిగించమని శ్రీ ఆంజనేయునికి ప్రత్యేక పూజలు చేయుట ప్రారంభించాను. ఈ రోజు రాత్రి మనస్సు తేలికైంది, స్వామి ప్రభావం స్పష్టంగా కనబడ్డది. తేది 16-01-2007 రాత్రి ఆ స్వామివారు మహదానందాన్ని కలిగించారు. దేవతలకు సహితం దొరకని భాగ్యాన్ని నాకు ప్రసాదించారు. ఇది

నా జీవితానికి మరో ఆణిముత్యం లాంటిది. ఇందులో శ్రీకృష్ణుడు మరియు రాధా మాత ఇద్దరూ కలిసి ఈ భాగ్యాన్ని ప్రసాదించారు. భగవంతుడు భక్తులతో ఏవిధమైన ఆటలు ఆడుదురో ఈ లీలలో కొంత చూపారు. రాధాకృష్ణులు ఏకమైపోయారు, రకరకాల విన్యాసాలు చేశారు. వారిని తనివితీర దర్శించి ధన్యుడనైనాను. ఆ లీల ఈవిధంగా ఉంది.

నేను కన్స్ట్రక్షన్ రంగంలో వ్యాపారము చేస్తూ జీవిస్తున్నాను. ప్రతి పర్యాయము ఒక నాలుగైదు ఇండిపెండెంట్ ఇళ్ళు నిర్మించి అమ్ముతాను. వీటిని ఉపయోగించి ఈ లీలను చూపారు.

**తేది 17-01-2007 కల :** బహుశా నేను నిర్మిస్తున్న ఒక ప్రాంతములో ముందు రెండు ఇళ్ళు, వెనుక మరో రెండు ఇళ్ళు నిర్మాణములో ఉన్నవి. ఇవి గ్రౌండ్ మరియు ఫస్ట్ ఫ్లోర్ కలిగి ఉన్నాయి. ఫస్ట్ ఫ్లోర్ లో పెద్ద బాల్కనీ, దానిపైన చక్కని పర్గోలాలు అందం కోసం చేయబడి ఉన్నాయి. ఈ ఇళ్ళు ఐదు ఆరు అడుగుల గ్యాప్ తో రెండు వరుసలలో ఉన్నవి. రెండవ వరుసలో శ్లాబ్, బ్రిక్ వర్క్ (గోడలు) పూర్తి కాబడ్డవి. దీనికి ముందు ఉన్న మొదటి వరుసలో వీటికి కూడా చక్కని పెద్ద బాల్కనీ దానిపైన పర్గోలాలు ఏర్పాటు చేయబడి కలరింగ్ కూడా అయిపోయింది. నేను ఒకరోజు పరిశీలన (ఇన్స్పెక్షన్) కోసమని వచ్చాను. కన్స్ట్రక్షన్ పూర్తిగా కాని ఇంటి హాల్ కిటికీ గుండా ఎవ్వరికీ కనపడకుండా ఎదురింటి ఫస్ట్ ఫ్లోర్లో ఉన్న బాల్కనీ లేదా వరండా వైపు ఎందుకో చూశాను. ఆ బాల్కనీకి పైన పర్గోలాలు ఉన్నవి. ఆ బాల్కనీలో నాకు శ్రీకృష్ణుడు దర్శనమిచ్చాడు. వీరు రామానంద్ సాగర్ గారి శ్రీకృష్ణ సీరియల్ లో కంసుణ్ణి చంపే వయస్సుతో, దాదాపు 11-13 సంవత్సరాల మధ్యలో ఉన్నట్లు ఉన్నారు. అదే రూపురేఖలతో చక్కని కిరీటముతో చేతిలో పిల్లనగ్రోవి పట్టుకుని కనబడ్డారు. ఆయన ప్రక్కన రాధామాత తెల్లని వస్త్రధారణతో




పక్షి రూపములో ఉన్న దేవత
రాధాకృష్ణులను చూచుటకు ప్రయత్నించుట

ఉన్నది. ఇలా ముందు శ్రీకృష్ణుణ్ణి చూచి ఆనందించాను. ఆ తరువాత రాధామాతను చూచి మరింత ఆనందించాను. వీరిని నేను ఎవ్వరికీ తెలియకుండా దొంగచాటుగా చూస్తున్నాను. ఇదేవిధముగా బహుశా ఒక దేవత, (వారు నాకు తెలియదు) ఒక పక్షి వేషములో పైన ఎగురుచూ ఈ రాధాకృష్ణులను చూడాలనే కోరికతో, అటునుండి ఇటు, ఇటునుండి అటు ఆకాశంలో ఎగురుచూ పోవుచున్నారు, పైన ఉన్న పర్గోలాలు మరియు శ్లాబ్ అడ్డుగా ఉన్నందున, స్వామివారు కనబడలేదు. కావున వంగి వంగి వారి దర్శనానికై ప్రయత్నిస్తున్నారు. దీనిని భగవానుడైన శ్రీకృష్ణుడు గమనించాడు. చిరునవ్వు నవ్వాడు. పిదప ఈ దేవతకు కనబడకుండా ప్రక్కకు తప్పుకున్నాడు. మరో క్షణములో ఆయన ఆ రాధ రూపములో లీనమైపోయాడు. వెంటనే ఆ రాధ కూడా చూచువారికి కనబడకుండా ఒక ముసలి ముఖమును ధరించింది. పిమ్మట తనను గుర్తు పట్టకుండా ఉండుటకు ఆ తెల్లనైన ముసలి ముఖమునకు ఆరు ఇంచుల వరకు గడ్డము పెంచింది. ఇంతలో ఆ గడ్డము ఒక శరీరపు గడ్డగా, అది దవడ క్రింద ఉన్నట్లు మారిపోయింది. ఆ తరువాత ఒక పిచ్చిదానిలాగా, ఆ గడ్డను ఆమె చేతులతో పైకి ఎత్తుచు నాలుకతో అందుకొనుచున్నది. ఇదంతా ఆ చూచువారు వీరిని గుర్తుపట్టరాదని, పట్టకూడదనే భావముతో చేస్తోంది. దీనినంతా నేను కిటికీ గుండా చక్కగా చూస్తున్నాను. కల చెదిరింది.

అంటే దేవతలకు చూపరాని స్వామి వారి అనుగ్రహాలను నాకు కలిగించి ధన్యుణ్ణి చేశారని అర్థం. దీని మరో అర్థం ఈవిధంగా భావించాను. ఓయీ! దేవతలకు సైతం ప్రసాదించని భాగ్యమును నీకు ప్రసాదిస్తున్నాను, ప్రతిగా తన సంకల్పమును నెరవేర్చుమన్నాడు.

## మాస పత్రిక వైపు అడుగులు


**ఆత్మ పరిశీలన:** గత 2 సంవత్సరాల నుండి నా ఆర్థిక పరిస్థితి దినదినము దిగజారింది. హైదరాబాద్ భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. కాని నేను మాత్రం వ్యాపారం చేయలేని స్థితికి వచ్చాను. ఏ తప్పు చేశానని స్వామివారు నన్ను కరుణించలేదని ఆలోచించాను. నాకున్నది మొత్తం ఆయనదేనని భావించాను. అలాంటప్పుడు ఆస్తి పోతే నేనెందుకు దుఃఖించాలి? నాలో ఇంకా అహం చావలేదు, స్వార్థం వీడలేదు, నేను పూర్తిగ ఆయనవాణ్ణి కాలేదని బాధపడ్డాను. గత రెండు సంవత్సరాల నుండి చేసిన దాదాపు 20 క్రయ విక్రయాలలో నష్టం జరిగిందంటే నన్ను మార్చుటకు స్వామివారు ప్రయత్నిస్తున్నారనుకున్నాను. ఆర్థిక నష్టంతో పాటు అవమానము, మానసిక చింతనా ఎక్కువైనాయి. నేను స్వామివారు చెప్పినట్లు 'నమో వేంకటేశాయ' మాసపత్రికను మాత్రమే ప్రారంభించలేదు.

ఇది నాకు వీలు పడలేదు, పైగా నా భార్యకు ఇష్టం లేదు కాబట్టి విరమించుకున్నాను. ఇలా ఆలోచిస్తున్నప్పుడు నేను నా ప్రభు మాటను విననందుకు బాధ కలిగింది. ఎలాగైనా ఈ పత్రికను ప్రారంభించాలని అనుకున్నాను. గతంలో ఈ పత్రిక విషయమై శ్రీ అజయ్ కళ్యాం గారిని మరియు శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామివారి అభిప్రాయాలు సేకరించాను. వారు స్వామి చెప్పినట్లు చేయమన్నారు. కాబట్టి చివరి అస్త్రంగా ఈ పత్రికను వచ్చే ఉగాది 19-03-2007 నుండి ప్రారంభించాలని నిర్ణయించుకున్నాను. నాకు తెలిసిన ఇద్దరు పత్రికా రంగ మిత్రులు సహాయము చేస్తామన్నారు. ఒక కంప్యూటర్, కావలసిన సామానును సేకరించాము. యాడ్ ఇచ్చాను. మరియు 'నమో వేంకటేశాయ' పత్రిక ప్రారంభిస్తున్నామని టీవీలో స్క్రోలింగ్ ఇచ్చాను. కాని ఇంతవరకు నా భార్యకు చెప్పలేదు. ఈ విషయాన్ని నా భార్యకు మీరే చెప్పి ఒప్పించమని స్వామివారిని వేడుకున్నాను. తేది 11-02-2007 వరకు స్వామివారు చెప్పకపోతే నేనే చెప్పుదునని అనుకున్నాను. చివరికి శనివారం తేది 10-02-2007 నాడు నా భార్యతో నేనే చెప్పాను. ఇది స్వామి ఆజ్ఞ అని మనము పాటించాలని అన్నాను. దీనికి ఆమె ఒప్పుకున్నది. మరియు ఆమె, ఆస్తి గొడవలప్పుడు స్వామి సేవకు 2 లక్షలు ఖర్చు పెట్ట నిర్ణయించానని వాటిని ఈ పత్రికకు వాడమన్నది. మరియు ఇది చివరి ప్రయత్నమని, ఆ తరువాత స్వామి దయ అని అన్నది. నేను చాలా సంతోషించాను. తెల్లవారి తేది 11-02-2007 రోజు మా పరిస్థితి ఎంతటి దయనీయ స్థితికి వచ్చిందీ, మేము ఏమి చేయాలి, ఎలా జీవించాలి అని ఆలోచిస్తూ పడుకున్నది. ఈరోజు రాత్రి సురేఖకు ఒక చక్కటి కల రూపంలో నేను కోరినట్లు స్వామివారు ఈవిధంగా చెప్పారు.

## స్వామివారిని పొందుదురని సూచించుట

అప్పుడు మా పరిస్థితి అగమ్య గోచరంగా ఉన్నది. వ్యాపారం చేయుటకు ఏమాత్రం డబ్బులు లేవు, పని పాట లేనివారిలాగా, ఏ దారి తెలియక చుట్టూ చీకట్లు కమ్మిన వారిలాగా ఉన్నాము. ఈ పరిస్థితిని స్వామివారు ఉపయోగించుకున్నారు.

**తేది 12-02-2007 కల :** నేను నా భార్య సురేఖ కలిసి ఏదో ఒక పనిమీద ఒక ఊరిలో ఒక (దారి) పిల్లబాట వెంట నడుచుకుంటూ పోవుచున్నామట. ఇంతలో ఆమెకు ఈ దారి కొంచెము దూరములో కనబడకుండా పోయింది. ఈ దారి మొత్తం అన్నీ గులకరాళ్ళతో, ముళ్ళతో నిండి ఒక గోయి లాగా మారిపోయిందట. కాలు ముందుకు పెట్టే విధంగా లేదు. ఈ దారి వెంట మనము ఏవిధంగా పోగలము సాయిరెడ్డి? అని నన్ను ఆమె అడిగిందట. నేను ఆమె మాటలను పట్టించుకోకుండా నా ప్రక్కన ఉన్న అదృశ్య వ్యక్తితో మాట్లాడుచూ నిలబడిపోయానట. ఆమె




**గులకరాళ్లతో నిండిన దారి,**
**అంధకారము తరువాత స్వామి వారు**

మాత్రము కష్టపడుచు మెల్లమెల్లగా ముందుకు పోవుచున్నదట. ఇంతలో ఎవరో ఒక అదృశ్యరూపుడు లేక ఒక స్వరము ఈవిధంగా అన్నదట. "పో.. అమ్మా పో.. అక్కడ ఆయన ఉన్నాడు పో.., ఏం కాదు పో.." అన్నాడట. ఈమె ఇంకా కొంచెము ముందుకు నడిచిందట, కాని అక్కడ దారి లేదు. ఈ గుంత పెద్దదైంది, కాబట్టి పోరాదని ఆలోచిస్తూ నిలబడిందట. ఇంతలో ఆ స్వరము మళ్ళీ "పో.. అమ్మా పో.., ఆయన ఉన్నాడు వెళ్ళు ఆగకు, నీకేం కాదు వెళ్ళు" అన్నదట. ఈమె కూడా ఇక్కడ ఆయన ఉన్నాడా? అని అనుచు ఇంకా ముందుకెళ్ళిందట, ఇంతలో ఆ గుంత పెద్ద దిగుడుబావి లాగా మారి దట్టమైన అంధకారములో రాళ్ళతో నిండి ఉన్నదట. ఆ స్వరము ముందుకు వెళ్ళమంటున్నది, ఈమె మెల్ల మెల్లగా ముందుకు వెళ్ళుచున్నది. ఆ అంధకారము ముందుకు వెళ్ళినకొద్దీ తగ్గుచున్నది. లోతు పెరుగుచున్నది. ఈమె వెళ్ళుచున్నది. ఇంతలో ఆ బావి చాలా లోతులో ఒక చిన్న చేద బావిలాగా మారి ఇంకా లోతుకు పోయిందట. ఈమె చూపు కూడా ముందుకు వెళ్ళిందట. ఈ చూపు ముందుకు వెళ్ళినకొద్దీ ఆ బావి స్పష్టంగా కనబడుచున్నదట. ఆ స్వరము మాత్రము వెళ్ళు వెళ్ళుమని అనుచున్నది. ఆ చేద బావి చివరలో (నీరు లేదు) స్పష్టంగా మహాకాంతితో అడుగు కనబడిందట. ఆ కాంతిలో ఆ బావి అడుగున ఒక నల్లని ఆకారముతో దాదాపు ఒక అడుగు ఎత్తు ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి వారు కనబడ్డారు. ఇంతలో కల చెదిరింది. ఆమె భయపడి మేలుకుంది. తెల్లవారి ఈ విషయం నాతో చెప్పింది. దీనిని నేను చాలా ఆనందంగా అనుభవించాను. స్వామివారి కరుణ మాపై ఉన్నదని, తిరిగి మేము ఆయన ప్రేమను పొందుచున్నామని ఆనందించాను. ఈ కలకు గల అర్థమును నా భార్యకు ఇలా వివరించాను. మేము మా చుట్టూ ఉన్న పరిస్థితులకు వెరవక స్వామి చెప్పినట్లు ముందుకు

వెళ్ళి నట్లైతే మాకు శ్రీవేంకటేశ్వరుడు లభించునని అర్థం. ''మనము ఆయనను నమ్మి, శరణు జొచ్చి, పూర్తి విశ్వాసముతో భయపడకుండా ఆయన సేవ చేయాలి. అప్పుడు ఆయన కృప లభిస్తుందని అన్నాను. ఇలాంటిది నాకు కూడా ఒకసారి ''నమో వేంకటేశాయ'' పత్రిక ప్రారంభించుమన్నప్పుడు చూపాడని అన్నాను. ''ఒక కొండపైనున్న స్వామివారి ఆలయాన్ని చూపి, నా ఎదుటి గోతులను పట్టించుకోకుండా వేగంగా వెళ్ళి స్వామిని చేరమన్నాడు''. ఇదే విషయాన్ని ఇప్పుడు సురేఖతో చెప్పాడని భావించాను. ఇది మా జీవితంలో మరో ఆణిముత్యం లాంటి లీల. ఇప్పుడు మేమిద్దరము స్వామి వారి పత్రికను ప్రారంభించుటకు దృఢ నిర్ణయము తీసుకున్నాము.

## మొదటి సంపాదకీయం

తేది 16-02-2007 శుక్రవారం, శివరాత్రి మరియు శ్రవణా నక్షత్రం అన్నీ కలిసి వచ్చిన రోజు. ఈరోజు స్వామివారిని అభిషేకించి పత్రిక ప్రారంభించుటకు కావలసిన శక్తిని ప్రసాదించుమని వేడుకున్నాను. మరోప్రక్క పత్రికా రంగములో పరిచయమున్నవారిని కలుసుకుని సలహాలు తీసుకుంటున్నాను. ఈ క్రమములో టిటిడి అన్నమాచార్య ప్రాజెక్ట్ ఎక్స్ డైరెక్టర్ డా॥ కామిశెట్టి శ్రీనివాసులు గారిని కలిసి సహాయపడమన్నాను. ఈయన నా ఉద్దేశాలు పూరించే విధంగా 'సంపాదకీయం' ను వ్రాసి తీసుకురమ్మన్నాడు. ఆ రోజు సాయంత్రం 7 గంటల ప్రాంతంలో మా ఆఫీసులో స్వామివారిని స్మరించి, మా తల్లితండ్రులను స్మరించి ప్రథమ సంచికకు నా మొదటి సంపాదకీయమును ఈవిధంగా వ్రాశాను.

## స్వామి ఆజ్ఞ...! నా కర్తవ్యం...!

**కృతేతు నారసింహ భూః త్రేతాయాం రఘునందనః!**
**ద్వాపరే వాసుదేవశ్చ కలౌ వేంకట నాయకః!!**

భగవంతుడు ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క అవతారంలో మనల్ని రక్షించి కాపాడునని స్వయంగా భగవద్గీతలో చెప్పాడు. ఆ ప్రకారం ఆయన కృతయుగంలో నారసింహునిగా, త్రేతాయుగంలో శ్రీరామునిగా, ద్వాపరంలో శ్రీకృష్ణునిగా జన్మించి పాపులను దండించి, ధర్మాన్ని రక్షించి మానవజాతి ధర్మమార్గంలో నడిచేవిధంగా సరిదిద్ది, మానవులకు ధర్మంపై, దేవునిపై నమ్మకం కలిగే విధంగా చేశారు. ప్రస్తుతం కలియుగంలో భగవంతుడు శ్రీవేంకటేశ్వరుని రూపంలో ఉన్నాడని మన పురాణాలు, ఇతిహాసాలు చెప్తున్నాయి. శ్రీవేంకటేశ్వరుని నిలయమైనటువంటి తిరుమల కొండ చాలా పవిత్రమైనది. సమస్త బ్రహ్మాండములలో ఆ ప్రదేశానికి గల స్థాన ప్రాముఖ్యత వేరే ఇతర ప్రదేశాలకు లేదంటారు. అంతేకాకుండా ఆ భగవంతుని రూపాలు అనేకం. కానీ శ్రీవేంకటేశ్వరుని రూపం అతి మనోహరమైనది, మైమరపించేది, ఆనందదాయకమైనది, మోక్షదాయకమైనది. ఆ రూపంలోనే మన జీవన విధానం దాగి ఉన్నది. ఆయనకు నమస్కరించినవారు, శరణాగతులైనవారు ఆయనకు ప్రియులు. వారి కష్టనష్టములను కడతేర్చి వారి మనోభిలాషను తీర్చేటువంటి ప్రభువు శ్రీ శ్రీనివాసుడు. శ్రీవేంకటేశ్వరుని ప్రాశస్త్యమును, మహిమలను ప్రజలకు తెలుపవలెననే సంకల్పముతో, ఆయన కరుణా కటాక్షాలకు సర్వులను పాత్రులుగా చేయవలెననే ఉద్దేశ్యముతో ఈ 'నమో వేంకటేశాయ' అనే పత్రికను మొదలుపెట్టటం జరిగింది.

స్మరణాత్సర్వ పాపఘ్నం, స్తవనాదిష్టవర్షిణమ్ ॥ ఆ స్వామిని స్మరిస్తే చాలట, పాపాలన్నీ పోతాయి. ఆ దేవుని కీర్తిస్తే చాలట, కోరికలన్నీ తీరుతాయి.

కావున ఇంతటి విలువైన ఆయన నామాన్ని అందరూ స్మరించాలనే ఉద్దేశ్యంతో సమయం దొరకక సతమతమవుతున్న ఈ నవీన యుగంలో కనీసం ఈ పత్రిక కవర్ పేజీపై ఉన్న 'నమో వేంకటేశాయ' అనే నామాన్ని చదివి స్మరించి వారికి తెలియకుండానే వారి మనసుల్లో స్వామివారికి నమస్కరించవలెననెడి ఉద్దేశ్యముతో ఈ 'నమో వేంకటేశాయ' అనే పదమును ఈ పత్రికకు ఎన్నుకోవడం జరిగింది. ఇంతటి మహిమ కలిగిన ఆ స్వామి నామాన్ని మా ద్వారా అందరూ స్మరించాలనే కోరికతో... ఆ స్వామి సేవే మా పరమ ధర్మంగా భావించి స్వామివారికి వారి భక్తులకు దాసులమై ప్రజలలో భక్తి భావాన్ని పెంపొందించే విధంగా, స్వామి పట్ల సమర్పణ భావాన్ని పెంపొందించే విధంగా ఈ పత్రిక ఉపయోగపడుతుందని విశ్వసిస్తున్నాము.

గత 5 సంవత్సరాల నుండి మేము స్వామి సేవ చేస్తున్నాము. 2002 సంవత్సరంలో తిరుపతిలోని ''ఎస్.వి డైరీఫారమ్'' నందు మొట్టమొదటి శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపమును నిర్మించి, శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠము ద్వారా ప్రతి సంవత్సరం కనీసం 70 వేల మంది భక్తులచే ఆయన అష్టాక్షరి మంత్రమును ఏడుకోట్ల సార్లు వ్రాయిస్తున్నాము. మరియు హైదరాబాద్ నుండి తిరుపతి వరకు ''నమో వేంకటేశాయ'' రథయాత్రను నిర్వహిస్తూ, వీలైనంత ఎక్కువమందిచే స్వామి నామస్మరణ చేయిస్తూ, 7 కోట్ల జపమును ప్రతి గోకులాష్టమి రోజున స్వామివారి పాదాలకు నివేదించి స్వామివారికి సమర్పిస్తున్నాము. స్వామివారి స్మరణకు కారకులము కావలెనని భావించి నిజమైన ఆ స్వామికి నిజమైన పాదసేవకునిగా మిగలాలనే కోరిక. ఈ ''నమో వేంకటేశాయ'' పత్రిక వెలువడుటలో కొంత జాప్యము చేసినందుకు స్వామిని క్షమించమని ప్రార్థిస్తూ ఈ పత్రిక మా నుండి వెలువడుట స్వామి

ఆజ్ఞగా భావించి దీనిని మీ ముందుంచుతున్నాం. సర్వులకు ఆ స్వామి అనుగ్రహం లభించాలని మనస్పూర్తిగా కోరుతున్నాం.

**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు**
**పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)**

తెల్లవారి దీనిని శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు గారికి చూపెట్టాను. ఆయన సంతోషించారు. తర్వాత పత్రిక గురించి కొన్ని మెలకువలు చెప్పారు.

## భాగవతుల ఆశీర్వాదం మరియు కాలక్షేపం వద్దనుట

**తేది 21-02-2007 కల :** ఈ కలలో నేను ఒక ఇంటిలోనికి వెళ్ళాను. అందులో 25 నుండి 40 సంవత్సరాల వయస్సున్న స్వాములు చాలామంది ఉన్నారు. అందరూ కాషాయరంగు బట్టలు ధరించారు. చక్కని విభూతి ధరించి ఉన్నారు. వారు నన్ను ఆహ్వానించి మామూలుగనే ఉన్నారు. ఇంతలో ఒక స్వామి నా వద్దకు వచ్చి నీ వద్ద ఏదో వాసన వస్తున్నదన్నారు. నీవు ఏదో తీస్తున్నావట కదా అందుకే ఈ వాసన వస్తున్నదని అన్నారు. వారి ప్రసాదమును నాకు పెట్టారు. ఇంతే కల. ఈ పత్రిక ద్వారా నాకు భాగవతుల ఆశీర్వాదం లభించునని భావం.

ఇప్పటి నుండి శ్రీవేంకటేశ్వరుడు నన్ను ప్రత్యేకంగా గమనించుట మొదలుపెట్టాడు. నేను కూడా కేవలం నా లక్ష్యం పైననే దృష్టి పెట్టి పయనిస్తున్నాను. ఈ లీల ఈ విధంగా ఉంది.

**తేది 22-02-2007 కల :** ఇది ఒక హృదయాంతరంగ భావన. నన్ను వేరే వారిపై లేదా ఇతర విషయాలపై ధ్యాస పెట్టకుమన్నారు. ఆ విషయము లేదా ఆ వ్యక్తులు నీ గురించి చూచుట లేదు. నీవు దానిని మరచిపోయి నీ కర్తవ్యమును మాత్రమే చూచుకొమ్మని చెప్పారు. అవసరముంటేనే ఇతరులతో మాట్లాడమన్నాడు. కాలక్షేపం వద్దన్నాడు.

## గురువును పంపుట, మా తండ్రి సంతోషించుట

నేను 'నమో వేంకటేశాయ' మాస పత్రికను వచ్చే ఉగాది (19-03-2007) నుండి ప్రారంభించాలనుకున్నాను. కొన్ని వ్యాసాలను, మరికొన్ని విషయాలను చాలామంది నుండి సేకరించాను. కాని వీటిని ఏవిధంగా క్రోడీకరించాలనే విషయం నాకు తెలియదు. కొంతమంది వారింటికి రమ్మన్నారు కాని తిరుగుట నాకు సాధ్యము కాదు. ఇప్పటికే చాలా తిరిగి అలసిపోయాను. కాబట్టి నాకు ఒక సహాయకుడు ఎడిటర్ గా కావాలని, వారు మా ఆఫీసుకు వచ్చి సహాయము చేయాలని తలంచాను. పేపర్ లో యాడ్ ఇచ్చాను. కాని లాభం లేకపోయింది. చివరికి స్వామిని శరణు వేడాను. గురువు లాంటి వ్యక్తిని పంపి సహాయము చేయమన్నాను.

ఈ లీలలో స్వామివారు చక్కని సహాయకరమైన సన్నివేశాన్ని చూపారు. ఒకరకంగా ఒక దెబ్బకు రెండు పిట్టలు లాగా మా తండ్రిని కూడా చూపారు. ఆ లీల ఈవిధంగా ఉంది.

**తేది 02-03-2007 :** ఈ లీలలో నేను స్వామి దర్శనమునకై యాదగిరిగుట్టలాంటి కొండకు వెళ్ళాను. ఒక సత్రములో ఉన్నాను. నేను సిద్ధిపేటలో చదువుకున్నప్పుడు శ్రీమాన్ చుక్కా రామయ్య గారు (వీరిని ఐఐటి రామయ్య అంటారు) మా గురువులు. ఈ కలలో వీరు నాకంటే ముందుగానే ఆ కొండకు వచ్చారట. వీరు కూడా ఒక సత్రములో బస చేశారు. నేను నా సత్రములోని మొదటి అంతస్తు నుండి చుట్టూ ఉన్న ఇతర సత్రాలను చూశాను. ఇంతలో మాకు ఎదురుగా వేరే సత్రములో దిగిన శ్రీమాన్ రామయ్య గారు ఆ సత్రము ముందుకు వచ్చి అక్కడి వారితో ఒక విషయం గురించి వాదిస్తున్నారు. ఇది అలాగా... అది ఇలాగ అని అంటున్నారు. నేను ఆయనను కలవాలనే ఉద్దేశ్యముతో క్రిందికి దిగాను. కాని ఆయన లేరు, అప్పటికే వెళ్ళిపోయారు. అదే సత్రము లోనికి అంటే శ్రీమాన్ రామయ్య గారి సత్రము లోనికి వీరిగురించి చూచాను. ఇక్కడ చిత్రం జరిగింది. అక్కడ శ్రీమాన్ రామయ్యకు బదులుగా మా తండ్రి గారు ఒక ఆరాం కుర్చీలో కూర్చుని సంతోషంగా ఉండుటను చూచాను. నేను ఆయనను స్పష్టంగా చూచాను. కల చెదిరింది.

ఆ సమయాన స్వామివారు నాకు ఒక గురువును తప్పక ప్రసాదిస్తారని మాత్రమే భావించాను. కాని మా తండ్రి గారు అక్కడ ఎందుకు ఉన్నారనే విషయమును గ్రహించలేదు. దీని అసలైన అర్థం ఏమిటంటే... మీ తండ్రిని గురువుగా స్వీకరించమని, ఆయన మాటలను, ఆజ్ఞను శిరసా వహించమని స్వామి వారి ఆజ్ఞ. మరియు నేను స్వామివారి మాసపత్రిక ప్రారంభించుటను మా నాన్న చూచి సంతోషించాడని ఈ కల రెండవ అర్థంగా భావించాను.

## మొదటి సంచిక కూర్పు

స్వామివారి లీల అనుసారము తేది 02-03-2007 రోజు సాయంత్రం 4.30 గంటలకు శ్రీ మారెమండ సీతారామయ్య గారు మా ఆఫీసుకు తనంతట తానే వచ్చారు. వీరు గతంలో కొన్ని పత్రికలు నడిపినవారు. మా గురించి తెలుసుకున్నారు. నేను సంపాదించిన కావ్యాలను చూచి ఇది బాగుంది, ఇది బాగా లేదని కొంత చెప్పారు. కలలో సరిగ్గా శ్రీమాన్ చుక్కా రామయ్య గారు వాదించినట్లే వాదించారు. మరియు మాకు ఈ పత్రికకు ఉపయోగపడే విధంగా నాకు సహాయకుడుగ, గురువుగా ఉందురని నేను భావించాను. ఈ విధంగా ఈయన సహాయముతో ప్రథమ సంచిక కూర్పు పూర్తైంది. ఒక నెల

వ్యాసా లను ఏవిధంగా ఎన్నుకోవాలి, వాటిని ఏ ఆర్డర్ లో అమర్చాలనే విషయమును నేర్చుకున్నాను. తరువాత డి.టి.పి, ప్రూఫ్ రీడింగ్ చేయించాను. ఆ తరువాత పైన కలర్ పేజీలో నచ్చిన నా స్వామివారి ఫోటోలు అమర్చి ప్రింట్ చేయించాను. ఈవిధంగా మొదటి సంచిక సిద్ధం చేశాము. ఈ సీతారామయ్య గారు కేవలం రెండు సంచికలకు మాత్రమే సహాయము చేశారు. ఆ తరువాత నేనే స్వామివారి శక్తితో కూర్పు చేసుకున్నాను. శ్రీ మారెమండ సీతారామయ్య గారు గౌరవ సంపాదకులుగా, డా॥ వారణాసి వేంకటేశ్వర శాస్త్రిగారు సహాయ సంపాదకులుగా ఈ పత్రిక వెలువడింది. ఈవిధంగా స్వామివారి పత్రిక ద్వారా స్వామివారి కృపాకటాక్షాలు, దూరంగా ఎక్కడెక్కడో ఉన్న ఆయన భక్తులకు లభించుటకు సిద్ధంగా ఉన్నదని ఈ లీల ద్వారా చూపారు.

**తేది 09-03-2007 కల :** ఈ కలలో నాకు తిరుమల కొండపైన స్వామి వారి (ఆనందనిలయము) గుడి, గాలి గోపురము కనపడ్డవి. ఈ కొద్ది క్షణాలలోనే ఈ గోపురము నుండి మెరుపులు వస్తూ అవి అన్నివైపులా వెదజల్లబడ్డవి. ఈ గోపురము మధ్య నుండి మెరుపుల కిరణాలు అన్ని వైపులకు వెళ్ళినవి. ఇంతే కల.

దీనర్థం – స్వామివారి కృప లోకమంతా వ్యాప్తి చెందబోవుచున్నదని అర్థం. ఈ కల నాకు ఎంతో మనోధైర్యాన్నిచ్చింది. నేను చేయబోయే 'నమోవేంకటేశాయ' పత్రిక ద్వారా నా స్వామి కృపాకటాక్షాలు లోకమంతా ప్రసరిస్తున్నవని మురిసిపోయాను.

## కుటుంబాన్ని చూడమనుట

నేను ఈ పత్రిక గురించి ఎంతోమంది వ్యక్తులను కలిశాను. ఎన్నో విషయాలు సేకరించాను. చాలా పట్టుదలతో ఈ పత్రిక విజయవంతం కావాలని ప్రయత్నించాను. ఈ క్రమంలో మా చెల్లెలు దగ్గర ఉంటున్న మా అమ్మను చూచుట మరచాను. ఈ లీలలో స్వామివారు మా అమ్మ వద్దకు పొమ్మని, ఆమె నాకై దిగులుగా ఉన్నదని చెప్పాడు. ఆ లీల ఈవిధంగా ఉంది.


**తేది 19-03-2007 కల :** ఈ కలలో మా అమ్మ మా ఊరిలో మా ఇంటి అరుగుమీద కూర్చుండి నా రాక గురించి వేచి చూస్తున్నది. ఆమెకు ఆరోగ్యము బాగాలేదు. చేతనైతలేదట. ఇంట్లో ఊడ్చలేదు కాబట్టి చెత్త అలాగే ఉంది. తాను ఒంటరిననే భావంతో రంధి పడుతోంది. నేనేమో స్వామి గురించి ఆలోచిస్తూ ఊరంతా తిరుగుచున్నాను. మా ఊరిలోని ఒక వాడలో ఏదో ఒక పెద్ద కట్టడమును చూచి ఇది పూజకై నలుగురు జమ కావటానికి బాగుందని అనుకున్నాను. ఇంతే కల. వెంటనే నేను మా అమ్మ దగ్గరికి పోయాను. ఆమె మా చెల్లెలు వారి ఇంటివద్ద రామంతపూర్ లో ఉంది. ఆమెకు నిజంగానే జ్వరంగా ఉంది. నా గురించి వేచి చూస్తోంది. చాలా దిగులుగా, ఏకాకినని, ఒంటరితనాన్ని అనుభవిస్తున్నది. మా అమ్మను డాక్టర్ వద్దకు తీసుకెళ్ళి ధైర్యము చెప్పి వచ్చాను. ఆమె పూర్తిగా కోలుకునే వరకు జాగ్రత్తగా చూచుకున్నాను.

## దివ్య దర్శనాన్ని ప్రసాదించి సురేఖను మార్చుట

శ్రీవేంకటేశ్వరుడు నేను మరియు నా భార్య ఇద్దరము మనస్పూర్తిగా తన సేవ చేయుటకు ముందుకు వచ్చినప్పుడే మాకు తన సేవను ప్రసాదించేవాడు. ఇద్దరిలో ఏ ఒక్కరము విముఖంగా ఉన్నా ప్రసాదించడు. స్థూప నిర్మాణ సమయంలో కూడా ఇలాగే జరిగింది. ఇప్పుడు కూడా ఇలాగే జరిగింది. ఫలితంగా పత్రిక ప్రారంభ తేది ఒక వారం పొడిగించబడింది. ఆ లీల ఈవిధంగా ఉంది.

శ్రీవేంకటేశ్వరుడు నన్నే కాకుండా నా భార్య సురేఖను కూడా ఎన్నోసార్లు అనుగ్రహించాడు. ఈమధ్యన మా ఆర్థిక పరిస్థితి అత్యంత నీచ స్థితికి చేరింది. ఈ పరిస్థితిని చూచి నాకంటే నా భార్య ఎక్కువ దిగులు చెందింది. పిల్లల చదువులు, మా జీవితము గురించి ఆలోచించి చింతించింది. స్వామి కృపను పొందుటకు మొత్తం 11 రోజులు స్వామి వారికి ప్రత్యేక పూజలను చేస్తుంది. సురేఖకు నేను మాసపత్రిక ప్రారంభించుట ఇష్టం లేదు. మా తెలివి తక్కువతనమో లేక స్వామి మాయనో తెలియదు కాని స్వామి లీలల ప్రభావము మాపై కొంత మాత్రమే పని చేసేది. కొన్ని రోజుల తరువాత ఈ ప్రభావము పోయి మామూలుగా మారిపోయే వారిమి. సురేఖ కూడా ఇదేవిధంగా ఆలోచించింది. మా సొంత లాభాలను, ప్రస్తుత పరిస్థితులను, ఒక పత్రిక ప్రారంభించినచో అన్ని పనులలాగే దీనిలో కూడా నష్టం వస్తే ఎలా? ఆ స్వామి మమ్మల్ని ఎంతవరకు రక్షించగలడు? పత్రికంటే మామూలు విషయం కాదు,. రోజులో చాలా సమయము, డబ్బు వెచ్చించాలి. మేము వ్యాపారము చేయలేని స్థితి కలుగుతుంది. ఇప్పటికి నా వయస్సు తక్కువే. ఇంకో 10 సంవత్సరాల తరువాత దీని గురించి విచారించరాదా? ఇప్పుడే సన్యాసుల్లో కలిస్తే ఎలా? మరియు గత పదిహేను రోజుల నుండి పత్రిక గురించి తిరుగుచు, ఇంటికి ఆలస్యంగా రావటం జరిగింది. వచ్చినా ఇంట్లో ఎక్కువసేపు ఉండకపోవుట, మా సొంత వ్యాపారముపై శ్రద్ధ పెట్టకపోవుట, మొదలగునవి ఆమెకు చాలా బాధ కలిగించినవి. ఒక్కసారి ఆమె తల తిరిగింది. ఈ పత్రికకు వ్యతిరేకమైంది. ఫలితంగా నాతో ఇంట్లో మాట్లాడుటలేదు, కోపంగా మారింది, తన ప్రవర్తనలో ఆశ్చర్యకరమైన మార్పు వచ్చింది. ఈ పరిణామానికి నాకు మనశ్శాంతి కరువైంది. చింతించాను. ఒక 2-3 రోజుల

తర్వాత 17-03-2007 నాడు ఎందుకు ఇట్లా మారావని అడిగాను. వెంటనే ఆమె బోరున ఏడ్చింది. "నీకు ఇప్పుడు ఈ పత్రిక తీయుట అవసరమా? మన పరిస్థితి ఏమిటి? నీవు ఇలా మారిపోతే నేను, పిల్లల భవిష్యత్ ఏమగునని" విలపించసాగింది. నేను ఆ సమయంలో ఏమి చెప్పినా వినే పరిస్థితిలో లేదు. ఏమైనా అంటే నన్ను సమర్థించుకొనుటకు అన్న మాట లాగా ఉంది. ఎవరైనా ఆమెకు చెప్పారో లేక ఆమె మనస్సులో వచ్చిన ఆలోచనో తెలియదు కాని ఆ కోపతాపాలు అపారం. నేను చేసేది లేక స్వామిని మనస్సులో ధ్యానించాను. అప్పుడర్థమైంది స్వామివారు 12-02-2007 నాడు సురేఖకు కలిగించిన అనుభూతి ఇందులకే అని. నెమ్మదిగా, మనము మనమై ఈ పని చేయుట లేదు, స్వయంగా ఆయన చెప్తేనే చేస్తున్నాము. గత రెండున్నర సంవత్సరాలు ఆయన మాటను మనము వినలేదు. ఫలితంగా ఒక 20 లావాదేవీలలో నష్టపోయాము, అవమానపడ్డాము. ఎవ్వరో ఏదో చెప్పారని వారి మాట వినవద్దు. స్వామి చెప్పినట్లు నడుచుకుందామన్నాను. పైగా ఇది మన అదృష్టమన్నాను. ఈ భాగ్యాన్ని ఇతరులకు ఇవ్వక మనకిచ్చినందులకు ఆయనకు ఋణపడాలన్నాను. కాని ఆమెను సముదాయించుటకు నేనీ మాటలంటున్నట్లు అన్నది. నిన్ను సముదాయించుటే నా పని అయితే 12-02-2007 నాటి కల నేను తెప్పించిందా? అందులో ఏమి జరిగింది? మొత్తం అంధకారం, ఇంకా అంధకారం, తరువాత వెలుగు అందులో చివరికి స్వామివారు. దీనర్థం తెలుసుకొమ్మన్నాను. ఆయన చూపిన ప్రతి కల నిజమౌతోంది. మనలను దేవుడే చూచుకొనునని చింతించకుమని చెప్పాను. పైగా తాను కూడా ముందు ఒప్పుకున్నదని ఈ చివరి క్షణంలో ఆటంకం వద్దన్నాను. దీనితో మనస్సు బాగులేక పత్రిక ప్రారంభాన్ని 25-03-2007కు వాయిదా వేశాను. చివరికి సురేఖ ఒకరోజు ఆలోచించి ఒప్పుకున్నది.




ఆ తరువాత సురేఖ చేయు ప్రత్యేక పూజ తేది 19-03-2007 సోమవారం రోజు ముగిసింది. నేను ప్రతి శుక్రవారం మరియు సోమవారం స్వామివారికి అభిషేకించి పూజించుట అలవాటు. ఆమెకూడ తన పూజ సోమవారం ఉదయం ముగిసింది కావున స్వామివారిని అభిషేకించి పూజను ముగిద్దామనుకుంది. కాని తనకు అభిషేకము ఏవిధంగా చేయాలో తెలియక చేయలేదు. బాధపడ్డది. తనకు అభిషేకము చేయవచ్చినచో చేసేదానినని బాధపడుచు స్వామివారిని ప్రార్థించిందట. తిరిగి కొంతసేపటికి ఇంట్లో ఆ పని, ఈ పని చేస్తూ పూజ రూం వైపు చూచిందట. అంతే! మా పూజ గదికి గల రెండు తలుపులలో ఒకటి తెరుచుకుని ఉన్నదట. దాని ముందు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు కేవలం పంచె మాత్రమే కట్టుకుని, అభిషేక సమయాన ఏవిధంగా ఉండునో అదేవిధంగా అక్కడ నిలబడియుండుటను చూచింది. నల్లని ఆకారముతో అత్యంత సుందరమైన స్వామివారిని చూచి పరవశించిపోయింది. సురేఖ ఆనందానికి హద్దు లేదు. కల చెదిరింది. నిజానికి ఇది కల కాదు. ఉదయం 6-6.30 గంటల మధ్యన తనకు మాత్రమే కనబడు ఒక లీలను ప్రసాదించాడు. దీనితో సురేఖకు పత్రికపైన పూర్తి శ్రద్ధ కలిగింది.

## నమో వేంకటేశాయ మాసపత్రిక ప్రారంభోత్సవము

**తేది 25-03-2007 :** ఈ రోజు ఆదివారం, సప్తమి, నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఆజ్ఞాపించిన 'నమో వేంకటేశాయ' అనే తెలుగు మాసపత్రికను ప్రారంభించిన రోజు. నేటి ఉదయం మా ఇంట్లో స్వామివారిని ప్రార్థించి, ఆయన పాదాలకు మాసపత్రికను





నమో వేంటేశాయ మాస పత్రిక ప్రారంభోత్సవం దృశ్యాలు

సమర్పించాను. ఈ పుస్తకము చదివిన వారికి తమ ఆశీస్సులు కలగాలని ప్రార్థించాను.

ఉదయం 11.05 గంటల ప్రాంతమున హిమాయత్ నగర్ లో ఉన్న టి.టి.డి వారి ఆలయంలో స్వామివారి పాదాలకు సమర్పించి పూజించాము. ఆ తరువాత టి.టి.డి ఎక్స్ ఈ.ఓ శ్రీమాన్ అజయ్ కళ్ళాం గారు, ఎక్స్ టిటిడి జాయింట్ ఈ.ఓ శ్రీమాన్ ముక్తేశ్వర్ రావు గారు, శ్రీమాన్ వారణాసి వేంకటేశ్వర శాస్త్రి గారు, వేదగిరి రాంబాబు గారు, ఎక్స్ డి.జి.పి శ్రీమాన్ ప్రభాకర రావు గారు, మా ఆఫీసు స్టాఫ్, కుటుంబ సభ్యులు, భక్తుల మధ్యన ఈ పత్రికను ప్రారంభించాము. శ్రీమాన్ అజయ్ కళ్ళాం గారు తాను ఈ పత్రికలో సభ్యుణ్ణి అవుతానని రు.500 ఇచ్చారు. ఈ పత్రిక స్థాపించిన ఉద్దేశ్యము పూర్తి కావలెనని అందరూ ఆశించారు. నేను పెద్దలను సన్మానించాను. మరియు ప్రసాద వితరణ తరువాత సభ ముగించాము. ఈ విధంగా పత్రికను ప్రారంభించాము.

ఏప్రిల్ మొదటి వారం మార్కెట్ లో ఈ పత్రిక ఒక ప్రభంజనము లాగా వ్యాపించింది. మంచి ఆదరణ లభించింది. కాని తేది 10-04-2007 న ఢిల్లీ నుండి ఆర్.ఎన్.ఐ వారు ఫోన్ చేసి, మీరు సకాలంలో 'నమో వేంకటేశాయ' పత్రికను ప్రారంభించనందున ఈ టైటిల్ క్యాన్సిల్ అయిందని చెప్పారు. మమ్మల్ని మళ్ళీ అప్లై చేసుకొమ్మన్నారు. దీనితో గుండెలో రైళ్ళు పరుగెత్తినట్లు భయపడ్డాను. స్వామిని స్మరిస్తూ మళ్ళీ అప్లై చేశాను. ఈ అప్లై చేసే సమయంలో మూడు పేర్లను ఆప్షన్ గా ఇవ్వాలి. నేను 1.నమో వేంకటేశాయ 2. శ్రీవేంకటేశం 3 శ్రీ శ్రీనివాసం అని మూడు పేర్లు ఇచ్చాను. కాని శ్రీవేంకటేశం అని వ్రాయునప్పుడు నా శరీరం కంపించింది. రోమాంచితుడనైనాను, తెలియని ఆనందం ఆవహించింది.

## శ్రీమాన్ రమణాచారి గారిని పరిచయం చేయుట


స్వామివారిని లేదా ఆయన లీలలను చూడక చాలారోజులైంది. నాపైన స్వామివారికి కోపముందని, అందుకే కనబడుట లేదని భావించాను. ఆయనను ప్రసన్నుణ్ణి చేసుకొనుటకు తేది 06-05-2007 నుండి రోజుకు 11 ప్రదక్షిణలు చొప్పున 11 రోజులు చేయసాగాను. తేది 14-05-2007 నాటికి 9 రోజులు అవుతుంది. ఈ రోజు ఒక కల కన్నాను. ఈమధ్యన టి.టి.డి ఈ.ఓగా శ్రీమాన్ కె.వి రమణాచారి గారు నియమితులైనారు. వీరు సిద్ధిపేట వాస్తవ్యులు. వీరి తండ్రి కీ.శే. కె.వి.రాఘవాచార్యులు నాకు గురువులు. వీరి తమ్ముడు నాకు క్లాస్ మేట్, కానీ వీరికి నేను ప్రత్యక్షంగా పరిచయము లేదు. కాని శ్రీవేంకటేశ్వరుడు మాత్రం వీరితో నన్ను ఈవిధంగా కలిపాడు.

**తేది 14-05-2007 కల :** ఈ కలలో నేనొక చిన్న ఫంక్షన్ కు పోయాను. అక్కడికి ప్రస్తుతపు టి.టి.డి ఈ.ఓగా ఉన్న శ్రీమాన్ కె.వి.రమణాచారి గారు వచ్చారు. ఇంతలో ఎవరో ఒకరు నన్ను ఆయనకు పరిచయం చేశారు. అప్పుడు శ్రీమాన్ రమణాచారి గారు నాతో ఈవిధంగా అన్నారు. "నిన్ను కలవాలని చాలారోజుల నుండి వేచి చూస్తున్నా" అని తెలంగాణ యాసలో మాట్లాడారు. నేను గౌరవంగా ఆయనకు కరచాలనం చేసి నిలుచున్నాను. ఇంతే కల. నాకు పరిచయమైన ప్రతి వ్యక్తిని స్వామి సేవలో ఎంతో కొంత వినియోగించుకున్నాడు, వీరిని కూడా ఉపయోగించుకుంటారని భావించాను.

## సాధన చేయుమనుట

తేది 16-05-2007 నాటికి నేను స్వామివారికి ప్రత్యేక పూజలు చేయుట పూర్తవుతుంది. కాని తేది 16-05-2007 రోజున ఏదో కారణంతో ఆలయానికి వెళ్ళలేకపోయాను. మా ఇంట్లోనే స్వామివారిని ప్రార్థించాను. మీకు దయ ఉంటే నాకు కనబడమని లేదా ఏదో ఒక సందేశం ఇవ్వమని వేడుకున్నాను. అనుకున్నట్లే స్వామివారు చక్కని సందేశం ఇచ్చారు.

ఇంతవరకు (1) తిరుపతిలో శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర




సాధన చేయుటను చూచుట

స్తూప నిర్మాణము (2) శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠాన్ని స్థాపించి, ప్రతి సంవత్సరం 7 కోట్ల జప సమర్పణ (3) నమో వేంకటేశాయ రథాన్ని నిర్మించి ప్రతి సంవత్సరం హైదరాబాద్ నుండి తిరుపతి వరకు రథయాత్ర సేవలను ప్రసాదించారు. ఇప్పుడు ఒక మాసపత్రికను ప్రసాదించి, ప్రతిరోజు స్వామిసేవ చేసేవిధంగా చేశాడు. మరియు ఇప్పటి నుండి నా ప్రయాణంలో మార్పుకు ప్రయత్నించారు. అత్యంత ఆర్తితో సేవ చేస్తున్నాను తప్ప స్వామివారి సాక్షాత్కారం పొందాలనే ఉద్దేశ్యం నాలో లేదు.

కాని స్వామివారు మాత్రం వారిని పొందాలంటే సేవ చేయుట సరిపోదని, సాధన చేయుమని సూచించారు. ఈ భావన నాకు గత కొన్ని రోజుల నుండి వస్తోంది. కాని సాధన అంటే ఏమి చేయాలి? ఎలా చేయాలి? అనే ప్రశ్నలు నా మనస్సుకు వచ్చాయి. దీని జవాబే ఈ లీల.

**తేది 17-05-2007 కల :** అది ఒక సాధకుని కుటీరం. ఆ కుటీరం తడకలతో తాటి మట్టలతో వేయబడ్డది. జాజు, సున్నంతో చక్కగా అలంకరించారు. దీని వెనకాల నాకు తెలిసిన ఒక మిత్రుడు భూమిపై పడుకుని, తన శరీరాన్ని పూర్తిగా భూమిలో పాతర పెట్టి కేవలం ముఖం మాత్రమే పైకి కనబడే విధంగా ఉండి స్వామిని ప్రార్థిస్తున్నాడు. చాలా రోజుల నుండి ఇలా ప్రార్థిస్తున్నాడు కావున చాలా చిక్కిపోయాడు, ముఖం చిన్నగా అయిపోయింది. తనకు కాళ్ళు చేతులు లేవు, లోన పూడ్చబడ్డవి. ఆహారం అందించుటకు వీలుగా ఒక పైపు అతనికి కొంత దూరంలో ఉంది, అది కూడా ఇతరులు దయతలచి అందిస్తేనే స్వీకరించగలడు, తాను స్వయంగా తీసుకోలేడు. ఏమిటి? అని ఆయనను నేను అడిగితే 'సాధన' అని నాకు బదులిచ్చాడు. ఆయన పేరు శబరి, నేను కాలేజీ చదివే రోజులలో మిత్రుడు. కల ఇంతే. కాని దీని అర్థం అపారం. ఆరోజు దీనిని అంతగా అర్థం చేసుకోలేదు మరియు పట్టించుకోలేదు. దీని అసలైన అర్థం ఇలా ఉంది.

"నీవు ఇతర విషయాలన్నీ వదిలేయుము. స్వామి సాధన యందే పూర్తి మనస్సు నిలపాలి. ఇల్లు, ఆఫీసు వదిలి ఎక్కడికీ వెళ్ళకూడదు. లోక వ్యవహారాలన్నింటికీ దూరంగా ఉండాలి. స్వామివారు ప్రసాదించిన సేవలను అత్యంత సమర్థవంతంగా, ఆహార వ్యవహారాలను సైతం మరిచిపోయే విధంగా చేస్తూ, స్వామివారిని సర్వదా స్మరిస్తూ, ధ్యానిస్తూ జీవించు''మని ఆదేశించారు. ఇక్కడ శ్రీవేంకటేశ్వరుడు తనను పొందుమని, అందుకు కఠిన సాధన చేయుమని మొదటిసారి చెప్పారు. నాకు ప్రసాదించిన సేవలు స్వామివారిని పొందుటకేనని సూచించారు.

**నా దశ:** మా వంశములోనన్ను ప్రధాన వ్యక్తిగా ఎన్నుకున్నాడు. మా తోట బావి వద్ద దివ్యదేశము లాంటి ఆలయాన్ని నిర్మిస్తావని సూచించారు. దేవతలకు సాధ్యము కాని అనుగ్రహమును ప్రసాదించాడు. నా భార్య సురేఖను అనుగ్రహించి తన మనస్సును మార్చాడు. 'నమో వేంకటేశాయ' మాసపత్రిక వెలువడింది. స్వామిని పొందుటకు సాధన చేయమన్నాడు.


# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని
# దిశానిర్దేశము




## స్వామివారి 700 దివ్యలీలలు

**మొదటి సంపుటము**
**తెలుగు మరియు ఇంగ్లీష్ భాషలలో లభించును.**
**12 భాగాలు కల**
**పుస్తకము ధర : 250/-**

**ప్రచురణ: శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**
**గోవింద దాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**
ఇ.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ - 500 007.
ఫోన్: 040-27175050 (10.00 am to 6.30pm)
website: srivenkatesham.org, mail: srivenkatesham@gmil.com

పై అడ్రస్ నుండి పుస్తకమును పొందవచ్చును. లేదా... పోస్టు / కొరియర్ ద్వారా పొందగోరువారు పుస్తకము ధరతో పాటు రూ. 50/- రిజిస్టర్ పోస్టు / కొరియర్ కొరకు కలిపి మొత్తం రూ. 300/- ఫోన్ పే, గూగుల్ పే, పేటిఎం ద్వారా 93482 12354 నంబర్‌కు పంపగలరు. మరియు మీ అడ్రస్‌ను ఇదే నంబర్‌కు వాట్సప్ / మెసేజ్ ద్వారా పంపి పొందవచ్చును.

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం, హైదరాబాద్**



**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.


శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**గోవిందదాసు**
(పుల్లగూర్ల సాయిరెడ్డి)
ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సీగూడ,
హైదరాబాద్. ఫోన్: 040-27175050

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 23వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

## శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చుమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ,
హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

- డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

గత సంచిక తరువాయి

## త్రిపురారి

సూత మహర్షి వేదికను సమీపించగానే అప్పటికే ఆసీనులై ఉన్న మునులందరూ సూత మహర్షి రాకను గమనించి లేచి నమస్కరించి ఆయన ఆశీస్సులను పొంది, తిరిగి ఆసీనులైనారు. సూత మహర్షి వారినందరినీ వాత్సల్యంతో చూసి ఆనాటి ఉపాఖ్యానాన్ని చెప్పటం మొదలుపెట్టాడు.

''నాయనలారా! ఈనాడు త్రిపురారి, త్రిపుర సంహారి అయిన శంకరుని శౌర్యప్రతాపాల గురించి చెబుతాను. శివుని మీద భక్తిశ్రద్ధలతో ఆయన లోక కళ్యాణం కోసం దుష్టులను ఎలా నిర్జించాడో, ఆయన దయాగుణం ఎంత గొప్పదో చక్కగా వినండి. తారకాసురుడు మరణించిన తరువాత, అతని పుత్రులు విద్యున్మాలి, తారకాక్షుడు, కమలాక్షుడు అనేవాళ్ళు తాము తండ్రి ఋణం తీర్చుకోవాలంటే, తపస్సు చేసి, బ్రహ్మదేవుని ప్రత్యక్షం చేసుకుని, ఆ సృష్టికర్త నుంచి ఎవరికీ లభ్యం కాని గొప్ప వరాలను పొందాలని నిశ్చయించుకొన్నారు. అనుకున్నదే తడవుగా ఆ ముగ్గురు దైత్యవీరులు మిక్కిలి నిష్ఠతో ఇంద్రియ నిగ్రహం కలిగినవారై విధాతను గూర్చి భయంకరమైన ఉత్తమ తపస్సు చేయసాగారు. వారి కఠోర తపస్సుకు బ్రహ్మదేవుడు సంతోషించి, ప్రత్యక్షమై 'మీకు ఏ వరాలు కావాలో కోరుకోండి' అని అనుగ్రహించాడు. దానికా అసురులు ముగ్గురూ కలిసి ఒక్కమాటగా ''విధాతా! నీవు మా మీద దయతలిస్తే కనుక మాకు సర్వకాలాలలోనూ ఏ జీవి వలనా మరణం కలగకుండా ఉండే వరం ప్రసాదించు'' అని చేతులు జోడించారు. దానికి బ్రహ్మ ''మీరు అడగరాని దానిని అడుగుతున్నారు. చావు రాకుండా ఉండే వరమిమ్మని అడగటం, పొందటం ఎక్కడైనా ఉందా? నేనివ్వడానికి, మీరు తీసుకోవడానికి సరి అయిన మంచి వరాన్ని కోరండి. ప్రేమతో ఇస్తాను'' అని పలకడంతో వారు మళ్ళీ తమ మనోభావాలను ఒక్కటిగా చేసి ఆయన ముందు వెల్లడించారు.

''దేవా! మా ముగ్గురికీ మూడు నగరాలను ప్రసాదించు. ఆ పురాలలో సకల సౌఖ్యాలు ఉండాలి. వాటికి కామ గమనం ఉండాలి. అవి మేము ఎక్కడికి వెళ్ళాలనుకుంటే అక్కడికి తీసుకువెళ్ళగలిగే శక్తి కలిగినవిగా ఉండాలి. అంతేకాదు, దేవతలకు, దానవులకు, యక్షులకు, నాగులకు మరెవ్వరికి గాని నాశనం చెయ్యటానికి వీలు కానివిగా ఉండాలి. స్వామీ! మేము నీ

దయవల్ల ఎవరిచేత ఓడింపబడకుండా నిర్భయంగా లోక లోకాలు సంచరిస్తూ ఉంటాము. ఈ వరం ప్రసాదించు బ్రహ్మదేవా!'' అని ఆ ముగ్గురూ ప్రార్థించటంతో బ్రహ్మ 'సరే'నని పలికి, ఆ పురాలు మూడూ ఎప్పుడు ధ్వంసమౌతాయో తెలియజెప్పి, అలా జరగకుండా తగిన జాగ్రత్త వహించమని చెప్పాడు. ''మూడు పురాలు ఒక్కచోటికి చేరితే బలశాలి వాటిని పడగొట్టటానికీ, అలా ఒక్కచోటికి చేరకపోతే వాటినెవరూ నాశనం చేయలేకపోవడానికీ మేమంగీకరిస్తున్నాము'' అన్న అసురుల మాటలకు వల్లె నంటూ బ్రహ్మదేవుడు ''మూడు నగరాలను సంపాదించుకోండి. వాటికా ప్రభావాన్ని నేను ప్రసాదించి వెళ్ళిపోతున్నాను'' అని తన సత్య లోకానికి వెళ్ళిపోయాడు. బ్రహ్మ ఇచ్చిన వరాలకు సంతోషించిన తారకాసురుని తనయులు దానవులకు పూజ్యుడైన మయుని తమకు అటువంటి పటిష్టమైన పురాలు మూడింటిని నిర్మించి ఇమ్మని వేడుకొన్నారు. దానికి మహా తపస్వి అయిన మయుడు వారు చెప్పిన విధంగా మూడు పురాలను నిర్మించాడు. ఆ మూడు పురాలకు ప్రహరీ గోడలు, రాజభవనాలు, గోపురాలు (ద్వారాలు) మొదలైన అనేక భాగాలు నిర్మితమై ఉన్నాయి. ఆ మూడింటిలో – ఒక దానిలో మందిరాలు మొదలైన అన్ని భాగాలు బంగారంతో చేయబడినాయి. రెండోదానిలోని ద్వారాలు, భవనాలు మొదలైన అన్ని భాగాలు వెండితో నిర్మితమైనాయి. ఇక మూడవదానిలోని వివిధ మందిరాలు మొదలైన గృహోపకరణ భాగాలు అన్నీ ఇనుముతో తయారైనాయి. ప్రతి ఒక్క నగరం నాలుగు దిక్కులా నూటేసి యోజనాల విస్తీర్ణతతో శోభాయమానంగా అలరారుతుండటం మయుని శిల్పకళా వైశద్యానికి తార్కాణగా ఒప్పుతోందనే చెప్పాలి. పసిడితో నిర్మితమైన నగరం స్వర్గంలో తిరుగాడుతుంటుంది. వెండితో నిర్మించబడ్డది ఆకాశంలో తిరుగుతుంటుంది. ఇనుముతో తయారు చేయబడ్డ నగరం భూలోకంలో సంచరిస్తుంటుంది. సువర్ణనగరానికి తారకాక్షుడు, రజత నగరానికి కమలాక్షుడు, లోహ (ఇనుప) నగరానికి విద్యున్మాలి అధిపతులుగా వ్యవహరిస్తూ భోగభాగ్యాలతో సుఖించసాగారు. ఈ ముగ్గురు రాక్షసేంద్రులు తననాశ్రయించి ఉన్న కారణంగా మయుడు తన మాయా బలంతో వారికెప్పుడు ఏది కావలసి వచ్చినా, వారికి దానిని సమకూర్చి వారిని సంతృప్తి పరుస్తుండేవాడు. తారకాక్ష, కమలాక్ష, విద్యున్మాలలు ముప్పురు తమ తమ పురాలలో స్వర్గ సౌఖ్యాలనుభవిస్తూ, ముల్లోకాలలో తిరుగుతూ, తమకు ఎదురనేవారు లేకుండా లోకాలనన్నిటినీ ఆక్రమించారు. వారు తమ అధికారాలకు అడ్డు లేకుండా, సర్వ జనులను తమ అధీనంలో ఉంచుకుని నిర్విరామంగా విహరిస్తూ, కష్టమనేది ఎరుగనివారై సంతోషాంబుధిలో మునిగి తేలుతూ ఉండగా కోటానుకోట్ల సంవత్సరాలు దొర్లిపోయాయి.

తారకాక్షుడికి సుతుడైన 'హరి' తండ్రి కన్న మిన్నగా బ్రహ్మదేవుడి గురించి తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చిన బ్రహ్మ ప్రత్యక్షమై 'నీకిష్టమైన దానిని కోరుకో, ప్రసాదిస్తాను' అని ప్రసన్నుడైనాడు. దానికి హరి బ్రహ్మదేవుడికి నమస్కరించి ''విధాతా! మా ఈ మూడు పురాలలోని వారెవరైనా ఆయుధాల వల్ల మరణిస్తే, వారి శవాలను నీటిలో తడిపితే అప్పుడు ఒక్కొక్క శవం పదిమంది వీరులుగా మారాలి. వారు పూర్వంలాగా సకల సౌఖ్యాలు పొందాలి. అందుకుగాను నీరు చాలాకాలం సమృద్ధిగా ఉండేటట్లు విచిత్ర ప్రభావం గల దిగుడుబావి ఒకటి ప్రతిపురంలో ఉండేవిధంగా వరమియ్యి. అటువంటి దిగుడుబావులు మొత్తం మీద మూడు ఉండాలి. అటువంటి బావి గనుక ఉంటే మూడు పురాలలోని వారూ ఏ కష్టం లేకుండా సుఖంగా కలకాలం జీవిస్తారు'' అని కోరడంతో బ్రహ్మ 'ఇచ్చాన'ని చెప్పి తన స్థానానికి వెళ్ళిపోయాడు. ఎప్పుడైతే బ్రహ్మ వరం వల్ల అటువంటి బావి ఏర్పడిందో, దానవుల అహంకారం పెచ్చు మీరిపోయింది. త్రిపుర నివాసులైన అసురులందరూ మరణ శంక లేక దేవతలకు భయంకరులై ప్రతిక్షణం సురలతో యుద్ధం చేసి వారిని ఓడించసాగారు. అంతేకాక అన్ని లోకాల వారిని బాధిస్తూ కామ గమనం గల ఆ పురాల రాక్షసులు విచ్చలవిడిగా తిరుగసాగారు. లోభ మోహ గుణాలకు లోనై తిరుగుతున్న వారి ఆటలకు పట్టపగ్గాలు లేకుండా పోయాయి. దానితో దేవతలకు, పితృదేవతలకు, మహర్షులకు, జనులకు విపరీతమైన హాని కలిగింది. ఆ ఇడుములను భరించలేక దేవేంద్రుడు, దేవతా సమూహాన్ని తీసుకుని త్రిపురాసురుల మీదికి దండు వెడలి అశక్తుడై విషాదానికి లోనైనాడు. తన ఓటమికి బాధపడిన ఇంద్రుడు సురలతో కూడి, మహర్షులు వెంటరాగా బ్రహ్మ వద్దకు వెళ్ళి తన గోడును వెళ్ళబుచ్చుకున్నాడు. హద్దుమీరి అందరిమీద విరుచుకుపడుతున్న త్రిపురాసురులను వధించే ఉపాయం తెల్పమని ప్రార్థించాడు. ఇంద్రుని కరుణాళువై చూసిన బ్రహ్మ త్రిపుర నాశనోపాయాన్ని వివరించి, వారి నూరడించాడు.

**"ఏచినయాపురత్రయము నేకశరంబున రూపుమాపగాఁ**
**జూచినఁ బోవుగాని పెఱచొప్పునఁ బోవదు సంగరోన్ముఖుం**
**డై చనుదెంచెనేని మదనాంతకుచే నది సెల్లు నొండ్లకు**
**న్గోచరమెట్లగుం? జనుదు గొబ్బున నమ్మహితాత్ము పాలికిన్"**

**-266 ప – ప్రథమాశ్వాసం – కర్ణపర్వము – మహాభారతము**

''సురేంద్రా! నే చెప్పేది జాగ్రత్తగా వినండి. మీరు చెప్పిన మూడు పురాలూ బలవత్తరంగా విజృంభించి లోకాలన్నిటిలోనూ సంచరిస్తున్నాయి. అందుచేత వాటిని ధ్వంసం చేయటం అందరికీ సాధ్యం కాదు. ఆ మూడింటినీ ఒకే బాణంతో పడగొట్టాల్సిందే తప్ప ఇక ఏవిధంగానూ అవి నశించవు. త్రిపురాసురుల పైన యుద్ధం చేయటానికి రుద్రుడు వస్తే తప్ప మీ కోరిక నెరవేరదు. హరుడొక్కడే ఒకే దిశగా ప్రయాణిస్తున్న ఆ మూడు పురాలను

గమనించి, ఏకశరంతో వాటిని నేలపాలు చేయగలిగిన యోధాను యోధుడు. ఏ ఇతర వీరులకు ఆ పురాలను నశింపచేయటం చేతగాని పని. ఏ ఇతరుడికీ ఆ ఉపాయము తెలియదు. అంతటి శక్తి సామర్థ్యాలు లేవు కనుక వెంటనే ప్రళయ కాలరుద్రుడైన ఆ శంకరుని వద్దకు వెళ్ళి ఆయన శరణు కోరండి. ఆ శివుడొక్కడే మిమ్మల్ని రక్షించి శుభాల నివ్వగల దయామయుడు'' అని బ్రహ్మ చెప్పగానే ఇంద్రాది దేవతలందరూ సృష్టికర్తకు పాదాభివందనం చేసి, ఆయన చెప్పినట్లు చేయడానికి తరలి వెళ్ళారు.

బ్రహ్మదేవుని ఆజ్ఞానుసారం దేవతలందరూ, ఇంద్రుడూ, మునులూ కలిసిరాగా తపస్సు చేయటానికి ఉపక్రమించారు. ఆ విధంగా వారందరూ ఒక వెయ్యి దివ్య సంవత్సరాలు అత్యంత నిష్ఠతో, అఖండ భక్తితో పరమేశ్వరుని గూర్చి తపస్సు చేసి, నిర్మల స్వాంతులై మహాదేవుని దర్శించటానికి సిద్ధమైనారు. వారు బ్రహ్మదేవుని స్మరించగానే విధాత ప్రత్యక్షమై, వారి అభ్యర్థనననుసరించి, వారికి ముందుగా నిలిచి శివదర్శనార్థం బయలుదేరాడు. ఆ విధంగా బ్రహ్మ, ఇంద్రుడు, దేవతలు, మునులు శివుని వద్దకు వెళ్ళారు.

**"వరదు శరణ్యు శశాంక**
**స్ఫురిత శిరోభాగు సర్వభూతేశ్వరు శం**
**కరు సాంఖ్యయోగనిష్ఠా**
**పర సులభుననంగదమనుఁ బరమాత్ము శివున్"**

**-269 ప – ప్రథమాశ్వాసము – కర్ణపర్వము – మహాభారతము**

''వరాలిచ్చేవాడు, శరణు కోరదగిన మహానుభావుడు, చంద్రుని శిరస్సున ధరించిన వాడు, సర్వజీవులకు నాథుడు, శుభప్రదుడు, సాంఖ్యయోగ నిష్ఠతో కొలిచే భక్తులకు సులభుడు, మన్మథుని జయించినవాడు, పరమాత్ముడు అయిన శివుని చూసి, ఆ దేవ దేవునికి సాష్టాంగ నమస్కారం చేశారు బ్రహ్మాది దేవతలు, మునులు. శంకరుడు వారినందరినీ లెమ్మని చెప్పి ''మీరిక్కడికి రావటానికి గల కారణం ఏమిటి?'' అని అడగడంతో వారు మళ్ళీ అభవుడికి నమస్కరించి, స్తుతించసాగారు. ''మహాత్మా! నిత్య నిర్మలానంద స్వరూపా! వేదశత్రు నిర్మూలా! జ్ఞానస్వరూపా! సత్యమూర్తీ, అతులిత ప్రభావా! భక్తలోక కష్టాపహారీ! మమ్మల్ని రక్షించు'' అని పదే పదే ప్రాధేయపడటంతో వారినందరినీ అనుగ్రహ దృక్కులతో వీక్షించి శివుడు 'మీకు భయం కలగడానికి గల కారణం చెప్పండి. మీరు ఆనందించే విధంగా మీ భయాన్ని పోగొడతాను. మిమ్మల్నింతగా బాధపెట్టిన వాళ్ళెవరు? వాళ్ళను ప్రాణహీనులను చేస్తాను'' అని శివుడు అభయమిచ్చేసరికి బ్రహ్మదేవుడు ముందుకునడిచి ''అంబికానాథా! ప్రజలకు (జీవులందరికీ) అధిపతిగా నీవు నన్ను నియోగించావు. ఆ విధంగా ఉన్నత పదవిని అధిష్ఠించడం చేత అసుర త్రయానికి (ముగ్గురు రాక్షసులకు) విచ్చలవిడిగా వరాలిచ్చాను. ఆ ముగ్గురూ మూడు దుర్గాలను కలిగి ముల్లోకాలను దారుణంగా (మహా భయంకరంగా) ఆక్రమించారు. ఆయా లోకాలలోని ప్రజలందరినీ నానా రకాలుగా ఆ రాక్షసులు బాధలకు గురి చేస్తున్నారు. ఆ అసురులను ఆపటం ఎవరికీ శక్యం గాని విషయం. నీవు తప్ప ఆ దానవులను అణచగల వారెవ్వరూ లేరు. రుద్రా! మునులు, దేవతలు, నేను – నిన్ను శరణు కోరుతున్నాము. నీవు తప్ప మమ్మల్ని రక్షించగలవారెవరూ లేరు. మామీద కరుణ వహించవా శంకరా! జీవేశ్వరా! నీవు తప్ప సమస్త జగాలను రక్షించేవారు ఎవరున్నారు చెప్పు. ఆ శక్తి నీ కొక్కడికే ఉంది'' అని శరణు కోరుతూ మళ్ళీ నమస్కరించాడు. అంతా విన్న శివుడు ''నిజమే. ఆ అసురులు పరమ దుర్మార్గులు. కానీ, ఒక్క విషయం'' అని ఆగాడు. మళ్ళీ వారివైపు చూస్తూ –

''ఆ రాక్షసులు చాలా బలవంతులు. నేను ఒక్కడినే వారిని వధించడానికి సరిపోను. అందుచేత నా యొక్క తేజస్సులో సగం, బలంలో సగం తీసుకుని మీరందరూ కలిసి పోరు సల్పి ఆ క్రూర దైత్యులను వధించి జగాలలో శాంతిని నెలకొల్పండి'' అని చెప్పిన శివుని ప్రార్థనా పూర్వకంగా చూస్తూ ''స్వామీ! మేం చెప్పేది కూడా ఆలకించండి'' అని అంటూ చెప్పసాగారు సురలు. ''మహేశ్వరా! మా అందరి తేజోబలాల కన్నా ఆ దైత్యుల తేజోబలాలు రెట్టింపు. వాళ్ళు మా శక్తికి లొంగేవాళ్ళు కాదు. మమ్మల్ని నిర్జిస్తారే తప్ప వాళ్ళు వధకు గాని అపజయానికి గాని లోబడే వాళ్ళు కాదు. కనుక వారిని నిర్జించటానికి నీవే శక్తిమంతుడివి. అంతేకాక నీయొక్క తేజోబలాలను భరించటానికి, మా శక్తి చాలదు. మా అందరి తేజోబలాలలో నీవు సగం పుచ్చుకొని శత్రువులయిన ఆ రాక్షస త్రయాన్ని సంహరించవలసిందిగా కోరుతున్నాము. మా రక్షకుడవు నీవే. మమ్మల్ని ఉద్ధరించే వాడివీ నీవే. ఈ రాక్షసుల బారి నుండి మమ్మల్ని రక్షించు శంకరా!'' అని ఇంద్రాది దేవతలందరూ ప్రార్థించారు.

వెంటనే విశ్వనాథుడైన ఈశ్వరుడు – ''సురలారా! నా మాట కూడా వినండి.

**"అమరులకు నసురులకు నే**
**సముఁడ శివంబఖిల భూత జాలంబులకున్**
**సమత నొనరింప శివ నా**
**మము నాకుం జెల్లు లోకమాన్యంబగుచున్"**

**-275 ప – ప్రథమాశ్వాసము – కర్ణపర్వము – మహాభారతము**

దేవతలకు, అసురులకు నేను ఎప్పుడూ సమత్వాన్ని కలిగి ఉంటాను. అంతేకాదు, సకల జీవరాశుల పట్ల సమభావాన్ని కలిగి ఉన్న కారణం చేత నాకు శివుడనే నామం స్థిరపడింది. సర్వలోకవాసులు నన్ను శివుడనే నామంతో కొలుస్తున్నారంటే కారణం సర్వులనూ నేను సమభావంతో ఆదరిస్తుండడమే. అయినప్పటికీ సురలారా!

“అనయము క్రూరకర్ములగు నట్టి విమూఢుల పిల్కు మార్చఁ బూ
ననతగు ధర్మవర్తనులనంజను మీయెడ ద్రోహులైన య
ద్దనుజులఁ ద్రుంచి మీకు ప్రమదంబొనరించెద తేజమున్ బలం
బును సగపాలు పెట్టి ననుఁ బొందగఁ జేయుడు మీరలందఱున్”

**-277 ప – ప్రథమాశ్వాసము – కర్ణపర్వము – మహాభారతము**

“ఎల్లప్పుడూ క్రూరకర్ములు చేసే మూఢులు అసురులు. అటువంటి వారిని నశింప చేయటమే తగినపని. ధర్మమార్గంలో ప్రవర్తించే మీపట్ల ద్రోహచింతనతో దుర్మార్గులై ప్రవర్తిస్తున్న ఆ రాక్షసులను సంహరించి, మీకు ఆనందాన్ని కలుగజేస్తాను. మీరంతా మీ మీ తేజస్సులో, బలంలో సగం నాకు సంక్రమింపచేయండి. అప్పుడు మన ఈ సత్కార్యం సఫలీకృతమౌతుంది. మరొక్కమాట. దివ్యరథాన్ని, సారథిని, గుఱ్ఱాలను, ధనుస్సును, బాణాన్ని – నాకు తగినట్లుగా నిర్మింపచేసి ఇవ్వండి. ఆవిధంగా మీరు చేస్తే ఆ రాక్షసుల పుర దుర్గాలను నేను ధ్వంసం చేస్తాను. పాశుపత వ్రతం నియమానుసారం నిష్ఠతో చేయండి. మీ కోరిక నెరవేరుతుంది” అని పరమేశ్వరుడు చెప్పి వారిని అనునయించాడు.

శంకరుని ఆజ్ఞానుసారం సమస్త జీవులకు పశుత్వాన్ని, లోకేశ్వరుడైన శివునికి పశుపతి స్థానాన్ని కలగజేయటానికి సురలందరూ సభక్తికంగా పాశుపత వ్రతాన్ని ఆచరించారు. “ఆ వ్రతఫలితంగా మీకు పశుత్వం నుండి విముక్తి కలుగుతుంది” అన్న శివుని మాట ప్రకారం దేవతలందరూ నిర్మల స్వాంతులయినారు. ఆ పరమేశ్వరుని పశుపతీ! అని పిలిచి ఆయన ఉపదేశానుసారం తమ పరాక్రమంలోని సగభాగాన్ని, తమ బలంలోని సగభాగాన్ని ఆ దేవదేవుడికి సమర్పించారు. దేవతల బలపరాక్రమాలలో సగభాగాన్ని స్వీకరించి పరమశివుడు మహోజ్జ్వలంగా ప్రకాశించాడు. దేవతలు పరమానంద భరితులై త్రిపుర ధ్వంసానికి, త్రిపురాసుర సంహారానికి మహేశ్వరుని అభిషేకించారు. దేవశిల్పి అయిన విశ్వకర్మను పిలిచి మహావీరుడైన శివునికి కావలసిన రథాది యుద్ధ పరికరాలను నిర్మించి ఇమ్మని చెప్పారు. తపస్సంపన్నుడైన విశ్వకర్మ ఆయా పనిముట్లను పరమేశ్వరుడి శక్తి సామర్థ్యాలకు తగినట్లు, త్రిపుర నాశనానికి ఉపయోగపడేటట్లు నిర్మించాడు. భూమిని, తన నేర్పుతో రథంగా తయారు చేశాడు. సూర్యచంద్రులను ఆ రథానికి చక్రాలుగా ఏర్పాటు చేశాడు. సముద్రాన్ని ఇరుసుగా మలిచాడు. హిమవత్పర్వతాన్ని, వింధ్య పర్వతాన్ని, అస్తాచల, ఉదయాచలాలను ముఖ్యమైన భాగాల స్థానాలలో తీర్చిదిద్దాడు. త్రేతాగ్నులను (గార్హపత్యం, ఆహవనీయం, దక్షిణాగ్నులు–3) త్రివేణుకములనే భాగాలుగా పెట్టాడు. మేరు పర్వతాన్ని గొడుగుగా చేశాడు. నాలుగు వేదాలను రథానికి కట్టే గుఱ్ఱాలుగా తీర్చాడు. సంవత్సరాన్ని ధనుస్సుగా, బాణంగా విష్ణుమూర్తిని సమకూర్చాడు. ఈ విధంగా చరాచరాత్మకంగా నిర్మితమై తేజస్సుతో విరాజిల్లుతున్న రథాన్ని చూశాడు ఫాలాక్షుడు. కవచం తొడుగుకొన్నాడు. ధనుస్సు పట్టుకొన్నాడు. బాణాన్ని చేత ధరించాడు. దానవులను భయపెట్టే ఉత్సాహంతో రథాన్ని అధిరోహించాడు (ఎక్కేడు). రథం మీద వృషభ ధ్వజం (నందీశ్వరుని గుర్తుగా గల జెండా) వెలుగులీనుతోంది. శివుడు రథారోహణం చేయగానే అప్సరః కాంతలు నాట్యం చేశారు. సకల మునులు అనేక విధాలుగా స్తుతించసాగారు. ఆ ఆనందమయ పరిస్థితిలో శివుడు దేవతలను చూసి చిరునవ్వును చిందిస్తూ “అన్నీ అమర్చారు, బాగుంది, మరి సారథి ఎవరు?” అని ప్రశ్నించాడు.

“స్వామీ! నీ మనసుకు నచ్చిన వ్యక్తిని సారథిగా స్వీకరించు” అన్న దేవతల మాటలకు చిన్నగా నవ్వి “నా కన్న అధికుడైన వానిని సారథిగా మీరే నిర్ణయించండి” అని శివుడనటంతో మునులు, దేవతలు అందరూ కలిసి మిక్కిలి వినయవంతులై బ్రహ్మ వద్దకు వెళ్ళి నమస్కరించారు.

“విధాతా! నీ ఆజ్ఞతో మేము పరమేశ్వరునికి రథాన్ని, తదితర వస్తువులను సమకూర్చాము. సారథిని మాత్రం నిర్ణయింపలేకపోయాము. ఎందుకంటే సారథి – బలంలో గాని, సారథ్య నైపుణ్యంలో గాని రథికుని కంటే అధికుడై ఉండాలి. రథం భూమి, అశ్వాలు వేదాలు, రథికుడు రుద్రుడు అయినప్పుడు సారథి – రథికునికి తగిన శక్తి సామర్థ్యాలు కలిగినవాడై ఉండాలి కదా! గుణాధికుడవైన నీవే ఆ కార్యానికి సమర్థుడవు. మా ప్రార్థనను మన్నించి, రాక్షసుల వలన కలిగిన మా భయాన్ని పారద్రోలి, శివునికి రథసారథిగా వర్తించటానికి అంగీకరించి మమ్మల్ని రక్షించు” అని ప్రాధేయపడుతున్న దేవతలను లేవదీసి “మీరు చెప్పినట్లే చేస్తాను” అని చెప్పి, వారిని సంతోష పరవశులను చేశాడు బ్రహ్మదేవుడు. చెప్పినదే తడవుగా ఓంకారంతో చేసిన మునికోలను (కమ్చీ కర్రను) తీసుకుని బ్రహ్మ రథం ముందు భాగంలోని నొగలు ఎక్కాడు.

బ్రహ్మదేవుడు రథాన్ని తోలడం ఆరంభించగానే ఆ గుఱ్ఱాలు బ్రహ్మను, శంకరుని మోయలేక పడిపోయాయి. అది చూసిన సృష్టికర్త పగ్గాలు పట్టుకొని వాటిని పైకి లేవదీసి, వాటికి అత్యధికమైన బలపరాక్రమాలు ప్రసాదించాడు. మళ్ళీ రథాన్ని అత్యంత నైపుణ్యంతో నడుపుతున్న విధాతను చూసి శంకరుడు ఎంతగానో ప్రశంసించాడు. “బ్రహ్మదేవా! ఆ రాక్షసుల దుర్గాల వైపు అరదాన్ని నడిపించు. ఈవేళ లోకాలు అనుభవిస్తున్న అష్టకష్టాలను పోగొడతాను. సర్వజుల సుఖానందాలను చూతువు గాక! నా బలపరాక్రమాలను చూడు అన్న రుద్రుని ఆజ్ఞానుసారం బ్రహ్మదేవుడు మనోవేగం, వాయుదేవుని బలమూ కలిగిన ఆ వేదాలనే గుఱ్ఱాలను తోలసాగాడు. అధర్వుడు, అంగిరసుడు

అనే మహర్షులు చక్రరక్షకులుగా నిలిచారు. ఆ విధంగా బ్రహ్మ రథాన్ని త్రిపురాల మీదికి తోలాడు. ప్రథమ రథికుడైన రుద్రుడు త్రిపురాలవైపు ఒక్కసారి దుర్నిరీక్ష్యంగా చూశాడు.

"కోప సందీప్తుడై చాపంబు సజ్యంబు
గావించి మౌర్వి మార్గణము కూర్చి
పాశుపతాస్త్ర సంబద్ధంబుగా చేసి
పురములు మూటిని బుద్ధి నిలుప
నవి యొక్క చోటికి నప్పుడ కూడిన
మునులును సురలును ముదము పొంది
గెలు గెలు మంచు నగ్గింప నయ్యుగ్రుండు
తెగ పాపి యేసిన దితిజ యుతము
గాఁ బురత్రయంబు కాలి నీఱై పశ్చి
మాబ్ధిఁ దొరగ నమ్మహాగ్ని లోక
ములు దహింపఁ జొచ్చె పురహరుడది మాన్చె
సంతసిల్లె సకల జంతువులును"

**-293 ప – ప్రథమాశ్వాసము – కర్ణపర్వము – మహాభారతము**

సంహార సమయంలో శుభప్రదుడైన శంకరుడు ప్రళయ కాలరుద్రుడిగా, కోపావేశంతో విల్లు ఎక్కుపెట్టాడు. అల్లెత్రాడుకు బాణాన్ని కూర్చాడు. పాశుపతాస్త్రాన్ని ఆ బాణానికి జోడించాడు. తన మనసులో ఆ త్రిపురాలను తలపోశాడు. ఎప్పుడైతే రుద్రుడు మూడు దుర్గాల గురించి ఒకటిగా అవి కూడాలని అనుకున్నాడో అప్పుడు వెంటనే ఆ మూడూ ఒక్కచోటికే వచ్చి ఉన్నాయి. త్రిపురాల ఉనికిని చూసి మునులు, దేవతలు సంతోషంతో ఉప్పొంగిపోయి, జయము, జయము అంటూ శివుని ప్రశంసలతో స్తుతించారు. ఉగ్రాకారాన్ని ధరించిన శివుడు నారి లాగి పాశుపతాస్త్రంతో కూడి ఉన్న బాణాన్ని ప్రయోగించాడు. ఆ బాణ జ్వాలలు తగిలేసరికి దైత్యత్రయముతో కూడి ఉన్న ఆ మూడు పురాలు దగ్ధమై బూడిదగా మిగిలాయి. త్రిపురాల బూడిద అంతా పడమటి సముద్రంలో కలిసిపోయింది. పాశుపతాస్త్ర ప్రయోగం వల్ల ఏర్పడిన మహాగ్ని లోకాలన్నిటినీ దహిస్తుంటే త్రిపురాలను హరించిన హరుడు ఆ అగ్నిని చల్లార్చి వేశాడు. దానితో సమస్త జీవరాశులు సంతోషంతో శివుని స్తుతిస్తూ ఉప్పొంగిపోయాయి. శివుని అనుమతితో బ్రహ్మదేవుడు, ఇంద్రాది సకల సురలు తమ తమ నెలవులకు వెళ్ళి తమను రక్షించిన ఆ త్రిపురారిని స్తోత్రం చేస్తూ సుఖ జీవనులైనారు.

**(సశేషం)**


# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



## తిరుమల శ్రీవేంకటేశ్వరునికి 22వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం వారి ఆధ్వర్యంలో తేది 27-08-2024 గోకులాష్టమి రోజున శ్రీవారికి 22వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ జరిగింది. తేది 26-08-2024 నాటి సాయంత్రం ఈ జపాన్ని అలిపిరి పాదాల మండపం వద్ద స్వామివారి పాదాలకు సమర్పించి జపము వ్రాసినవారి కోరికలను తీర్చాలని ప్రార్థించుట జరిగింది. తేది 27-08-2024 గోకులాష్టమి రోజు ఎస్.వి డైరీఫాం లోని శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం వద్ద జపహోమాదులు నిర్వహించాము. ఆ తరువాత టిటిడి ఈఓ శ్రీమాన్ శ్యామల రావు గారు పూర్ణాహుతి కావించి జపాన్ని స్వామివారికి సమర్పించారు. మరియు 23వ పర్యాయంగా 7 కోట్ల జపానికి శ్రీకారం చుట్టారు. దీనిలో శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం వ్యవస్థాపకులు పుల్లగూర్ల సాయిరెడ్డి దంపతులు, భక్తులు అధికారులు పాల్గొన్నారు.



## తిరుపతిలో పుస్తకావిష్కరణ

**"ది డివైన్ మ్యాన్డేట్ ఆఫ్ తిరుమల శ్రీవేంకటేశ్వర, ది డివైన్ యాక్ట్స్", ఫస్ట్ వాల్యూమ్**

### దివ్యలీలల ఇంగ్లీష్ వెర్షన్ పుస్తకావిష్కరణ

తేది 27-08-2024 గోకులాష్టమి రోజున టిటిడి ఈఓ శ్రీమాన్ శ్యామల రావు గారు "ది డివైన్ మ్యాన్ డేట్ ఆఫ్ తిరుమల శ్రీవేంకటేశ్వర, డివైన్ ఆక్ట్స్, ఫస్ట్ వాల్యూమ్" పుస్తకమును ఆవిష్కరించారు. ఇది ఏప్రిల్ 2000 నుండి ఆగస్టు 2004 వరకు శ్రీవేంకటేశం మాసపత్రికలో ప్రచురించిన 12 భాగాల "దిశా నిర్దేశం" యొక్క ఇంగ్లీష్ వర్షన్. హరినామ క్షేత్రం స్థాపించుట కొరకు పుల్లగూర్ల సాయిరెడ్డి గారికి స్వామివారు ప్రసాదించిన లీలల ధారావాహికం. ఈ పుస్తకావిష్కరణ తరువాత తిరుపతిలో ఇంగ్లీష్ పుస్తకములతో పాటు తెలుగు పుస్తకము ప్రతులను భక్తులకు పంచిపెట్టుట జరిగింది. ఈఓ శ్రీమాన్ శ్యామల రావు గారు ఎంతో సంతోషించారు.

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా**

## గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు



### 69వ కళ్యాణం

తేది 31-08-2024 శనివారం ఉదయం 10.30 గంటల నుండి జరిగింది. ఇది వాసవి పార్క్ వ్యూ అపార్టుమెంట్, సిటిజన్ భవన్ ఎదురుగా, బోరబండ లోని గాయత్రీనగర్, హైదరాబాద్ లో జరిగింది. దీనిని శ్రీమాన్ జైని రాజేష్ గుప్తా, స్వప్న దంపతులు, కుటుంబ సభ్యులు నిర్వహించారు.

# ఆనందాల పర్వం దీపావళి పర్వం

– చిల్లర సీతారామారావు



**పండుగలు మానవునకు నూతనోత్సాహాన్ని కలుగజేస్తాయి. పండుగనాడు బాధలను మరచిపోయి, శాంతంగా ఉంటారు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు వృద్ధి చెందుతాయి.**

కాశ్మీరం నుండి కన్యాకుమారి వరకు, బాలుర నుండి వృద్ధుల వరకు భాషా వర్గ విభేదాలు లేకుండా ఆనందోత్సాహాలతో అందరూ సమైక్యంగా జరుపుకొనే పండుగ దీపావళి. దీపావళి అనగా దీపముల వరుస. ఆ రోజున వీధులు, గృహముల యందు వరుసగా అమర్చబడిన దీపములు కనుల పండువగా కన్పిస్తాయి. దీప మాలికలతో లక్ష్మీదేవికి నీరాజన మీయబడే దినము కావడము చేత ఈ పండుగకు దీపావళి యన నామము సార్థకము. గొప్పవారు, బీదవారు, అన్ని వర్గాల వారు అధికానందముతో జరుపుకొనే పండగ దీపావళి. పండుగకు పూర్వమే గృహాలను శుభ్రపరచి రంగులు వేయించుకుంటారు. అల్లుళ్ళను ఇంటికి ఆహ్వానిస్తారు. క్రొత్త బట్టలు పెడతారు. విందు భోజనాలతో సత్కరిస్తారు. దీపావళి మార్వాడీలకు నూతన సంవత్సరాది. ఆరోజే క్రొత్త ఖాతా పుస్తకాలను ప్రారంభిస్తారు. లక్ష్మీదేవికి పూజలు చేస్తారు. నౌకర్లకు బహుమతులు ఇస్తారు. దానధర్మాలు చేస్తారు. దీపావళి పండుగ వానాకాలానికి సంధికాలంలో వస్తుంది. వర్షాకాలంలో పచ్చిక బాగా మొలుస్తుంది. దానితో పాట క్రిమి కీటకాదులు ఉత్పన్నమవుతాయి. దీపావళి నాడు కాల్చబడే టపాసలు మతాబుల నుండి వెలువడే వాయువుల వలన మన కంటికి కనిపించని క్రిమి కీటకాదలు నశించిపోతాయి.

దీపావళి పర్వమును మూడు రోజులు ఆనందముగా జరుపుకుంటారు. ఈ మూడు రోజులలో మొదటిది నరక చతుర్దశి, రెండవది అమావాస్య, మూడవది బలి పాడ్యమి.

ఆశ్వయుజ బహుళ త్రయోదశి నాడు అపమృత్యు నివారణకై దీపమును వెలిగించి, పూజించి ఇంటికెదుట వెలుపలి భాగములో ఉంచాలి. దీనిని యమ దీపం అంటారు. ఈ దీపమును యముడి అనుగ్రహం పొందడం కోసం ఉంచుతారు. తెల్లవారు జామున అభ్యంగన స్నానము చేస్తారు. అలా చేయడం వలన సకల ఐశ్వర్యాలు ప్రాప్తిస్తాయి. చతుర్దశి నాడు అభ్యంగన స్నానము వల్ల, దీపదానం వల్ల, యమ తర్పణం వల్ల మానవులకు నరకము లేకుండా పోతుంది కనుక ఈ చతుర్దశిని నరక చతుర్దశి యని అంటారు. నరక చతుర్దశి వెనుక ఒక కథ ఉందని చెబుతుంటారు.

హిమాలయ పర్వత ప్రాంతములో ప్రాగ్జోతిష పురము అను ఒక రాజ్యము ఉన్నది. ఆ రాజ్యమునకు అధిపతి నరకుడు అను రాక్షసుడు. ఇతడు వరాహ అవతారంలో ఉన్న విష్ణుమూర్తికి, భూదేవికి జన్మించినవాడు. మహాబలవంతుడు, అహంకారి. తన బల మదంతో ఇంద్రుడి సింహాసనాన్ని తన స్వాధీనము లోనికి తెచ్చుకున్నాడు. ఊర్వశిని చెరపట్టాలనుకున్నాడు. కాని ఆమె బహు గడుసరి. ముందు తన కోర్కె తీర్చమని పట్టు బట్టింది. నీ కోర్కె ఏమిటి? అని అడిగాడు నరకాసురుడు. ఋషులు నిర్వహిస్తున్న యజ్ఞాలలోని యజ్ఞఫలము నాకు కావాలి. ఇదే నా కోరిక అని పలికింది. అదేమంత కష్టమైన పని కాదు. నీ కోరిక తీరుస్తాను అని పలికి యజ్ఞ గుండాలను నాశనం చేశాడు. ఋషులను బాధించాడు. స్త్రీలను వేధించాడు. ఆ బాధలు భరించలేక ఋషులు, దేవతలు అందరూ కలిసి విష్ణుమూర్తిని దర్శించుకున్నారు. నరకాసురుడి వల్ల తాము పడుతున్న బాధలను వెల్లడించారు. విష్ణుమూర్తి వారికి అభయమిస్తూ – భయపడకండి. అతనికి అంతమొందే సమయము ఆసన్నమయింది అని పలికి వారిని పంపించి వేశాడు.

ద్వాపర యుగములో మహావిష్ణువు శ్రీకృష్ణుడిగా అవతరించాడు. భూదేవి సత్యభామగా అవతరించింది. నరకాసురుడు లోకకంటకుడై చేస్తున్న అధర్మకృత్యాలను అరికట్టడానికి నిశ్చయించుకున్నాడు కృష్ణుడు. శ్రీకృష్ణుడు ప్రాగ్జోతిష పురంపై దండెత్తడానికి బయలుదేరాడు. సత్యభామ కూడా కృష్ణుడిని అనుసరించింది. నరకాసురుడు, శ్రీకృష్ణుడు –

ఇరువురి మధ్య ఘోరమైన యుద్ధము నడిచింది. నరకాసురుడు వేసిన ఒక బాణము కృష్ణుడికి తగిలి మూర్ఛిల్లాడు. సత్యభామ ఆగ్రహంతో విల్లందుకొని యుద్ధము చేయసాగింది. ఆ యుద్ధములో నరకాసురుడు మరణిస్తాడు. ఆ రోజు చతుర్దశి. కావున నరక చతుర్దశి అయింది. ఆనాటినుండి నరకచతుర్దశిని జరుపుకుంటున్నారు.

నరకచతుర్దశిని ప్రేత చతుర్దశి యని కూడా అంటారు.

**శ్లో ॥ "అశ్వయుక్కృష్ణ పక్షస్య చతుర్దశ్యాం విధూదయే**
**తిలతైలేన కర్తవ్యం స్నానం నరక భీరుణా"**

ప్రేత చతుర్దశి వలన నరకానికి పోతామేమోనని భయపడే భీరువులు చంద్రోదయ కాలమున, నువ్వులనూనెతో అభ్యంగన స్నానము చేయవలెనని పురాణములో ఉన్నది. నరకచతుర్దశినాడు తైలమునందు లక్ష్మీదేవి, నీటియందు గంగ ఉంటారని ప్రగాఢ విశ్వాసము. అందువలన ఈరోజు అభ్యంగన స్నానమాచరించిన వారు యమలోక దర్శనము పొందరని ఈ క్రింది శ్లోకము ద్వారా తెలియుచున్నది.

**శ్లో ॥ "తైలేలక్ష్మీర్జలే గంగా దీపావల్యాశ్చతుర్దశీమ్ ప్రాప్యేతిశేషః**
**ప్రాతః స్నానంతు యః కుర్యాద్యమలోకం న పశ్యతి"**

సూర్యోదయమునకు ముందే లేచి అభ్యంగన స్నానము చేయాలి. శరీరాద్యంతము తైలమును వ్రాసుకొని, బాగుగా రుద్దుకుని, గోరువెచ్చని నీటితో సీకాయ, పెసరపిండి, సెనగపిండి మొదలగు వానిచే జిడ్డును కడుకొనవలెను. దీనిని తైలస్నానము లేదా అభ్యంగన స్నానము అని అంటారు. అభ్యంగన స్నానము చేయునప్పుడు నీటిని ఉత్తరేణి, తుమ్మి, తగిరస చెట్ల కొమ్మలతో కలయబెట్టాలి. కలియబెట్టిన జలంలో విద్యుత్తు ఉత్పన్నమవుతుంది. ఆయా ఓషధుల సమ్మేళనం చేత ఆ జలంలో రసాయనికమైన మార్పులు వస్తాయి. అట్టి నీటితో స్నానం చేయడం ఉత్తమం. ఆరోగ్యప్రదం. చర్మరోగాలు రాకుండా ఉంటాయి. శరీరం ప్రకాశవంతంగా ఉంటుంది. సర్వపాప నివారణార్థము యమధర్మరాజు నుద్దేశించి తర్పణం వదులుతారు. యమధర్మరాజును స్మరిస్తూ –

**శ్లో ॥ "యమాయ ధర్మరాజాయ మృత్యవే చాంతకాయ చ**
**వైవస్వతా కాలాయ సర్వభూత క్షయాయచ**
**ఔదుంబరాయ దధ్నాయ నీలాయ పరమేష్ఠినే**
**వృకోదరాయ చిత్రాయ చిత్రగుప్తాయ వై నమః"**

అంటూ తర్పణమును వదలాలి.

ఏ ఒక్కరి విషయంలో కూడా ధర్మాన్ని తప్పనివాడివి, పేద, ధనిక, వృద్ధ, బాల, స్త్రీ, పురుష భేదాన్ని పాటించక, కాలం తీరిన వెంటనే మృత్యురూపంలో వచ్చి ప్రాణాలను తీసుకుపోయేవాడివి, నల్లని రూపము కలిగినవాడివి అయిన ఓ యమధర్మరాజా! నీ పేరిట వెలిగింపబడే ఈ దీపాలని, నీ ప్రతినిధి అయిన ఈ బ్రాహ్మణుడికి దానాన్ని ఇస్తూ నాకు నీవల్ల కలగబోయే అపమృత్యు దోషాన్ని తొలగించవలసిందిగా ప్రార్థిస్తున్నాను అని శ్లోక భావార్థము. యమునుద్దేశించి నాలుగు వత్తులతో దీపమును వెలిగించి ఒక బ్రాహ్మణునికి ఆ దీపమును దానము చేయాలి. దానము చేయునప్పుడు ఈ క్రింది శ్లోకమును పఠించాలి.

**శ్లో ॥ "దత్తో దీపశ్చతుర్దశ్యాం నరక ప్రీతయే మయా**
**చతుర్వర్తి సమాయుక్తః సర్వపాపనుత్తయే"**

మధ్యాహ్నం పిండివంటలతో భోజనం చేయాలి. ఈ రోజున మినుముకు అధిక ప్రాధాన్యత ఉంది. మినపగారెలు, బెల్లంతో చేసిన మినప గారెలు, కుడుములు తయారు చేసి ఆరగించాలి. అపూపములు అనగా అప్పాలు తినాలి. నరకచతుర్దశి నాటి సాయంకాలం, ప్రదోషకాలమందు దీపదానం చేయాలి. దేవాలయాలలో, మఠాలలో దీప పంక్తులు ఉంచాలి. ఈ దీప కాంతులు అమావాస్య చీకట్లను తరిమికొడుతూ, నరకంలోని పితరులకు మార్గదర్శకంగా ఉంటాయి. పితృదేవతలు నరకలోకమును వీడి స్వర్గలోకమునకు వెళతారని ఈ క్రింది శ్లోకము తెలియజేయుచున్నది.

**శ్లో ॥ "చతుర్దశ్యాం తుయే దీపాన్నరకాయ దదంతి చ**
**తేషాం పితృగణా స్సర్వే నరకాత్స్వర్గ మాప్నుయః"**

ఆశ్వయుజ బహుళ అమావాస్య నాడు దీపావళి. ఈరోజున ప్రత్యూష కాలమున అభ్యంగన స్నానము చేయాలి. సాయంకాలం దీపాలు వెలిగించాక ధనలక్ష్మిని పూజించాలి. తర్వాత బాణాసంచా కాల్చాలి. అధిష్ఠాన దేవత అయిన లక్ష్మీదేవిని ప్రార్థిస్తూ షోడశోపచార పూజలు చేయాలి.

**శ్లో ॥ "అశ్వదాయిచ గోదాయి ధనదాయి మహాధనే**
**ధనం మేజుషతాం దేవి సర్వకామాంశ్చ దేహిమా**
**పుత్ర పౌత్ర ధనం ధాన్యం హస్త్య శ్వాశతరీ రథమ్**
**ప్రజానాం భవసి మాతా ఆయుష్మన్తం కరోతుమే"**

అశ్వదాయిని, గోదాయిని, ధనదాయిని, మహాధనస్వరూపిణీ, హే దేవీ! నా దగ్గర సదా ధనముండేటట్లు, సకల కోరికలు సఫలీకృతము అయ్యేటట్లు అనుగ్రహింపుము. హే జగన్మాతా! పుత్రులు, పౌత్రులు, ధనము, ధాన్యము, ఏనుగు, గుర్రము, రథము సమస్తం కలకాలం వర్ధిల్లేటట్లు దయ చూడుము తల్లీ! అంటూ లక్ష్మీదేవిని ప్రార్థించాలి.

లక్ష్మీదేవికి అత్యంత ప్రీతికరమైనది దీపావళి. అమావాస్య నాడు అర్ధరాత్రి సమయమున లక్ష్మీదేవి భూలోక సంచారము గావిస్తూ తను నివసించడానికి అనువైన గృహము ఎక్కడ ఉందా అని అన్వేషిస్తుందట. అందువలన లక్ష్మీదేవికి ప్రీతిపాత్రమగునట్లు గృహములను శుభ్రంగా అలంకరించుకోవాలి. గురుభక్తి, దైవభక్తి, మాతా పితృ భక్తి గల వ్యక్తులను లక్ష్మీదేవి ఇష్టపడుతుంది. వారిని కటాక్షిస్తుంది.



వరమును ఇవ్వమని అడిగాడు. బలిచక్రవర్తి ముక్తుడైన రోజు కావున ప్రజలు దీపావళి పండుగను జరుపుకుంటారు. ఈ కథ వలన వ్యక్తి కంటె వ్యవస్థ గొప్పదని తెలుస్తున్నది. ఆ రోజున బలిచక్రవర్తిని బియ్యపు పిండితో గాని, గోధుమపిండితో గాని చేసి పూజించాలి. విదియ నాడు సోదరులు అక్కా చెల్లెళ్ళ ఇంటికి వెళ్ళి భోజనములు చేస్తారు. దీనివలన సోదర సోదరీమణుల మధ్య అనురాగబంధాలు శాశ్వతంగా నిలుస్తాయి. దీపావళి అక్కాచెల్లెళ్ళ అనురాగానికి రాగదీపిక.

దీపావళి అనగానే కళ్ళముందు కనబడేది దీపము. సాయంకాలమున దీపములను వెలిగిస్తారు. దీపం శ్రద్ధ, భక్తి, గౌరవం, నిష్కపటం, సద్భావన మొదలైన అనేక సద్గుణాలకు ప్రతీక. దీపకాంతిని చూస్తే హృదయ కుహర మధ్యల బ్రహ్మమాత్రంగా ఓ జ్యోతి వెలుగుతుంది అని రమణ మహర్షి చెప్పారు. అందువలనేమో దీపాన్ని చూస్తే ఆనందము కలుగుతుంది. మన పూర్వీకులు దీపదర్శనమునకు అధిక ప్రాధాన్యత నిచ్చారు. ఇది భక్తి, కృతజ్ఞతా భావాల ద్యోతకం.

వేకువ జామున లేచి స్నానాదికములు పూర్తి గావించుకుని లక్ష్మీదేవిని పూజించేవారి గృహములందు ఆ దేవత నివసిస్తుంది. ఇంటిని పరిశుభ్రముగా ఉంచాలి. గడపలకు పసుపు రాయాలి. కుంకుమ బొట్లు పెట్టాలి. గుమ్మాలకు తోరణాలు కట్టాలి. ముగ్గు, పసుపు, పువ్వులు, పాలు, ధూప, మంగళ ద్రవ్యాలు లక్ష్మీదేవి ఇష్టపడే స్థానాలు. మాసిన బట్టలు ధరించినవారి దగ్గర, సంధ్యాకాలములో నిద్రపోయేవారి దగ్గర లక్ష్మీదేవి నివసించదు. ధనమునకు, ధాన్యమునకు, పుస్తకమునకు, పెద్దలకు లక్ష్మీదేవి అత్యంత ప్రాధాన్యత నిస్తుంది. వీరిని అవమానించితే లక్ష్మీదేవికి ఆగ్రహం కలుగుతుంది.

కార్తీక మాస శుక్లపక్ష పాడ్యమి నాడు బలి చక్రవర్తిని పూజిస్తారు. బలి చక్రవర్తి దానవుడు. అయినప్పటికీ గొప్ప దానగుణం కలిగినవాడు. మహాబలశాలి. అతని బలశక్తి ముందు స్వర్గలోకం దాసోహమంది. యాచించినవారికి లేదనకుండా ఇచ్చేవాడు. వామనావతారమున మహావిష్ణువు బలిచక్రవర్తిని మూడడుగుల నేల దానము ఇవ్వమని అడిగాడు. బలిచక్రవర్తి ఇచ్చాడు. భూమ్యాకాశాలు రెండడుగులు అయితే మూడో అడుగు బలిచక్రవర్తి శిరస్సుపై మోపి అతడిని పాతాళ లోకమునకు పంపించాడు. బలి దానమునకు ముగ్ధుడైన మహావిష్ణువు బలిని వరమును కోరుకొమ్మని అడిగాడు. బలి తన కొరకు ఏమీ కోరుకొనలేదు. లోకములన్నీ దీపదానాలతో, ఉత్సవాలు జరుపుకునేలా అందరికీ లక్ష్మీ కటాక్షము ఉండేలా


దీపావళి నాడు సాయంకాలం ఇంటిలోన, గడపల వద్ద వెలిగించిన ప్రమిదలను ఉంచాలి. ఈ దీపాల ద్వారా లక్ష్మీదేవి ఇంట్లోకి వస్తుందని ఒక విశ్వాసము. ఇంటి ప్రవేశ ద్వారం ముందు నువ్వుల నూనెతో దీపం పెట్టాలి. అలా పెట్టడం వలన సుఖ శాంతులు స్థిరంగా ఉంటాయి. దీపం ఆశకు చిహ్నం. దీపం నూతన చైతన్యాన్ని, నూతనోత్సాహాన్ని కలిగిస్తుంది. దీపపు వత్తి మనకు క్రమశిక్షణ కలిగి ఉండమని, వెలుగును పంచమని, దుష్ప్రవృత్తితో పోరాడమని బోధిస్తుంది. దీపావళి నాడు దీపాలు వెలిగించేటప్పుడు మొదట ఇంట్లో దీపాలు వెలిగించిన తరువాత అవసరమయితే ఇరుగు పొరుగు ఇళ్ళలో దీపాలను పెట్టాలి. దీపం లేకుండా దీపావళిని ఊహించలేం. దీపమును వెలిగించిన తరువాత చందనం, అక్షతలు, పూలు, ధూపము సమర్పించాలి. దీనివల్ల తనకు, తన కుటుంబానికి సుఖశాంతులు ప్రాప్తిస్తాయి.

శ్లో ॥ "శుభం కరోతు కల్యాణ మారోగ్యం ధనసంపదా ।
శత్రుబుద్ధి వినాశాయ దీపజ్యోతిర్నమోస్తుతే ॥
దీపం జ్యోతిః పరబ్రహ్మ దీపజ్యోతిర్జనార్దన ।
దీపో హరతు మే పాపం దీపజ్యోతిర్నమోస్తుతే ॥

ఓ దీపమా! నీవు మాకు శుభమును చేకూరుస్తావు. ఆరోగ్యం, ధనసంపద ప్రసాదిస్తావు. శత్రుబుద్ధిని నాశనం చేస్తావు. దీపజ్యోతి నమస్కారం. నీవే పరబ్రహ్మవు. నీవు జనార్దనుడవు. పాపములను నాశనము చేయు, దీపజ్యోతీ నీకు నమస్కారం.

# హరి నామము కడు ఆనందకరము

– డా|| కూర్మాచలం శంకరస్వామి



"హరినామము కడు ఆనందకరము
మరుగవో మరుగవో మరుగవో మనసా।

నళినాక్షు నీ శ్రీనామము
కలిదోషహరము కైవల్యము
ఫలసారము బహుబంధు మోచనము
తలచవో తలచవో తలచవో మనసా ।


నగధరు నామము నరక హరణము
జగదేక హితము సమ్మతము
సగుణ నిర్గుణము సాక్షాత్కారము
పొగడవో పొగడవో పొగడవో మనసా।

కడగి శ్రీవేంకటపతి నామము
పడి పడి నే సంపత్కరమూ
అడి యానందిత సుఖము తగు
తడవవో తడవవో తడవవో మనసా।

ఆపద్బాంధవుడు, అనాథ రక్షకుడు అయిన ఆ సర్వాంతర్యామియైన ఆ శ్రీహరి నామము ఎంతో ఆనందాన్ని కల్గిస్తుందని, అలాంటి దివ్యమైన నామాన్ని మరుగవో అంటే అలవాటు చేసుకోవాలని, అప్పుడే మోక్షమార్గానికి దారి దొరుకుతుందని పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమయ్య హితబోధ చేశాడు. అంతేకాదు, నళినాక్షుడైన ఆ శ్రీమన్నారాయణుని శ్రీనామము కలిదోషాలను హరిస్తుందని, కైవల్యప్రాప్తి అనగా మోక్షం లభిస్తుందని, ఫలితం యొక్క సారము, భవబంధాల నుండి విముక్తి లభిస్తుందని, అలాంటి నామాన్ని మనసారా నిరంతరం తలచుకోవాలని అన్నమయ్య సూచించాడు.

నగధరు డు అనగా కొండల రాయుడైన ఆ శ్రీనివాసుని దివ్యనామము నరకప్రాప్తిని హరించి, స్వర్గసుఖాలను ప్రసాదిస్తుందని, జగత్ సమ్మతమై జనాలకు హితం అనగా మేలు కలిగిస్తుందని, సగుణ, నిర్గుణాల యొక్క సాక్షాత్కారం కలుగుతుందని అందువల్ల అలాంటి పవిత్రమైన నామాన్ని, ఆ శ్రీహరిని పొగడవో అనగా కీర్తించాలని, కడగి శ్రీవేంకటపతి అనగా వేంకటగిరిపై కొలువుదీరి యున్న ఆపద మ్రొక్కులవాని దివ్య నామాన్ని గొప్ప సంపత్కరము, దివ్యానందాన్ని, సుఖ సంతోషాలను కల్గిస్తుందని, అంతటి ఉన్నతమైన నామాన్ని నిరంతరం, మనసారా స్మరించాలని భక్తాగ్రేసరుడైన అన్నమయ్య

ప్రబోధించాడు. కేవలం ప్రబోధించడమే కాక స్వయంగా 32 వేల సంకీర్తనలు రచించి తానూ ఆచరించాడు కాబట్టి అన్నమయ్యకు కైవల్యం ప్రాప్తించింది. త్యాగయ్య, క్షేత్రయ్య, రామదాసు, పురందరదాసు మొదలగు వాగ్గేయకారులు తమ కీర్తనల ద్వారా భగవన్నామాలను అనునిత్యం స్మరించడం ద్వారా వైకుంఠప్రాప్తి లభించింది. కాబట్టి ఆ శ్రీహరి నామాన్ని నిత్యం జపించడం వల్ల నిత్యానందం, పరమానందం, బ్రహ్మానందం లభిస్తాయని, వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు ఉపనిషత్తులు బోధిస్తున్నాయి.



**"హరియను రెండక్షరములు**
**హరియించును పాతకంబులంబుజనాభా**
**హరి నీ నామ మహత్యము**
**హరి హరి పొగడంగ వశమే హరి శ్రీకృష్ణా!"**

ఓ శ్రీకృష్ణా! హరి యనెడి రెండక్షరములు పాపాలను హరించగలవు. ఓ శ్రీహరీ! నీ నామాలలోని గొప్పతనాలను కీర్తించుటకు అలవికానివని శ్రీకృష్ణ శతక కారుడు వినమ్రంగా ఒప్పుకున్నాడు. అంతేకాదు, మరోచోట–

**"నీ నామము భవ హరణము**
**నీ నామము సర్వ సౌఖ్య నివహాకరంబు**
**నీ నామ మమృత పూర్ణము**
**నీ నామము నోదలంతు నిత్యము కృష్ణా!"**

ఓ కృష్ణా! అనునిత్యం నీ నామాన్ని ఉచ్చరించినా అనగా నోరారా పలికినా సంసార దుఃఖములను తొలగించి సర్వసౌఖ్యముల నిచ్చును నీ నామామృతంతో నిండినది. ఎల్లప్పుడు నీ నామమునే స్మరింతును అని కీర్తించిన ఈ పద్యంలో హరినామ స్మరణ ప్రశస్తి ఎంత గొప్పదో తెలుస్తుంది.

**"నారాయణ లక్ష్మీపతి**
**నారాయణ వాసుదేవ నందకుమారా**
**నారాయణ నిను నమ్మితి**
**నారాయణ నను బ్రోవు నగధర కృష్ణా!"**

అని ఎవరైతే అత్యంత భక్తి శ్రద్ధలతో ఆ శ్రీహరిని కీర్తించిన ఆ నందుని కుమారుడైన వాసుదేవుడు తప్పకుండా రక్షిస్తాడు. స్పర్శవేది ఇనుమునంటినచో ఇనుమెట్లు బంగారముగా మారునో అలాగే హరి నామము నాలుక కొకసారి సోకిన మనము కూడా సులువుగానే మోక్షము పొందగలము.

హరి నామము కడు ఆనందకరము. హరి నామము కడు కైవల్యదాయకము అని నిరూపించిన ఉదంతాలు ఎన్నో. మన ప్రాచీన గ్రంథాలలో కోకొల్లలు. ముఖ్యంగా భారత భాగవతాలలో ఎక్కువగా కనిపిస్తాయి. కృత, త్రేత, ద్వాపర యుగాలలో మానవులను రక్షించడానికి భగవంతుడే అవతార రూపంలో వచ్చాడు. మరి కలియుగంలో ఎవరు రక్షిస్తారు అని శౌనకాది మునులు సూత పౌరాణికుడిని అడగగా కలియుగాన మానవులు అల్పజీవులు, దుర్బల శరీరాలు కలవారు, ధైర్యం లేనివారు, మందమతులు, పాపాత్ములు, పాషండ హృదయులు. అటువంటి వారికి యజ్ఞ యాగాదులు గావించే శక్తి తక్కువ. అట్టివారికి శ్రీహరి నామ సంకీర్తనలు, శ్రీహరి కథలను జాగ్రత్తగా వినడం వలన మోక్షం కలుగుతుందని, దానికి ముఖ్యంగా భాగవత పురాణం దోహదపడుతుందని సూత పౌరాణికుడు శౌనకాది మునులతో చెప్పిన విషయాన్ని బట్టి హరి నామము ఎంత పవిత్రమైనదో అర్థమవుతుంది.

ద్వాపర యుగంలో చంద్రవంశపు చివరి రాజైన పరీక్షిన్మహారాజు ఒకనాడు ఒక ఘోరారణ్యంలో క్రూరమృగాలను వేటాడి అలసిపోయి దప్పికతో అచ్చటగల శమిక మహర్షి ఆశ్రమానికి వెళ్ళాడు. ఆ సమయంలో మహర్షి బాహ్యదృష్టి లేక అంతర్ముఖ యోగనిష్ఠలో ఉన్నాడు. రాజు తనకు దాహం దారుణంగా ఉందని ఎంత పిలిచినా అర్థించినా మహర్షి బదులు పలుకక పోవడంతో కోపోద్రిక్తుడైన రాజు ఆ సమీపంలో గల ఒక చచ్చిన సర్పాన్ని మహర్షి కంఠాన్ని చుట్టి వెళ్ళిపోయాడు.

ఆ సమయంలో ఆ సమీపంలో ఉన్న శమీక మహర్షి కుమారుడు ముక్కోపి శృంగి తన తండ్రికి జరిగిన పరాభవానికి తట్టుకోలేక ఏడు దినములలో తక్షకుడనే సర్పము చేత చనిపొమ్మని మహారాజును శపిస్తాడు. ఈ విషయం తెలుసుకున్న శమీక మహర్షి తన కుమారుణ్ణి మందలించి పరీక్షిత్తుకు చెప్పి అనేక విధాల బాధపడతాడు. తనవలన జరిగిన అపరాధానికి మహారాజు కూడా మహర్షికి క్షమాపణలు చెప్పాడు. చావు ఎలాగూ తప్పదు కనుక జన్మకర్మల వల్ల కలిగిన దురవస్థను పోగొట్టి మోక్షమార్గము చూపమనగా శుకమహర్షి ఈవిధంగా

చెప్పాడు.

"హరి మయము విశ్వమంతయు
హరి విశ్వమయుడు సంశయము పనిలేదా
హరి మయము గాని ధర్మ ద్రవ్యము
పరమాణువు లేదు వంశ పావన వింటే!"

ఈ చరాచర జగత్తంతా హరి మయమే. విశ్వవ్యాప్తంగా ఉండి జగత్తును రక్షించే వాడు శ్రీహరియే. ధర్మమందు, ద్రవ్యముల యందు శ్రీహరి కొలువుదీరి యున్నాడు. అణువులోనూ, పరమాణువులోనూ ఆ పరమాత్మ వ్యాపించి యున్నాడు. కాబట్టి హరినామము అందరికీ ఆనందకరము. అలాంటి ఆనందకరమైన హరినామ స్మరణ చేసినా, శ్రీహరి పవిత్ర కథలను విన్నా మోక్షము సిద్ధిస్తుందని, 7 రోజులు భాగవత పారాయణం చేయాలని తన తండ్రి వేదవ్యాసుడు ఇలాగే చేశాడు. అంతకుముందు ఖట్వాంగదుడు అనే మహారాజు రెండు ఘడియలలో హరినామ స్మరణ చేసి మోక్ష ప్రాప్తి పొందాడని శుక మహర్షి చెప్పగా, తన రాజ్యాధికారాన్ని, సంపదను భార్యా బిడ్డలకు అప్పగించి గంగానది తీరాన శుకమహర్షి ద్వారా హరినామాన్ని జపిస్తూ శ్రీహరి కథలను వింటూ మోక్షం పొందాడు పరీక్షిన్మహారాజు.

నవవిధ భక్తిమార్గాలలో నామస్మరణం ఒకటని భాగవతం చెబుతుంది. "తన హృద్భాషల శ్రవణముని, కీర్తనం, వందనార్చనముల్, సఖ్యమున్, పాదసేవనంబు, నామస్మరనం, ఆత్మనివేదనం, దాస్యమున్ అనే నవవిధ భక్తిమార్గాలను ప్రతిపాదించాడు. అందులో శ్రవణభక్తికి – పరీక్షిత్తును, నామస్మరణకు – ప్రహ్లాదుడిని, వందనభక్తికి – అంబరీషుడిని, పాదసేవనానికి – లక్ష్మీదేవిని, సఖ్యభక్తికి – అర్జునుడు, కుచేలుడిని, దాస్యభక్తికి – ఆంజనేయుడిని, ఆత్మనివేదనానికి – బలిచక్రవర్తిని ప్రతీకలుగా చెప్పబడింది.

భక్తిమార్గంతో ముక్తిని పొందినవారిలో కేవలం పెద్దవారే కాదు, అతి పిన్నవయసు గలవారు ఉన్నారు. వారిలో పంచద్వయ వయసు గల ధృవుడు, ప్రహ్లాదులను పేర్కొనవచ్చు. ధృవుడు ఉత్తానపాదుని కుమారుడు. స్వాయంభు మనువు యొక్క మనుమడు. ఉత్తానపాదునికి ఇద్దరు భార్యలు సునీతి, సురుచి. పెద్ద భార్యయైన సునీతి కుమారుడు ధృవుడు. ఒకనాడు ధృవుడు తండ్రి తొడమీద కూర్చోబోగా పినతల్లియైన సురుచి ధృవుణ్ణి అవమానిస్తుంది. ఆ అవమానాన్ని భరించలేక తల్లి అనుమతితో అడవులకేగి, నారద మహర్షి నారాయణ మంత్ర ఉపదేశంతో అతి పిన్నవయసులో అయిదు వత్సరాల బాలుడు ఆరు మాసాలు కఠోర తపమాచరించి అను నిత్యం నారాయణ నామస్మరణ తప్ప మరే ఇతర వాటియందు దృష్టి మరల్చక ధ్యానించడంతో అతని అచంచల భక్తికి శ్రీమన్నారాయణుడు సంతసించి అతనికి ధృవపదవిని ప్రసాదించాడు.

మరో భక్తుడు ప్రహ్లాదుడు. హిరణ్య కశిపుని కుమారుడు ప్రహ్లాదుడు కూడా పంచద్వయ వయస్కుడు. అనగా 7 సంవత్సరాల వయస్సులోనే హరినామ స్మరణతో ముక్తిని పొందాడు. ప్రహ్లాదుడు చిన్నతనం నుండే ఉత్తమ గుణములు కలవాడు. "గుణనిధి యను ప్రహ్లాదుడు, గుణములనేకములు. గురు కాలమునన్, గణుతింప నశక్యములు, ఫణిపతికి, బృహస్పతికిని, భాషాపతికిన్ ఇలాంటి సద్గుణాల రాశియైన ప్రహ్లాదుడు.

"పానీయంబులు త్రావుచున్, కుడుచుచున్, భాషించుచున్ హాసలీ
లా నిద్రాదులు సేయుచున్ తిరుగుచున్, లక్షించుచున్సంతత
శ్రీనారాయణుని పాదపద్మ యుగళీ చింతామృతా స్వాద
నందానుడై మరచెన్ సురారి సుతుడే తద్విశ్వమున్ భూవరా!"

పాలు త్రాగేవేళ, పిల్లలతో ఆటలాడువేళ, భోజనం చేయువేళ, మాట్లాడువేళ, హాస్యవేళ, నిద్రవేళ, అటూ ఇటూ తిరుగువేళ ఎప్పుడు ఆ శ్రీహరి పాదపద్మముల యందే మనసు నిలిపి నిత్యం స్మరించడం చేత ఆ శ్రీహరి యొక్క కృపకు పాత్రుడయ్యాడు. అలాగే అజామిళుడు చివరి క్షణంలో నారాయణుని నామ స్మరణ చేసి వైకుంఠాన్ని పొందాడు.

చలివేంద్రం లాంటి సంసార జీవితంలో మానవులకు కలిగే సుఖ దుఃఖాల నుండి విముక్తిని కలిగించే సాధనం శ్రీహరి నామస్మరణం. మానవుల కోరికలన్నీ కొనసాగాలంటే నారాయణ నామమే గతి. అదే సద్గతి అని అన్నమయ్య ఇలా కీర్తించాడు.

"నారాయణా నారాయణా నారాయణా
నారాయణా నీ నామమే గతి ఇక
కోరికలు మాకు కొనసాగుటకు
పై పై ఉందట భవజలధి
దాపు వెనక చింతా జలధి
చపలము నడుమ సంసార జలధి
తేపయేది ఇది తెగనీదుటకు!
నారాయణా నారాయణా నారాయణా!

సాగరాలను, ఈ సంసార భవసాగరాలను, ఈ దుఃఖం నడుమ నడుమ వచ్చే చింతా జలధులను ఈది స్వర్గసుఖాలు పొందాలంటే, పాప రాశులు, పుణ్య రాశులు, త్రిగుణ రాశులు తొలగి వైకుంఠ ప్రాప్తి పొందాలంటే కింది లోకాలన్నీ నరక కూపాలు. అలాంటి నరక కూపములో పడి నశించకుండా కైవల్యమును పొందాలంటే శ్రీవేంకటేశ్వరుని పదపద్మము నందు మనసు నిలిపి నోరారా గోవిందా (హరి) నామ స్మరణ చేస్తే చాలని అన్నమయ్య పేర్కొన్నాడు. అందుకే

"హరి నామము కడు ఆనందకరము
మరుగవో మరుగవో మరుగవో మనసా!"

★ ★ ★

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

## 323. ముని శ్రేష్ఠాయ నమః

నరసింహుని శరీరము నందలి నర భాగము నరుడు అనగా మునిగా, సింహ భాగము నారాయణుడను మునిగా మారింది. ఈ నరనారాయణులు బదరికాశ్రమమున సహస్ర కవచ సంవృతులై వేలకొలది యేండ్లు తపస్సు చేశారు. వారు మరుజన్మలో నరుడు అర్జునుడుగ, నారాయణుడు కృష్ణునిగా జన్మించారు. కృష్ణావతారము సమాప్తి అయిన తరువాత దేవతలకు ఋషులకు ఇచ్చిన వరము అనుసరించి కృష్ణుడే అర్చామూర్తిగా కలియుగ దైవం శ్రీనివాసునిగా స్వయం వ్యక్తమయినాడు. శ్రీనివాసుడు వేంకటమను పర్వతమునకు అధిపతి అయినందున వేంకటేశుడుగా పిలువబడినాడు. ఆ వేంకటేశుడు జన వ్యవహారములో వేంకటేశ్వరుడుగా మారి ప్రసిద్ధమయినాడు.

వేంకటేశ్వరుడు నారాయణుని అర్చామూర్తి కనుక ముని శ్రేష్ఠుడుగ పిలువబడినాడు.

మునిశ్రేష్ఠుడైన నారాయణుని అర్చారూపమైన వేంకటేశునకు నమస్కారము.

నరనారాయణులు ధర్మునకు దక్షుని కుమార్తె అయిన మూర్తికి జన్మించారు. నరనారాయణులు తపస్సు చేయుచుండగా ఇంద్రుడు వారు ఇంద్ర పదవికై తపస్సు చేయుచున్నారని భావించి రంభ, మేనక మున్నగు అప్సరసలను నరనారాయణుల తపో భంగమునకై వారివద్దకు పంపినాడు. రంభాది అప్సరసలు నృత్యగానములతో వారి తపస్సు భంగము చేయుటకు ప్రయత్నించారు. అప్పుడు నారాయణ ముని తమ నిశ్చలత్వమును వారికి తెలుపువాడై తన ఊరువును గీరినాడు. నారాయణుని ఊరువునుండి అత్యంత సౌందర్యవతి అయిన ఊర్వశి జన్మించింది. అంత ఊర్వశిని చూచి దేవతలు సిగ్గుపడి దేవ లోకమునకు ప్రయాణమైనప్పుడు నారాయణుడు ఊర్వశిని కూడా మీతో దేవలోకమునకు తీసుకొని వెళ్ళమని ఆదేశించినాడు. అప్సరసలు ఊర్వశిని తమతో దేవలోకమునకు తీసికొని వెళ్ళినారు. నారాయణ ముని తపః ప్రభావము అత్యంత మహిమాన్వితమైనది. నారాయణుడు ముని శ్రేష్ఠుడుగా గౌరవింపబడినాడు. ఆ నారాయణుడే కృష్ణునిగా ద్వాపర యుగమున జన్మించినాడు. కృష్ణావతార సమాప్తి అనంతరం వేంకటాద్రిపై కలియుగమున వేంకటేశుడిగా స్వయం వ్యక్త అర్చామూర్తిగా అవతరించినాడు. భక్తుల అభీష్టములను తీర్చుచున్నాడు.

## 324. ముని ప్రియాయ నమః

– జితేంద్రియులై తనను ఉపాసించు మునులకు ఇష్టుడు. లేదా మునులను ఇష్టపడేవాడు కృష్ణుడు అని చెప్పవచ్చును.

ముని ప్రియుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.


## 325. గోవర్ధనాద్రి సంధర్త్రే నమః


– గోవులను, గోపకులను రక్షించుటకై గోవర్ధన పర్వతమును పైకి ఎత్తినవాడు కృష్ణుడు.

ఈ నామము యొక్క వివరణమునకై "గో సంఘ సంరక్షకాయ నమః" అను 299 నామము వివరణతో గల గోవర్ధనోద్ధారణ భాగమును పరిశీలింపుడు.

గోవర్ధన గిరిని పైకి ఎత్తి గోవులను, గోపకులను రక్షించిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

## 326. సంక్రందన తమోపహాయ నమః

– గోవర్ధనోద్ధరణ సందర్భ మున ఇంద్రుని అజ్ఞానమును తొలగించినవాడు కృష్ణుడు.

ఈ నామము యొక్క వివరణమునకై "గో సంఘ సంరక్షకాయ నమః" అను 299 నామ వివరణములో గోవర్ధనోద్ధరణ భాగమును పరిశీలింపుము.

దేవేంద్రుని అజ్ఞానమును తొలగించిన కృష్ణునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 327. సదుద్యాన విలాసినే నమః

– మంచి ఉద్యాన వనములందు విలాసముగ విహరించు వాడు కృష్ణుడు.

సదుద్యాన విలాసుడగు కృష్ణునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 328. వరుణాభ్యర్చితాయ నమః

నందుడు కార్తీక శుద్ధ ఏకాదశి నాడు ఉపవాసము చేసి భక్తి శ్రద్ధలతో విష్ణుదేవుని పూజించినాడు. పిమ్మట నందుడు నిశివేళలో అది రాక్షసులు సంచరించెడి వేళ యని తెలియక ద్వాదశీ స్నానమునకై యమునా నదిలో దిగినాడు. అప్పుడు వరుణ దేవుని సేవకుడైన రాక్షసుడు ఒకడు నందుని తీసుకొని వెళ్ళి వరుణుని దగ్గరకు చేర్చినాడు.

అంతట గోపాలురు తమ నాయకుడైన నందుడు కనపడకపోవుటచే దిగులు చెంది కృష్ణా! బలరామా! మీ తండ్రిగారైన నందరాజు కనబడుట లేదు. మీరే మాకు దిక్కు అని దుఃఖింప సాగిరి. కృష్ణుడు గోపకులను ఓదార్చి, ఆలోచించి తమ తండ్రిని వరుణుని సేవకుడు అపహరించుకుని పోయినట్లు గ్రహించి, వెంటనే కృష్ణుడు వరుణుని వద్దకు వెళ్ళినాడు. కృష్ణుని చూడగానే వరుణుడు లేచి నమస్కరించి భక్తితో అర్చించి, దేవా! పరమపురుషా! నేడు మీ దర్శనముతో నా జన్మ ధన్యమైంది. మూఢుడైన నా సేవకుడు మీ తండ్రి యగు నందుని ఇక్కడకు తీసికొని వచ్చినాడు. అతడు యుక్తాయుక్త విచక్షణ లేనివాడు. అజ్ఞానముచే అతడు చేసిన అపరాధమును క్షమింపుమని కోరుచున్నాను. నా అపరాధమును మన్నించి నన్ను అనుగ్రహించుము. గోవిందా! మీ తండ్రిని నందుని తీసుకొని పొమ్ము. నా సేవకుడు చేసిన అపరాధము కారణముగ దుర్లభమైన మీ దర్శనము నాకు లభించింది. ఇది నా పురాకృత సుకృత ఫలము.

వరుణుడు ఇట్లు వేడుకొనిన పిమ్మట కృష్ణుడు అతని యెడ ప్రసన్నుడైనాడు. కృష్ణుడు తన తండ్రిని తీసికొని బృందావనము చేరినాడు. నందుని చూచి బంధు మిత్రులందరు సంతోషించినారు.

వరుణాభ్యర్చితుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 329. గోపీ ప్రార్థితాయ నమః

– గోపికల చేత ప్రార్థింపబడినవాడు కృష్ణుడు.

గోపికల చేత ప్రార్థింపబడిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము. సమగ్ర వివరములకై ఇందుగల 318 నామ వివరణను చూడండి.

# శక్తి స్వరూపిణి దుర్గాదేవి

- చిల్లర సీతారామారావు



సకల చరాచర జగత్తును నడిపించే శక్తి ఒకటుంది. ప్రాణం పోయాలన్నా, ప్రాణం తీయాలన్నా ఆ శక్తికే పరిమితం. అందువలననే నరుడు ఆ అదృశ్య శక్తికి తల వంచుతున్నాడు. చరాచర జగత్తును నడిపించే శక్తి ఆదిపరాశక్తి. మాతృమూర్తులందరూ ఆ దేవి స్వరూపాలే. తాపత్రయాల నుండి, భవబంధముల నుండి విముక్తులు కావాలంటే శక్తిని ఆరాధించాలి. శక్తిస్వరూపిణిగా దుర్గాదేవిని ఆరాధించడం అనాదినుండి వస్తోంది. సర్వం శక్తిమయం. విశ్వమంతా శక్తి ద్వారానే నడుస్తున్నది. శక్తి లేనిదే శివం లేదు. శివం లేనిదే శక్తి లేదు. ఆ శక్తి స్వరూపమే దుర్గాదేవి.

శ్లో ॥ "ఐశ్వర్య వచనః శక్ృతి పరాక్రమ వాచకః
తత్స్వరూపా తమోర్థా త్రయాసా శక్తి ప్రకీర్తితాః"

శక్ అనగా ఐశ్వర్యము. తి అనగా పరాక్రమము. ఐశ్వర్య పరాక్రమ స్వరూపిణి, ఐశ్వర్య పరాక్రమ ధాత్రి కనుక దుర్గాదేవి శక్తి అని ప్రశంసింపబడింది.

ఆది పరాశక్తి అయిన దుర్గాదేవి బ్రహ్మాండములను నిర్మించి, పోషించి, తన ఇచ్ఛా మాత్రము చేత చరాచర జగత్తులను లయింపచేయుచున్నది. సృష్టి, స్థితి, లయల కొరకు త్రిమూర్తులను సృష్టించింది. వారికి సహాయకులుగా తన అంశాలైన లక్ష్మి, సరస్వతి, పార్వతులను వారికి ఇచ్చింది. బ్రహ్మదేవునకు సృష్టి రచనా శక్తి, విష్ణుమూర్తికి జగత్పరిపాలనా శక్తి, రుద్రునకు సంహారశక్తి, అగ్నిదేవునకు దహనశక్తిని, వాయువునకు ప్రేరణాశక్తి మున్నగు వాటిని ప్రసాదించింది. దుర్గాదేవి మంత్రములలో మాతృక, శబ్దములలో జ్ఞాన రూపిణి. జ్ఞానములో చిన్మయాతీత. శూన్యములో శూన్యకారిణి. ప్రకృతిలోని శక్తులన్నీ దుర్గాదేవి భిన్నరూపాలే. నేల, నింగి, ఆకాశం, గాలి, నిప్పు అనబడే ఈ పంచభూతములు శక్తిమయం. సూర్యచంద్రులు, నక్షత్రాలతో పాటు సకల సృష్టి శక్తిమయం. శక్తి ఒక రూపము నుండి మరొక రూపానికి మారుతూ ఉంటుంది. విష్ణు తత్వంలో ఉన్నది

కూడా ఆ శక్తియే. అర్ధనారీశ్వరుడైన శివుడు సగభాగం తాను కాగా, మిగిలిన భాగం శక్తిగా ప్రకాశిస్తున్నాడు. కాబట్టి శివశక్తి సంగమం అవిభాజ్యం. శివశక్తికైనా, విష్ణుశక్తికైనా, మరేశక్తికైనా మూలాధారం ఆదిపరాశక్తే. ఆ శక్తిని దుర్గాదేవి రూపములో పూజించడం జరుగుతున్నది.

శ్లో ॥ "సర్వశక్తిమయీ సర్వమంగళా సద్గతిప్రదా
సర్వేశ్వరి సర్వమయీ సర్వమంత్ర స్వరూపిణీ"

సర్వశక్తులు, సర్వసుఖాలు, సద్గతులను ప్రసాదించే సర్వేశ్వరి, సర్వమంత్రాత్మక, సకల యంత్ర తంత్ర స్వరూపిణి, ఆదిపరాశక్తి అయిన ఆ దుర్గాదేవే సమస్త లోకాలకు ఆధారం. ఆ శక్తే అఖిల భువనాలకు ఆలంబన. విశ్వవ్యాపకమైన, విశ్వాతీతమైన ఆ పరాశక్తిని, వేదములు, శాస్త్రములు, ఆగమములు, పురాణములు అనేక విధములుగా కీర్తించాయి.

దుర్గ అంటే ఆశ్రయ శక్తి అని అర్థము. 'దుర్గం గమయతీతి దుర్గః', చిత్తభ్రమ అనే దుర్గమమైన స్థితిని దాటించగలిగే శక్తి దుర్గ. దేవి యనగా 'దివ్యతే క్రీడతి ఇతి దేవి' అనగా క్రీడించేది అని అర్థము. దుర్గ అను నామము బీజాక్షర సంపుటిగా, అజ్ఞానాన్ని, రుగ్మతలను తొలగించి ఆనందమును కలుగచేస్తుంది. దుర్గ శబ్దము మహిమాన్వితము, అతి మధురము.

శ్లో ॥ దైత్య నాశార్థ వచనో దకారః పరికీర్తితః
ఉకారో విఘ్ననాశస్య వాచకో వేద సమ్మతః
రేఫో రోగఘ్న వచనో గశ్చ పాపఘ్న వాచకః
భయ శత్రుఘ్న వచనశ్చకారః పరికీర్తితః"

'దుర్గ' శబ్దములోని దకారము దైత్య నాశనమునకు, ఉకారము విఘ్ననాశనమునకు, రేఫ రోగ నాశనమునకు, గకారము పాపనాశనమునకు, అకారము భయ, శత్రు నాశనమునకు సంకేత పదములని దేవీ పురాణమునందు చెప్పబడింది. శక్తి స్వరూపిణి అయిన దుర్గాదేవిని మొదట శ్రీకృష్ణుడు పూజించాడు. మధు కైటభులకు భయపడిన బ్రహ్మ దుర్గామాతను ఆరాధించాడు. త్రిపురాసుర కారణముగా త్రిపురారి మూడవసారి దుర్గను పూజించాడు. దుర్వాసుడి శాపము వలన సిరిని కోల్పోయిన దేవేంద్రుడు దుర్గాదేవిని పూజించాడు. దేవతలు, మహర్షులు, మానవులు మున్నగు వారందరూ దుర్గామాతను పూజించారు.


దుర్గామాత సకల దేవతా స్వరూపిణి. దుర్గ అను రెండక్షరాలను ప్రతిరోజూ స్మరించేవారికి సమస్త ఆపదలు తొలగిపోయి సుఖశాంతులు లభిస్తాయి. స్వార్థపరత్వం, అసూయ, ఈర్ష్యా ద్వేషాలు, కోపావేశాలు మున్నగువాటిని అణచి, మానవకోటిని సక్రమ మార్గములో నడిపించే, ఆ దుర్గాదేవి మనలను చెడునుంచి రక్షించే ఆపద్బాంధవి. తనను నమ్మిన భక్తులను కంటికి రెప్పలా కాపాడే చల్లని తల్లి.

నక్షత్రములలో మొదటిది అశ్వని. ఈ నక్షత్రముతో కూడిన పూర్ణిమ ఆశ్వయుజ మాసం. ఆశ్వయుజ శుక్ల పాడ్యమి నుండి శరత్కాలము ప్రారంభమవుతుంది. ఆశ్వయుజ మాసమునందు దుర్గామాతను ఆరాధించడం తర తరాల నుండి వస్తున్నది. ఆశ్వయుజ మాసమునందు శరదృతువు ప్రవేశిస్తుంది. ఆహ్లాదమును కలిగించు ఈ ఋతువునందు వర్షములు తగ్గి, నలువైపులా పచ్చదనము వ్యాపించి మనస్సుకు నూతనోత్సాహం కలుగుతుంది. శరత్కాలంలో శక్తిని ప్రసన్నం చేసుకోవడానికి జరిపే ఉత్సవాలనే శరన్నవరాత్రి ఉత్సవాలు అని పిలుస్తారు. శరన్నవరాత్రులకు త్రిశక్తి రూపాలు దుర్గ, లక్ష్మి, సరస్వతులు అధిపతులు. శరన్నవరాత్రులలో మొదటి మూడు రోజులు దుర్గాదేవిని, తర్వాతి మూడు రోజులు శ్రీమహాలక్ష్మిని, చివరి మూడు రోజులు సరస్వతీ దేవిని ఉపాసిస్తారు. భక్తి శ్రద్ధలతో నవరాత్రులను జరుపుకోవడం వలన ధన ధాన్యములు, సుఖసంతోషాలు, సంతానాభివృద్ధి, దీర్ఘాయువు, పరిపూర్ణమైన ఆరోగ్యం సంప్రాప్తిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

వ్రతధారులు దుర్గాపూజకు కావలసిన సామగ్రిని ఏర్పాటు చేసుకోవాలి. ఆవుపేడతో అలికి ముగ్గులు పెట్టుకోవాలి. మంటపమును నిర్మించి దాని చుట్టూ రంగు రంగుల తోరణాలు కట్టాలి. వేదిక మీద పట్టుగుడ్డ పరచి అమ్మవారిని స్థాపించాలి. ఆ ప్రతిమ నాలుగు చేతులు కలిగి, అన్ని ఆయుధములను ధరించి ఉండాలి. వేదిక కుడివైపున కలశం స్థాపించాలి. పంచపల్లవాలతోను, మంత్రాలతోను సంస్కరించాలి. మంచితీర్థంతో నింపాలి. హస్తానక్షత్ర యుక్త పాడ్యమి నాడు విధియుక్తంగా చేసిన పూజ సర్వశ్రేష్ఠమై అన్ని కోరికలను సఫలీకృతం గావిస్తుంది. పగలు ఉపవాసం ఉండాలి. సాయంకాలం అమ్మవారి ప్రసాదాన్ని ఆహారంగా తీసుకోవాలి. వ్రతమును చేసినన్ని రోజులు నేలమీదనే పడుకోవాలి.

దేవీ నవరాత్రులలో కుమారికలను పూజించే సంప్రదాయము ఉన్నది. కుమారి పూజలకు రెండు సంవత్సరముల నుండి పది సంవత్సరముల ప్రాయము కలిగిన బాలికలు అర్హులు. ఈ బాలికలను అమ్మవారి రూపములుగా భావించి పూజ చేసేవారికి సకల సౌభాగ్యాలు ప్రాప్తిస్తాయి. ఒక సంవత్సరము కలిగిన బాలిక పూజకు అనర్హురాలు. రెండు సంవత్సరములు కలిగిన బాలికను కుమారీ అను పేరుతో పూజించితే దుఃఖము, దారిద్ర్యము నశించిపోతాయి. శత్రువులు అంతరించిపోతారు. ధనము, బలము, ఆయువు అభివృద్ధి చెందుతాయి. మూడు సంవత్సరములు కలిగిన బాలికను త్రిమూర్తి యను పేరుతో పూజించితే ధనధాన్య సమృద్ధి, పుత్ర పౌత్రాభివృద్ధి, ధర్మార్థ కామాలనబడే త్రివర్గ ఫల ప్రాప్తి కలుగుతుంది. నాలుగు సంవత్సరములు కలిగిన బాలికను కళ్యాణి అను పేరుతో పూజించితే విద్య, విజయం, సుఖాభిలాషలు,

సకలాభీష్టాలు నెరవేరుతాయి.



అయిదు సంవత్సరాల బాలికను రోహిణి అను పేరుతో పూజించినట్లయితే సమస్త రోగాలు నశించిపోతాయి. జీవితము ఆనందమయంగా సాగిపోతుంది. ఆరు సంవత్సరములు కలిగిన బాలికను కాళిక యను పేరుతో పూజిస్తే శత్రువులు నశించిపోతారు. ఏడు సంవత్సరములు కలగిన బాలికను చండిక అను పేరుతో పూజిస్తే ఐశ్వర్యం అభివృద్ధి చెందుతుంది. ఎనిమిది సంవత్సరములు కలిగిన బాలికను శాంభవి యను పేరుతో పూజించితే శోకం, దుఃఖం, దారిద్ర్యం మున్నగునవి నశించిపోతాయి. తొమ్మిది సంవత్సరములు కలిగిన బాలికను దుర్గ యను పేరుతో పూజించితే శత్రునాశనం, పరలోకసుఖం మున్నగునవి ప్రాప్తిస్తాయి. పది సంవత్సరములు కలిగిన బాలికను సుభద్ర యను పేరుతో పూజించితే సమస్త కోరికలు నెరవేరుతాయి. సర్వకార్యసిద్ధికి బ్రాహ్మణ బాలికలను, విజయాలకు క్షత్రియ బాలికలను, ధనము కొరకు వైశ్య బాలికలను, వంశాభివృద్ధికి శూద్ర బాలికలను పూజించాలి. దశమినాడు ప్రాతఃకాలమున శాస్త్ర ప్రకారము పూజించి అమ్మవారి ప్రతిమను సమీపమున గల జలాశయమునకు తీసుకొని వెళ్ళాలి.

**శ్లో ॥ "దుర్గాదేవి జగన్మాత స్వస్థానం గచ్ఛ పూజితే**
**సంవత్సరే వ్యతీతేషు పునరాగమ నాయవై**
**ఇమాం పూజాం మయా దేవి యథా శక్త్యోప పాదితామ్**
**రక్షార్థస్త్రం సమాదాయ వ్రజ స్వస్నాముత్తమమ్"**

మాతా! నీవు నీ స్వస్థానాన్ని పొందుము. ఈ జలమున ప్రవేశించి స్థిరముగా ఉండుము. సంవత్సరం గడిచిన తరువాత మరల రావలయును అని ప్రార్థించి ప్రతిమను జలమునందు నిమజ్జనం చేయాలి.

దేవీ నవరాత్రులలో నవరాత్రి వ్రతమును చేస్తారు. ఆ వ్రత మహిమను తెలియజేసే కథ ఒకటి ఇలా ఉంది. పూర్వకాలమున ఒక వైశ్యుడు ఉండేవాడు. అతడు సద్గుణ సంపన్నుడు. చాలా బీదవాడు. తన సంతానానికి కడుపునిండా తిండి పెట్టలేక పోయెడివాడు. అయినా కూడా అతిథి అభ్యాగతులను, దేవతలను, పితరులను పూజించి, అతిథులకు ఆతిథ్య మొసగిన తరువాత, తన కుటుంబము తినిన తరువాత మిగిలినది తను తినేవాడు. అతని సద్గుణముల వల్ల అతనికి సుశీలుడు అను పేరు వచ్చింది. భాగవతోత్తములు ఎవరైనా తన దారిద్ర్య నివారణకు మంచి సలహాలు ఇస్తారేమోనన్న ఆశతో సౌమ్యమూర్తి అయిన ఒక బ్రాహ్మణుడితో తన బాధను ఇలా వ్యక్తం చేశాడు. మహాత్మా! నా పేరు సుశీలుడు. నేను దరిద్రావస్థలో ఉన్నాను. భార్యకు, పిల్లలకు కడుపు నిండా తిండి పెట్టలేకపోతున్నాను. ఒక పిల్లవాడు తిండి కోసం ఏడుస్తూ ఉంటే వెళ్ళగొట్టాను. అతడు ఇల్లు విడిచిపోయాడు. ఆ బాధ నన్ను క్రుంగతీస్తున్నది. పెళ్ళీడుకొచ్చిన కూతురు ఉన్నది. నా దగ్గర ధనము లేదు. పెళ్ళి ఎలా చేయగలను? నా దరిద్రం తొలగిపోవడానికి జపం, తపం, మంత్రం ఏదయినా ఉంటే దయచేసి తెల్పండి. సుశీలుడి మాటలు వినిన ఆ సౌమ్యమూర్తి ఇలా అన్నాడు. సుశీలుడా! నీవు భగవతిని ఆరాధించు. నవరాత్ర వ్రతమును చేయుము. హోమం చేసి బ్రాహ్మణులకు భోజనం పెట్టుము. జప, తప, మంత్రాదులతో దేవిని స్తుతించుము. నవరాత్ర వ్రతము చాలా శ్రేష్ఠమైన వ్రతము. ఈ వ్రతము జ్ఞానమును, మోక్షమును ప్రసాదిస్తుంది. సంతానానికి సమస్త సుఖాలను ప్రసాదిస్తుంది. శత్రు నాశనం గావిస్తుంది. సీతా వియోగంతో బాధపడుతున్న శ్రీరాముడు కిష్కింధ పర్వతం మీద ఈ వ్రతమును ఆచరించి, ఆ దేవి కృపతో సాగరం మీద సేతువును నిర్మించి లంకానగరం వెళ్ళి రావణుడిని సంహరించాడు. కనుక దేవీ నవరాత్ర వ్రతమును ఆచరింపుము. నీకు సర్వసుఖములు కలుగుతాయి. సుశీలుడు సౌమ్యమూర్తి అయిన ఆ బ్రాహ్మణుడిని గురువుగా చేసుకుని భక్తి శ్రద్ధలతో తొమ్మిది సంవత్సరాలు నవరాత్ర వ్రతమును చేశాడు. తొమ్మిదవ సంవత్సరము అష్టమినాడు దేవి ప్రత్యక్షమై అనేక వరములను ప్రసాదించింది.

శ్లో ॥ "మహా పాతక సంయుక్తో నవరాత్ర వ్రతంచరేత్
ముచ్యతే సర్వపాపేభ్యో నాత్రకార్యాం విచారణా"

ఎంతటి పాపాత్ముడైనా గాని, నవరాత్ర వ్రతమును ఆచరించితే, వాడు సమస్త పాపముల నుండి విముక్తుడు అవుతాడు. ఇందులో ఎటువంటి సంశయానికి తావు లేదు.

జగన్మాత, ఆదిపరాశక్తి అయిన అమ్మకు దుర్గ అను పేరు రావడానికి సంబంధించి ఒక కథ దేవీ భాగవతములో చెప్పబడింది. ప్రాచీన కాలములో దుర్గడు అను రాక్షసుడు ఉండేవాడు. అతడికి దేవతలంటే అమితమైన ద్వేషము. దేవతలను ఎలా నాశనము చేయాలన్న ఆలోచనలతో ఉండేవాడు. దేవతల శక్తికి మూలం వేదము. వాటికి తోడ్పడేవి సుస్వరముతో వల్లించే మంత్రాలు. వీటిని వశం చేసుకుని, నాశనం గావిస్తే దేవతలు చీమల్లాగా నశించిపోతారు. వేదములు సులభముగా గావించెడివి గావు కనుక బ్రహ్మను గురించి తపము గావించి ఆయన అనుగ్రహముతో వాటిని పొందాలి అని సంకల్పించుకొనిన దుర్గముడు బ్రహ్మను గురించి ఘోరమైన తపము గావించాడు. దుర్గముడి తపమునకు ప్రసన్నుడైన బ్రహ్మ ప్రత్యక్షమైనాడు. దుర్గముడిని వరమును కోరుకోమని ఆదేశించాడు. దేవా! అన్ని వేదములు, ముల్లోకములలో గల మంత్రములు అన్నీ నా స్వాధీనము కావాలి అని తన కోరికను వెల్లడించాడు దుర్గముడు. తథాస్తు అని పలికి అదృశ్యుడైనాడు బ్రహ్మ.

బ్రహ్మదేవుడు ఇచ్చిన వరప్రభావము వలన వేదాలు, మంత్రాలు అన్నీ దుర్గముడి స్వాధీనమయ్యాయి. వేదాలు, మంత్రాలు లేకపోవడం వలన యజ్ఞ యాగాదులు అన్నీ ఆగిపోయాయి. దేవతలకు చెందవలసిన హవిస్సులు వారికి అందకపోవడం వలన వారు బలహీనులయ్యారు. దేవతల బలహీనులను ఆధారము చేసుకొని దుర్గముడు వారితో యుద్ధము చేసి వారిని పరాజితులను కావించి ఇంద్రపురిని తన స్వాధీనము లోనికి తెచ్చుకున్నాడు. భూలోకంలో భయంకరమైన క్షామం ఏర్పడింది. నీటి స్థావరములన్నియు ఎండిపోయినాయి. ప్రజలు ఆకలి బాధ పడలేక అల్లాడసాగారు. పశువులు అనావృష్టిని తట్టుకోలేక పిట్టల్లాగా రాలిపోసాగాయి. ఈ అనర్థాలను చూడలేక శాంతి కాముకులయిన భూసురులు ఆదిపరాశక్తి అయిన జగదంబను శరణు వేడారు. కరుణామయి అయిన జగదంబ, వంద నేత్రముల నుండి అశ్రువర్షము కురిపించింది. సర్వత్రా పచ్చదనం కానరాసాగింది. తన వంద నేత్రాలతో ప్రజలను కాపాడింది కనుక ప్రజలు గౌరవముతో భక్తి ప్రపత్తులతో ఆమెను శతాక్షి అని పిలువసాగారు. ఆకలితో అలమటిస్తున్న ప్రజలకు శాకములు ప్రసాదించింది. ఆ కారణముగా ఆమె శాకంబరి అయింది.



భూసురులను, దేవతలను హింసించిన దుర్గముడి మీద అంతులేని ఆగ్రహం కలిగింది అమ్మకు. అతడిని సంహరించాలని అనుకున్నది. దుర్గముడిని సమరానికి ఆహ్వానించింది. ఇరువురి మధ్య పది రోజులు భయంకరమైన యుద్ధము జరిగింది. పదకొండవ రోజున సమరంలో రథాశ్వములను, రథసారథిని, ధ్వజమును కూల్చింది. అమ్మ వేసిన ఒక బాణము దుర్గముడి వక్షస్థలమును చీల్చింది. రక్తవాంతులు చేసుకుంటూ మృత్యు ఒడిలోనికి పోయాడు దుర్గముడు. దుర్గముడిని అవలీలగా వధించిన జగదంబను భక్తులు దుర్గాదేవి అని నామమిడి భక్తి శ్రద్ధలతో ఆరాధించుకోసాగారు.

జగన్మాత ఒక్కొక్క అవతారములో ఒక్కొక్క రాక్షసుడిని సంహరించింది. మహాకాళి రూపములో మధుకైటభులను సంహరించుటలో మహావిష్ణువుకు తోడ్పడింది. మహిషాసురుడిని సంహరించి మహిషాసుర మర్దిని అయింది. మహాసరస్వతి రూపములో శుంభ నిశుంభులు అను రాక్షసులను సంహరించింది. చాముండి రూపంలో చండ, ముండ అను రాక్షలను హతమార్చింది. రక్తదంతి అవతారములో రక్తము క్రింద పడటం వలన రక్తబీజుడు అను రాక్షసుడిని సంహరించింది. భ్రామరీ అవతారములో అరుణాసురుడిని సంహరించింది. ఇటువంటి అనంత శక్తిస్వరూపిణి అయిన జగన్మాత దుర్గాదేవిని భక్తిశ్రద్ధలతో ఆరాధించి ఆమె కరుణా కటాక్షములకు పాత్రుడు కావలెనని ప్రతి భక్తుడి వాంఛితము. దుర్గను ఆరాధిస్తే అజ్ఞానము నశించి జ్ఞానము పెరిగి సకల సుఖములు చేకూరునని ప్రగాఢ విశ్వాసము.

శ్లో ॥ "సర్వ స్వరూపే సర్వేశే సర్వశక్తి సమన్వితే
భయేభ్యస్త్రాహినో దేవి దుర్గే దేవి నమోస్తుతే"

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

హిరణ్మయేన పాత్రేణ... ఇది ఈశావాస్య ఉపనిషత్తు – 15వ మంత్రం. విషయ భోగ్య వస్తువులుంటాయి. అవి బంగారు కాంతులు విరజిమ్ముతూ ఉంటాయి. అపరిమితంగా ఆకర్షిస్తాయి. పరమాత్మని జీవుడు ఇలా ప్రార్థిస్తాడు. నారాయణా! నా మనస్సుని ఆకర్షిస్తున్నాయి లౌకిక సుఖభోగాలు. వాటి ఆచ్ఛాదన తొలగించు. నీ దర్శన భాగ్యం కలిగించు – అది ఆ మంత్ర భావార్థం. అది జీవుని నివేదనలోని సారాంశం. సాధకుడు కాని ఉపాసకుడు కాని హనుమంతునిలా ఉండాలి. మైనాకుడు బంగారు శిఖరాల మయుడు. మారుతిని ఆకర్షించాడు. అతని ఆకర్షణకి లోను కాలేదు. ఆతిథ్యానికి ఆశపడలేదు. అవాంతర ఫలాన్ని తిరస్కరించలేదు. స్వీకరించినట్లు చెయ్యి మోపాడు. వెళ్ళాడు. ఈ రహస్యాన్ని హనుమంతుని ద్వారా తెలియచెబుతున్నాడు వాల్మీకి.

మారుతి మైనాకునికి ఇచ్చిన సమాధానం గమనిస్తే – అలతి అలతి పదాలు. ఎవరితో ఎలా మాట్లాడాలో ఎంతవరకు మాట్లాడాలో ఎదుటివాళ్ళని ఎలా సంతృప్తి పరచాలో అది వాయుపుత్రునికే సాధ్యం. మున్ముందు నాగమాతతో, సీతమ్మతో మాట్లాడిన తీరు గమనించాలి. రావణాసురునితో మాట్లాడిన తీరు అద్భుతం. అది అతని వాక్చతురికి సమయస్ఫూర్తికి ధైర్యానికి నిదర్శనాలు.

రామస్వామి కార్యంలో భాగస్వామి అయ్యాడు సంపాతి. కాలిన రెక్కలు తిరిగి వచ్చాయి. మైనాకుడూ రామకార్యంలో సాయపడ్డాడు. అతని రెక్కలూ నిలిచాయి. రామకథ వింటే రామకథ చెబితే రామకథ చదివితే ఎంత పాపఫలం నశిస్తుందో ఎంత పుణ్యఫలం లభిస్తుందో సర్మగర్భంగా చెప్పాడు వాల్మీకి. అందులో సుందరకాండ ఒక విశిష్టస్థానంలో ఉంది. అది నిత్యపారాయణ గ్రంథమన్నారు పెద్దలు. అంతేకాదు సుందరకాండ సకలాభీష్టదాయిని. సర్వరోగ నివారిణి అన్నారు అనుభవజ్ఞులు.

పిలవకపోయినా భోజన సమయానికి వచ్చినవాడు అభ్యాగతుడు. పిలిస్తే వచ్చేవాడు అతిథి. అతను వస్తున్నాడంటే ఇల్లంతా శుభ్రం చేస్తాం. మరి భగవంతుణ్ణి రమ్మని పిలుస్తాం. ఆ స్వామి కావాలంటే మనసుని ఎంత శుభ్రపరచుకోవాలో అందరూ ఆలోచించాలి. ఆచరించాలి.

## నాగమాత – సురస

మైనాకుణ్ణి దాటాడు హనుమంతుడు. ముందుకు సాగుతున్నాడు. దేవతలు గంధర్వులు ఋషులు పిలిచారు సురసని. అంటున్నారు "మారుతి రామకార్యార్థమై పోతున్నాడు. అతని బలమెంతో తెలుసుకోవాలి. పరాక్రమం ఎంతో

తెలుసుకోవాలి. ఉపాయంలో నిన్ను జయిస్తాడా? ఓడిపోతాడా? – తెల్సుకోవాలి. అతని గమనాన్ని అడ్డగించు. ముహూర్త కాలం విఘ్నం కల్గించు చూద్దాం''.

తర్వాత నాగమాతని సమ్మానించారు. సూర్యతేజస్సులా వెలిగిపోతోందామె. సముద్రం పైకి వచ్చి నిలిచింది సురస. చేతుల్లేవు, కాళ్ళు లేవు. వికృతంగా ఉంది. భయావహంగా ఉంది. రాక్షసాకారం దాల్చింది. వాయుపుత్రుణ్ణి అడ్డగించింది. ''హనుమంతుడా దేవతలు అనుగ్రహించారు నన్ను. నిన్ను నాకాహారంగా ఇచ్చారు. నిన్ను భక్షిస్తాను. ఇదిగో నా నోరు. నా నోట్లోకి రా'' అంది.

కాంతిమంతుడు హనుమంతుడు కలత చెందలేదు. 'ప్రహృష్ట వదన శ్రీమాన్' అన్నాడు వాల్మీకి. అతని ముఖంలో సంతోషం తొణికిసలాడింది. శ్రీమంతుడట మారుతి. చేతులు జోడించాడు. ''అమ్మా! దండకారణ్యంలో సీతను అపహరించాడు రావణుడు. ఆమె రాముని భార్య. నేను రామ దూతను. సీతాన్వేషణలో ఉన్నాను. నీవు ఉండేది రామరాజ్యంలోనే కదా. రామునికి సహాయం చెయ్ తల్లీ. కాదంటావా – నన్ను తింటావా – ఇపుడే వద్దు. సీతమ్మను చూస్తాను. రామునికి చెబుతాను. తిరిగి వస్తాను. నీ నోటిలో ప్రవేశిస్తాను. ఇది నిజం. ఒట్టు'' అన్నాడు. అతని స్వరంలో వినయం ఉట్టిపడుతోంది.

''నన్ను దాటి పోలేవు. ఇది బ్రహ్మదేవుని వరం. వెంటనే నా నోట్లోకి రా'' నోరు తెరచింది కామరూపిణి సురస.

చూశాడు హనుమంతుడు. మంచితనం పనికిరాదనుకున్నాడు. ''సరే. నన్ను మింగేంత నోరు తెరువు'' అన్నాడు. పది యోజనాలు పెంచాడు దేహాన్ని.

ఆమె ఇరవై యోజనాలు నోరు తెరిచింది. హనుమ 30 యోజనాలు పెరిగాడు. ఆమె 40 యోజనాలు పెంచింది నోరు. అలా పెరగడం సాగింది. నూరు యోజనాల నోరు విప్పిందామె. చూశాడు మారుతి. బుద్ధిమంతుడు. సూక్ష్మగ్రాహి. తను పెంచితే లాభం లేదనుకున్నాడు. సుబుద్ధిమాన్ అన్నాడు వాల్మీకి. వెంటనే తన కాయం కుదించాడు. అంగుష్ఠమాత్రుడైనాడు. ఆమె నోట్లో దూరాడు. నోరు మూసే లోపల – చిటికెలో బయటికి వచ్చేశాడు. అంతరిక్షే స్థితః శ్రీమాన్ అన్నాడు వాల్మీకి హనుమంతుణ్ణి. అంతరిక్షంలో శ్రీమంతుడై నిలిచాడు. అంటున్నాడు ''దాక్షాయణీ! నీకు నమస్కారం. నీ నోట్లోకి పోయాను. బ్రహ్మవరం సఫలమైంది. ఇక నన్ను పోనీ. సీతాదేవి కోసం వెళ్ళాలి''.

వినింది సురస. నిజరూపం ధరించింది. ''సౌమ్యుడా! వానరశ్రేష్ఠా! రామకార్యం సిద్ధిస్తుంది. పో. వైదేహిని చూడు. రామసన్నిధి చేర్చు'' అంది.

హనుమంతుణ్ణి శ్రీమాన్ అన్నాడు వాల్మీకి. అంటే ఐశ్వర్యవంతుడని అర్థం. అది భౌతికమైంది కాదు. అది నశిస్తుంది. అది భగవదైశ్వర్యం. అది శాశ్వతం. ఆ ఐశ్వర్యం వల్ల రామానుగ్రహం పొందాడు. ఆ భగవత్ ప్రాప్తితో ప్రతిబంధకాల్ని అధిగమించాడు. మైనాకుడు అందించే సుఖాలు తిరస్కరించాడు. దుష్కర కర్మలన్నీ అధిగమిస్తాడు కూడా.

నాగమాతకి సురస అని పేరు. సు అంటే మంచి – అపరిమితం అని కూడా అర్థాలున్నాయి. రసమంటే ఆనందం. అపరిమితమైన ఆనందం. తను ఆనందాన్ని పొందుతుంది. ఇతరులకి ఆనందాన్ని ఇస్తుంది. ఆమె దేవతల ప్రేరణతో వచ్చింది. ఆమె రాక్షసి రూపం ధరించినా వాయుసుతుణ్ణి పొంగలేదు. నోరు పెంచడం కర్మాచరణకి సంకేతం. కర్మలు చేయడం వల్ల కోరికలు పెరుగుతాయి. వాటికి అంతు వుండదు. కర్మ వల్ల జన్మ తప్పదు. 'న కశ్చిత్ క్షణమపి' – ప్రతిక్షణం కర్మ చేసి తీరాలి. ఊరికే కూర్చోడం కూడా ఒక కర్మ అంటుంది గీతామాత. కర్మలాచరిస్తే బంధం కదా అని ప్రశ్న. కర్తృత్వాన్ని వదలాలి. నేను చేస్తున్నాను. నా కోసం చేస్తున్నాను అనే భావన ఉండరాదు. ప్రతిఫలాపేక్ష కూడా విడిచిపెట్టాలి. ప్రతి కర్మ భగవదర్పితం కావాలి. నేను సముద్రాన్ని దాటడంలేదు. రాముడు నాచేత దాటిస్తున్నాడు. రామబాణంలా పోతాను అనుకున్నాడు హనుమంతుడు. అందుకే అతడు బుద్ధిమాన్ శ్రీమాన్ అనిపించుకున్నాడు. అందుకే నాగమాత అతణ్ణి మింగలేదు. బంధించలేదు. అతడామెను చంపనూ లేదు. అది హనుమంతుని మూడో దుష్కర కార్యం. చూశాయి సర్వభూతాలు. మెచ్చుకున్నాయి.

మళ్ళీ ఆకాశమార్గం పట్టాడు ఆంజనేయుడు. అది తుంబుర నారదుల సంచార మార్గం. అది అగ్నిదేవుడు సంచరించే మార్గం. దేవతలకి హవిస్సులు తీసుకెళ్ళే మార్గం. అందుకే అగ్నిదేవుణ్ణి హుతవాహనుడంటారు. ఇంద్రధనుస్సులు అక్కడే వ్యాపిస్తాయి. సూర్యచంద్రుల సంచారమార్గం అదే. గ్రహనక్షత్రాదులు విలసిల్లే మార్గం అదే. ఆ మార్గంలో వాయుపుత్రుడు పోతున్నాడు. గరుడ గమనుడై సాగుతున్నాడు. మంగళకరమైన మార్గం అది.

## సింహిక

సముద్రం పైకి పోతున్నాడు హనుమంతుడు. చూసింది సింహిక. అదొక రాక్షసి. కామరూపిణి. దేహాన్ని పెంచింది. ''పెద్ద జంతువు. చాలాకాలానికి చిక్కింది. తినేస్తాను'' అనుకుంది. మారుతి నీడను పట్టింది. లాగింది. వాయుపుత్రుని వేగం తగ్గింది. ఎదురు గాలికి ఊగిన ఓడలా అయ్యాడు. తానెవరికో పట్టుపడ్డానని భావించాడు. పైకి చూశాడు. చుట్టుపక్కల చూశాడు. కిందికి చూశాడు. కనిపించింది సింహిక. కొండలా ఉంది. వికృతంగా ఉంది ముఖం. సముద్రంలో ఛాయాగ్రాహి ఉంటుంది. సుగ్రీవుడు చెప్పాడు. అనుమానం లేదు. అదే అని నిశ్చయించుకున్నాడు. తన శరీరం పెంచాడు. చూసింది రాక్షసి. గర్జించింది. నోరు

పెద్దది చేసింది. అదొక పాతాళంలా ఉంది. చూశాడు హనుమ. దాని ఆయువుపట్టు గమనించాడు.

మేధావి హనుమంతుడు. బలవంతుడు. వజ్రదేహుడు. వెంటనే సూక్ష్మరూపంలోకి మారాడు. సింహిక నోట్లోకి దూరాడు. దాని గుండెకాయ పట్టాడు. గోళ్ళతో చీల్చాడు. బయటికి వచ్చాడు. ఎగిరాడు. వెంటనే దేహాన్ని పెంచాడు. గుండె పగిలింది. చచ్చింది సింహిక. ఇది నాలుగో దుష్కరకార్యం. సాధించాడు వాయుపుత్రుడు.

కార్యసాధకునికి నాలుగు లక్షణాలుండాలి. 1.ప్రతిబంధకాల్ని ఎదుర్కొనే ధైర్యం 2. సూక్ష్మదృష్టి 3. సమయస్ఫూర్తి 4. సామర్థ్యం. ఈ నాలుగు ఉన్నవాడు – తలపెట్టిన పనుల్లో సఫలమవుతాడు. ఎప్పటికీ వైఫల్యం పొందడు.

అపార సముద్రం చూశాడు వాయుపుత్రుడు. భయపడలేదు. కలత చెందలేదు. నూరు కాదు, ఎన్ని యోజనాలైనా ఎగరగలను అనుకున్నాడు. అది ధైర్యం. మైనాకుని అతిథి మర్యాదలకు ఆశ పడలేదు. విశ్రాంతికి సుఖాలకి లొంగలేదు. లక్ష్యం మీదనే దృష్టి ఉంచాడు. ప్రతి కర్మ భగవదర్పితం చేశాడు. కర్మబంధంలో చిక్కుపడలేదు. అదే సురస పట్ల ప్రదర్శించిన సమయస్ఫూర్తి. ఉపాయాన్నిబలాన్ని ఉపయోగించాడు. సింహికని మట్టుపెట్టాడు. అది అతని శక్తి సామర్థ్యం.

సురస సింహిక ఇద్దరూ స్త్రీలే. ఇద్దరి నోళ్ళలో దూరాడు. బయటపడ్డాడు హనుమ. విహితకర్మ ఆచరించాడు. సురసని చంపలేదు. గౌరవించాడు. నమస్కరించాడు. ఆశీస్సులందుకున్నాడు. నిషిద్ధకర్మ తిరస్కరించాడు. నిర్దాక్షిణ్యంగా చంపాడు సింహికని.

హనుమ గరుడ గమనుడైనాడు. ఆకాశాన పోతున్నాడు. సముద్రం ఆవలి తీరం కనిపించింది. రాక్షసులు తన మహాకాయం చూస్తారేమో ఆశ్చర్యపోతారేమో అనుకున్నాడు. కొండంత దేహాన్ని కుదించాడు. నిజరూపంలోకి వచ్చాడు. సముద్రపు గట్టు చేరాడు. చేయాల్సిన పని ఆలోచించాడు. దగ్గరలో లంబ పర్వతం కనిపించింది. ఎగిరాడు. దానిమీద కాలు మోపాడు. ఒళ్ళు విదిలించుకున్నాడు. పక్షులు, మృగాలు చూశాయి మారుతిని. బెదిరాయి. చుట్టూ చూశాడు. త్రికూట పర్వతం అల్లంత దూరంలో ఉంది. దానిమీద ఉంది లంకానగరం. దేవేంద్రుని అమరావతిలా ఉంది అది.

## లంకా నగరం

వంద యోజనాలు దాటాడు హనుమంతుడు. ఒక్క నిట్టూర్పు విడువలేదు. అలసట పడలేదు. ఈ నూరు యోజనాలు నాకో లెక్కా అనుకున్నాడు. లంబ పర్వతం మీద నిలుచున్నాడు. లంకా నగరాన్ని చూశాడు. అది విశ్వకర్మ నిర్మించిన నగరం. దాని శోభను తిలకిస్తున్నాడు. రాముడు వస్తాడేమో – భయం రావణునికి. రాక్షసులు కాపలా కాస్తున్నారు. భయంకర రూపులు వాళ్ళు. చేతుల్లో శూలాలు ఉన్నాయి. పట్టిసలు (అడ్డకత్తులు) ఉన్నాయి. ధనుర్బాణాలు ఉన్నాయి. అద్భుత రక్షణ వ్యవస్థ. చుట్టూ సముద్రం. కోట చుట్టూ కందకాలు. బంగారు ప్రాకారాలు. నగరంలో భవనాలు శరత్కాల మేఘాల్లా ఉన్నాయి. అంతరిక్షంలో వెలిగే గృహాల్లా ఉన్నాయి. బహిర్ద్వారాలు పతాకాలు అద్భుతం. బహు సుందరం. ఆ పట్టణ నిర్మాణం విశ్వకర్మ సంకల్పం.

పూర్వం లంకానగర పాలకుడు కుబేరుడు. ప్రస్తుతం రావణ పాలితమైంది. దేవతలు వచ్చినా ఏమీ చేయలేరు. అంత కట్టుదిట్టమైన రక్షణ వలయం. ఇక వానరులు సముద్రాన్ని దాటలేరు. దాటి వచ్చినా వ్యర్థమే. జయించడం కల్ల. ఈ దుర్గాన్ని జయించలేడు రాముడు. సామోపాయానికి లొంగరు రాక్షసులు. అందరూ ఐశ్వర్యవంతులు. ధనానికి లొంగరు. మిత్రభేదానికి లొంగరు. ఇక వీళ్ళతో యుద్ధం చేయాలి. అది అసాధ్యం, అసంభవం. సుగ్రీవుడు అంగదుడు నీలుడు నేను ఇక్కడికి రాగలం. అసలు వైదేహి బతికి వుందా? బతికి వుంటే ఆమెని చూడాలి. చూశాక నిర్ణయానికి రావాలి. అవి హనుమంతుని ఆలోచనలు.

మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. ఈ రాక్షసులు ఉగ్ర తేజస్కులు. మహాబలశాలురు. అమిత పరాక్రమవంతులు. నన్ను చూస్తే పట్టుకుంటారు. లోపలికి ఎలా వెళ్ళాలి? వంచనతో వెళ్ళాలి. అపుడే లంకా ప్రవేశం. లోపలికి వెడితే – రాక్షసులకి కనబడరాదు. రావణుని కంటపడరాదు. అందుకు ఉపాయం ఏది? ఎలా చేస్తే రామకార్యం చెడిపోదో – అలా చేయాలి. జనకాత్మజని చూడాలి. అంటే ఆమె ఒంటరిగా ఉండాలి. అది సాధ్యమా? చూడాలి. వచ్చిన పని చెడిపోరాదు. సముద్ర లంఘనం వ్యర్థం కాదు. రాక్షసుల కన్ను కప్పాలి. లేకపోతే స్వామికార్యం చెడిపోతుంది. రాక్షస రూపంలో వెడితే – వాళ్ళకి తెలియకుండా ఎలా వుండాలి? గాలిని కూడా శాసిస్తున్నారు. చీమ చిటుక్కుమన్నా తెలిసిపోతుంది వాళ్ళకి. నా నిజరూపం పనికిరాదు. ఇలా పోరాదు. ఇపుడు కాదు. చీకటి పడాలి. ఎవ్వరికీ కనపడరాదు. లంకలో చొరబడాలి. నా పనికి రాత్రే తగిన సమయం. నిశ్చయానికి వచ్చేశాడు. అది ఆంజనేయుని ఆరాటం. సూర్యాస్తమయం కోసం నిరీక్షిస్తున్నాడు.

## నగర వర్ణన

అస్తమించాడు సూర్యుడు. చూశాడు హనుమంతుడు. దేహాన్ని చిన్నది చేసుకున్నాడు. పిల్లి అంత రూపంలోకి మారాడు. ఎగిరాడు. లంకా పట్టణం దగ్గరికి పోయాడు. బహిర్ద్వారం చేరాడు. లోపలికి చూశాడు. విశాలమైన రాజవీధులు, ప్రాసాద పంక్తులు, కాంచనమయ స్తంభాలు, బంగారు కిటికీలు,

ఏడు అం తస్తుల మేడలు, ఎనిమిది అంతస్తుల భవనాలు, బంగా రు రేకులు స్ఫటికాలు తాపిన నేలలు, వైదూర్య మణిమయ రాజభవనాలు, తెల్లని విమాన గృహాలు, ఊహించ అలవికాని అలంకరణలు, అద్భుత నగర కాంతులు చూశాడు హనుమంతుడు. విషణ్ణుడైనాడు. ఎక్కడ ఉంటుంది సీతామాత – చూస్తాను తప్పక – అనుకున్నాడు. చూశాడు వాయుపుత్రుని చంద్రుడు. సహాయం చేస్తున్నాడా అన్నట్లుగా నక్షత్రాల మధ్య వెన్నెల చాందినీ పరచినట్లుగా ఉదయించాడు. అది తామర కొలనైతే విహరించే హంసలా ఉన్నాడు చంద్రుడు. అంటే అది ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి.

ఇంకా నిశితంగా చూశాడు లంకని. ప్రాసాదాల మీద విహార స్థలాలు కనిపించాయి. బంగారు వేదికలు కనిపించాయి. అవి వైదూర్య మణుల చేత పొదగబడ్డాయి. ప్రాసాద అగ్రభాగాల్లో చతుశ్శాలలు కనిపించాయి. స్ఫటిక మణిమయ తాపడాల సోపానాలు కనిపించాయి. ద్వారాల దగ్గర రాజహంసలు తిరుగాడుతున్నాయి. క్రౌంచ పక్షులున్నాయి. నెమళ్ళున్నాయి. నృత్త గీతవాద్య ధ్వనులు వినపడుతున్నాయి. స్త్రీల ఆభరణాల సవ్వడులు విన్పిస్తున్నాయి. బలిష్ఠులైన రాక్షసులు కనిపించారు. వివిధ ఆయుధాలు ధరించి ఉన్నారు. అలా కలియచూస్తున్నాడు. సింహద్వారం దగ్గరికి పోయాడు హనుమంతుడు.

## లంకిణి

ఒక రాక్షస స్త్రీ కనిపించింది. ఆమె లంకాధి దేవత. ఆమె కూడా చూసింది మారుతిని. ఆమె ముఖం భయంకరంగా ఉంది. చూపుల్లో క్రూరత్వం ఉంది. లేచి ఎదురుగా నిలిచింది.

**కస్త్వం కే నచ కార్యేణ ఇహ ప్రాప్తో వనాలయ**

"నీవెవరు? నీవు కోతివి. అడవిలో ఉండాలి. ఇక్కడ నీకేం పని? ఎందుకు వచ్చావో చెప్పు. చూశావా రాక్షస బలాన్ని. లోపలికి పోలేవు. అది నీ తరం కాదు. ఎందుకు వచ్చావు? నిజం చెప్పు. లేకపోతే నీ ప్రాణం తీస్తా" – అడ్డుపడిందామె.

విన్నాడు హనుమంతుడు. అంటున్నాడు "నీ ముఖం వికృతంగా ఉంది. నీ కన్నులూ అలాగే ఉన్నాయి. ఎవతెవు నీవు? ఎందుకు వాకిట ఉన్నావు? ఎందుకు భయపెడుతున్నావు? నాకెందుకు అడ్డుపడుతున్నావు?

వినింది కామరూపిణి లంకాధి దేవత. పరుషంగా అంటోంది.

**అహం రాక్షస రాజస్య రావణస్య మహాత్మనః ।**
**ఆజ్ఞా ప్రతీక్షా దుర్ధర్షా నగరీ మిమామ్ ॥**
**అహం హి నగరీ లంకా స్వయమేవ ప్లవంగమ ।**
**సర్వతః పరిరక్షామి హ్యేతత్తే కథితం మయా ॥**

"వానరా! రాక్షసరాజుర రావణుడు మహాత్ముడు. నేను అతని ఆజ్ఞానువర్తిని. నేను సాక్షాత్ లంకాధి దేవతను. నన్నెవరూ



ఎదిరించలేరు. నగర రక్షకురాలిని. ఈ లంకను కాపాడటం నా కర్తవ్యం. ఇది నా సంగతి. ఇక నీ సంగతి చెప్పు".

విన్నాడు హనుమంతుడు. ఆమెని ఎదిరించాలనుకున్నాడు. పర్వతాకారుడైనాడు. "భవనాలతో ప్రాకారాలతో కోట బురుజులతో తోటలతో అడవులతో అందంగా ఉందీ నగరం. ఒకసారి చూస్తాను. పోతాను. అందుకే వచ్చాను".

ఓ వానరా! నీకు దుర్బుద్ధి పుట్టింది. ఇది రావణ రాజ్యం. లోపలికి పోలేవు. నన్ను జయించలేవు. చంపేస్తాను నిన్ను అంది లంకిణి కోపంతో.

జవాబు ఇస్తున్నాడు హనుమంతుడు. లంకా! శుభాంగీ! చెప్పానుగా నగరాన్ని చూస్తాను. వస్తాను. వచ్చిన దారిన పోతాను" స్వరంలో వినయం ఉంది.

భయంకరంగా అరిచిందామె. అరచేతులు చాచింది. ఫెళ్ళున కొట్టింది మారుతిని. దెబ్బ బలంగా తగిలింది. క్రోధ పరవశుడైనాడు హనుమ. మహానాదం చేశాడు. ఆడది. చంపరాదనుకున్నాడు. ఎడమ చేతివేళ్ళు ముడిచాడు. పిడికిలి ఎత్తి కొట్టాడు. అది ముష్టిఘాతం. విహ్వలురాలైంది. కళ్ళు తిరిగాయి. కింద పడింది. చూశాడతడు. జాలి వేసింది. కోపం పోయిందతనిలో.

లంకిణిలో గర్వం అణిగింది. దిగులు పడింది. భయపడింది. గొంతు వణికింది. అంటోంది "మహాబాహూ! అనుగ్రహించు. కపీశ్వరా! కాపాడు. మహాబలశాలురు ధీరులు స్త్రీ వధ చేయరు. అది వారి నియమం. నేను సాక్షాత్తు లంకాధి దేవతను. నన్నెవరూ జయించలేరనుకున్నాను. నీవు బలపరాక్రమవంతుడవు. నన్ను జయించావు. వానరోత్తమా! నీకో విషయం చెబుతాను విను. అది రావణుని జైత్రయాత్రా సమయం. నందికేశ్వరుని బాధించాడు. అవమానించాడు. లంక భస్మమైపోతుందని శపించాడు. అది తెలిసింది నాకు. నేనూ భస్మమై పోతానా? – భయం వేసింది. బ్రహ్మదేవుణ్ణి చేరాను. విషయం చెప్పాను. ఒక వానరుడు వస్తాడు. నిన్ను జయిస్తాడు. రాక్షసులందరూ నాశనమైపోతారు అన్నాడు. నీవు వచ్చావు. నన్ను జయించావు. బ్రహ్మ వాక్కు సత్యమైంది. దురాత్ముడు రావణుడు. రాక్షస వినాశనం దాపురించింది. నీవు లోపలికి పో. యథేచ్ఛగా తిరుగు. జానకిని వెతుక్కో. నీ పనులన్నీ చక్కపెట్టుకో.

**(సశేషం)**

# ముకుందమాల

- డా|| భువనేశ్వరి మారేపల్లి, 9550241921

ధారావాహికం



### 23 శ్లోకం

**శత్రుచ్ఛేదైక మంత్రం సకల ముపనిషద్వాక్య సంపూజ్య మంత్రం**
**సంసారోత్తార మంత్రం సముపచిత తమస్సంఘ నిర్యాణ మంత్రం।**
**సర్వైశ్వర్యైక మంత్రం వ్యసన భుజగ సందష్ట సంత్రాణ మంత్రం**
**జిహ్వే! శ్రీకృష్ణ మంత్రం జపజప సతతం జన్మసాఫల్య మంత్రం ॥**

ఓ జిహ్వే! (ఓ నాలుకా!!) శ్రీకృష్ణ మంత్రమును సర్వదా జపింపుము. అదియే జన్మకు సాఫల్యము ఇచ్చునది. కామాది శత్రువులను భేదించుటలో ప్రధాన సాధనం ఆ మంత్రము. సర్వోపనిషద్ వాక్యములు ఆ మంత్రమునే పూజించినవి. జనన మరణములనెడి సంసారము నుండి తరింపచేయగల మంత్రమది. రాశీభూతమైన అవిద్యాంధ కారమును నశింపజేయు మంత్రము. ఆ మంత్రమే సర్వైశ్వర్యములను ఇచ్చెడిది. వ్యసనములనెడి సర్పములు కాటువేసినప్పుడు కాపాడ గల మంత్రము. కనుక శ్రీకృష్ణ మంత్రమును సర్వదా జపింపుము.!!

"శత్రుచ్ఛేదైక మంత్రం" శత్రువులను సంహరించే ముఖ్యమైనటువంటి మంత్రం, అంటే అపార కారుణ్యముతో పరమాత్మ సమస్త జీవులయందు భేదములు లేకుండగా సర్వసామ్య బుద్ధితో సృష్టించాడు. వీడు నన్ను ఆరాధించాడు, వీడు నన్ను ఆరాధించ లేదు అటువంటి భేదములు లేకుండా జీవులలో గుణదోషములను లెక్కించకుండా పరమాత్మ సృష్టి చేసాడు. అంతటి ఉదార మూర్తి కనుకనే ఆయనకు విశ్వసృట్ అని తిరునామం కలిగింది. అటువంటి పరమాత్మ నిర్హేతుక కృప వలన ఆయనకు చెందిన వారమనే జ్ఞానం కలిగి ఆశ్రయించే సమయములో అడ్డుతగిలేటు వంటి శత్రువులను తొలగించేది పరమాత్మ యొక్క దివ్యమైనటువంటి నామము.

**"సకల ముపనిషద్వాక్య సంపూజ్య మంత్రం" –**
**"యచ్చ కించిజ్జగత్సర్వం దృశ్యతే శ్రూయతే పివా ।**
**అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్యనారాయణ స్థితః" ॥**

తాను పెద్దదై ఉండి, తనకంటే మరొకటి మించినది లేనిది, దేనిని ఆశ్రయిస్తే తరిమ్పచేసేదో అంటే – అది నారాయణ తత్వం. అంటే వాస్తవికమైన వస్తువు లేక పారమార్థికము అని అంటారు. అట్లా తెలుసుకోదగినవి ఎన్నో ఉన్నా, వాటిల్లో తెల్సుకోవాల్సిన "పరం" తత్వం ఏది అంటే, అది నారాయణ. ఇలా సకల ఉపనిషత్తుల సారభూతుడు శ్రీమన్నారాయణుడే ఆయన యొక్క దివ్య నామమే పూజించ తగిన మంత్రం.

"సంసారోత్తారమంత్రం" సంసారమనే ఈ సాగరమునుండి తరిమ్పచేసేటువంటిది, అజ్ఞానం చేత అనాదిగా పెంచి పోషించుకుంటూ వస్తున్నటువంటి పాపపు రాశి సంతతిని దగ్ధం చేయగలిగిన శక్తివంతమైన మంత్రము పరమాత్మ యొక్క నామము.

"సర్వైశ్వర్యైకమంత్రం" అలాగే సమస్త ఐశ్వర్యములను కలుగచేసేటువంటి మంత్రము.

"వ్యసనభుజగసందష్ట" దుఃఖములనే పాములచేత కరవబడిన వారిని నిన్నటి శ్లోకంలో వివరించి నట్లు గరుడమణి వలే కాపాడే నీలమేఘమణి వంటి వాడైన పరమాత్మ నామమంత్రమును.

ఈ జన్మకు సాఫల్యమును కలిగించే మంత్రమైనటువంటి శ్రీకృష్ణనామ మంత్రమును సర్వకాల సర్వావస్థల యందు నాలుకా! దీనిని జపిస్తూ ఉండుము అంటూ కులశేఖరాళ్వార్లు పరమాత్మయొక్క నామ వైభవము అందించే ఫలములను తెలియ జేస్తూ అర్థపంచకం సూచిస్తూ ఆశ్రయించ తగిన ఉపాయమును బోధిస్తున్నారు.

భగవంతుని ఆరాధిస్తే ఒక బాంధవ్యం ఏర్పరచుకొని, ప్రేమిస్తే ఆయన ఎంతగా ఆ భక్తుల వెంటపడి తిరుగుతుంటాడో! ఆ పరమాత్మ భక్తవత్సలతను తెలపడానికి ఎందరో మహా భాగవతోత్తముల జీవితాలు నిదర్శనాలుగా ఉన్నాయి. అటువంటి ఒక మహాభక్తుని కథ ద్వారా ఆ పరమాత్మ కారుణ్యాన్ని దర్శిద్దాం!

ఒకప్పుడు పూరీ క్షేత్రానికి దగ్గరలోని ఓ గ్రామంలో

'మాధవ దాసు' అనే చిన్నవ్యాపారి ఉండేవాడు. అతడు ధర్మ బద్ధమైన వ్యాపారం చేస్తూ, లభించిన దానితో తృప్తిగా జీవనం చేస్తూ, దైవ చింతనతో ఉండేవాడు. దైవానుగ్రహం వల్ల తనకు లాభాలు వచ్చినా, ఆ ఆస్తులతో అంతే తృప్తిగా జీవించే వాడు. కాలక్రమంలో ఆయన భార్య గతించింది. పిల్లలు పెళ్లిళ్లు అయిపోయి స్థిరపడ్డారు. అప్పుడు ఆయన తనకున్న ఆస్తిపాస్తులను పిల్లలు అందరికీ సమంగా పంచేసి తను పూరీకి వెళ్ళాడు.

పూరీలో జగన్నాథుని సన్నిధిలో ఆ స్వామి నామస్మరణతో జీవితం వెళ్లదీయాలని నిర్ణయంతో అక్కడికి వెళ్ళాడు. కట్టుబట్టలతో వెళ్లడంతో, చూడడానికి బిచ్చగాడిలా కనిపించాడు గుడిలోని అర్చకులకు. అందువల్ల అక్కడి వారు ఆయన్ని గుడిలోకి రానివ్వలేదు. అక్కడే దూరంగా ఉండి స్వామినే స్మరిస్తూ కూర్చున్నాడు. కానీ ఎవ్వరినీ తిట్టడం చేయలేదు. నాలుగు రోజులుగా తిండి లేకపోవడంతో ఓ రాత్రి సొమ్మసిల్లి పడిపోయాడు. నామస్మరణ మాత్రం ఆపలేదు. అప్పుడు జగన్నాథుడికి జాలి కలిగింది. అమ్మను పిలిచి ఇలా మాట్లాడాడు.

"రుక్మిణీ! నా భక్తుడు చూడు! ఆహారం లేక సొమ్మసిల్లి పడిపోయాడు. నువ్వు మనకు పెట్టిన ఈ నైవేద్యం తీసుకుని వెళ్లి ఇవ్వు! అమ్మవు కదా నువ్వు. బిడ్డడి ఆకలి తీర్చాలి కదా!" అని జగన్నాథుడు అనగానే విన్న ఆ జగన్మాత చిరునవ్వు నవ్వి..

"అలాగే స్వామీ!" అని రకరకాల ఆహార పదార్థాలతో అక్కడ నైవేద్యం పెట్టి ఉన్న బంగారు పళ్లెం తీసుకుని మాధవదాసు వద్దకు వెళ్ళింది అమ్మ.

"నాయనా! లేచి ఈ ఆహారం తిను! కాస్త ఓపిక వస్తుంది. ఆ స్వామి నామస్మరణ చేసుకోవచ్చు" అని అనగానే ఆయన లేచి ఆహారం తిన్నాడు.

"అమ్మా! జగన్మాతలా వచ్చి నా ఆకలి తీర్చావు!" అన్నాడు మాధవదాసు కాస్త ఓపిక రాగా అమ్మకు నమస్కారం చేస్తూ.

"ఇక పడుకో!" అని అమ్మ అనగానే పడుకున్నాడు.

అసలు ఈ ఆహారం తెచ్చింది ఎవరు, ఏమిటి అని ఆలోచనలు చేసే స్థితిలో ఆయన లేడు అప్పుడు. అమ్మ అక్కడ్నుంచి వెళ్ళిపోయింది. మరునాడు తలుపులు తెరిచిన అర్చకులకు నైవేద్య పాత్ర కనిపించలేదు. పాత్ర కోసం వెదుకుతూ మాధవదాసు ఉన్న చోటికి వచ్చారు. అక్కడ మాధవదాసు జగన్నాథుని నామాన్ని జపిస్తూ కూర్చుని ఉన్నాడు. ఆయన పక్కన నైవేద్య పాత్ర కనిపించింది వారికి. ఆ బంగారు పాత్రను మాధవదాసు దొంగిలించాడని వాళ్ళు అనుకున్నారు. ఉదయాన్నే లేచిన మాధవదాసు కాలకృత్యాలు తీర్చుకుని స్వామిని స్మరిస్తూ, నామాన్ని జపిస్తూ కూర్చున్నాడు. ఆ పాత్రలో ఎవరో తల్లి ఆహారం ఇచ్చి వెళ్లిందని గుర్తుకు వచ్చింది ఆయనకు. మళ్ళీ వాళ్లు ఎవరైనా



కనిపించి పాత్ర గురించి అడిగినప్పుడు ఇవ్వవచ్చునని భావించి నిశ్చింతగా వున్నాడు ఆయన.

మాధవదాసును దొంగగా భావించిన అర్చకులు కోపోద్రిక్తులు అయ్యారు. ఒక కర్ర తీసుకుని, ఆయన్ని వివరాలు ఏమీ అడక్కుండా కొట్టడం మొదలుపెట్టారు. తన మాటలు వినిపించు కోకుండా వాళ్ళు కొడుతుంటే ఆ జగన్నాథుని నామాన్నే పలుకుతూ వున్నాడు ఆయన. తమ కోపం కాస్త తగ్గిన తర్వాత కొట్టడం ఆపేసి, ఆ నైవేద్య పాత్ర తీసుకుని, గుడి లోనికి చరచరా వెళ్లారు అర్చకులు. లోపలికి వెళ్లి జగన్నాథుని వంక చూసి, ఆశ్చర్యపోయారు. జగన్నాథుని మూర్తి పైన దెబ్బలు కనిపించాయి. వెంటనే తమ వల్ల ఏదో అపచారం జరిగిందని, అందుకే స్వామి ఇలా కనిపిస్తున్నాడని వాళ్ళు ఏడ్చారు. ఆ జగన్నాథుడు చెప్పినట్లుగా ఒక అర్చకునికి మనసులో స్ఫురించింది.

"మనం అపచారం చేశాం! బయట వున్న అతన్ని కొట్టాం కదా! ఆయన జగన్నాథుని భక్తుడు అయి ఉంటాడు. స్వామి యొక్క పరమ భక్తుడు అయిన వ్యక్తిని కొట్టాం. అందుకే ఆ దెబ్బలు స్వామి స్వీకరించి తన భక్తుని రక్షించుకున్నాడు! మనం వెంటనే వెళ్ళి ఆ భక్తుని పాదాలపై పడి క్షమాపణ వేడుకుందాం!" అని అన్నాడు తోటి అర్చకులతో. అందరూ పరుగెత్తి మాధవదాసు కాళ్లపై పడి క్షమించమని వేడుకున్నారు. గుడిలోకి సగౌరవంగా తీసుకుని వచ్చారు. అప్పుడు ఆశ్చర్యంగా స్వామి విగ్రహం పైన ఉన్న దెబ్బలు మాయం అయ్యాయి. అందరూ సంతోషించారు.

అప్పట్నుంచి ఆయన నిరాటంకంగా గుడిలోకి వెళ్లి, ప్రతిరోజూ జగన్నాథుని దర్శించుకుంటున్నాడు.

కానీ ఈ సంఘటన గురించి ప్రచారం జరిగిపోయింది. ఎంతో మంది జనాలు మాధవదాసును దర్శించు కోవడానికి రావడం మొదలుపెట్టారు. ఆయనను పొగడ్తలతో ముం చెత్తారు. తమ కోరికలు తీర్చమని కోరసాగారు. దాని వల్ల ఆయనకు భగవధ్యానం చేసుకునేందుకు అవకాశం దొరకకుండాపోయింది. ఈ పొగడ్తల వల్ల తనకు అహంకారం పెరిగి, భక్తి నశిస్తుందేమోనని కూడా భావించాడు ఆ భాగవతోత్తముడు. అన్నీ వదిలించుకుని జగన్నాథుని కోసం వస్తే, ఇలా మళ్లీ అన్నీ అనవసరమైనవి అంటుకుంటున్నాయని భావించిన మాధవదాసు, ఎవ్వరికీ చెప్పకుండా ఓ రాత్రి అక్కడ్నుంచి బయలుదేరాడు. అప్పుడు జగన్నాథుడు బాలునిగా మాధవదాసుకు కనిపించి, వెళ్లవద్దని కోరాడు.

"మాధవా! నువ్వు ఇక్కడే ఉండు!" అన్నాడు.

"నేను ఇక్కడ ఉండలేను తండ్రీ! నేను నీ ధ్యానంతో జన్మ తరింపజేసుకుని, మోక్షం పొందాలని వచ్చాను. కానీ ఇక్కడ అది వీలుపడేలా లేదు. అందరూ నా చుట్టూ చేరితే నాలో అహంకారం చేరి పోయి నీ నుంచి దూరం అయిపోతాను. అందుకే వెళ్లిపోతున్నాను" అని అన్నాడు మాధవదాసు.

"అయితే నన్ను కూడా నీ వెంట తీసుకుని వెళ్ళు!" అని అన్నాడు జగన్నాథుడు.

"అయ్యో తండ్రీ! నీవు జగన్నాథుడవు! నీవు నా వెంట వస్తే నీకు కావాల్సిన భోగాలు నేను సమకూర్చలేను. కనీసం సమయానికి ఆహారం కూడా ఇవ్వలేను కదా. నా మాట విని నువ్వు ఇక్కడే ఉండు. లేదంటే నాకు బాధ కలుగుతుంది" అని అనునయించాడు స్వామిని.

తర్వాత బయలుదేరి ఎన్నో ప్రదేశాలు తిరిగాడు. కొన్ని రోజులుగా తిండి లభించలేదు ఆయనకు. ఓరోజు రాత్రి సమయంలో చాలా నీరసం రాగా నడుస్తున్నాడు. ఒక ఇల్లు కనిపించింది మాధవ దాసుకు. అక్కడికి వెళ్లి ఆ ఇంటి ముందు నిల్చుని భిక్ష అడిగాడు. ఆ యింటి ఇల్లాలు భోజనానికి పిలిచింది. కాళ్ళూ, చేతులు శుభ్రపరుచుకుని భోజనానికి కూర్చున్నాడు ఆయన. ఆమె రెండు విస్తళ్ళల్లో భోజనం వడ్డించింది. ఆ ఇంటి యజమాని కోసమేమో అని ఈయన అనుకున్నాడు. ఆయన వచ్చి కూర్చున్నాక మొదలు పెడదామని చూస్తున్నాడు.

"స్వీకరించండి. మీరు చూస్తే ఊళ్లు తిరిగే సన్యాసిలా వున్నారు. ఇంత చిన్న పిల్లవాడిని వెంటబెట్టుకుని ఎందుకు తిరుగుతున్నారు. పసి పిల్లవాడికి ఆకలి వేస్తే, ఎలా పెట్టగలుగుతారు? పాపం పిల్లవాడు ఆకలితో అల్లాడి పోతున్నాడు. ఎంత ముద్దుగా ఉన్నాడో! ఈ పిల్లవాడిని ఇక్కడ వదిలి వెళ్ళండి. వాణ్ణి నేను



చూసుకుంటాను" పక్కనే వేసిన విస్తరి వైపు చూపిస్తూ అంది ఆవిడ.

ఆ మాటలు విన్న మాధవదాసు ఆశ్చర్య పోయాడు. ఆ పిల్లవాడు ఎవరో కాదు. ఆ నల్లనయ్య! ఆ పరాత్పరుడు! ఆ జగన్నాథుడే అని అర్థమై క్షణంలో కళ్ళల్లో నుంచి నీళ్లు ధారగా ఉబికాయి ఆయనకు. ఆమెకు విషయం చెప్పి, ఆమె జన్మ తరించిందని చెప్పి, అక్కడ్నుంచి బయలు దేరాడు. కొంత దూరం వెళ్లి, ఓ గ్రామం లోకి వెళ్ళాక ఆయనకు విపరీతమైన జ్వరం వచ్చింది. తెలివి తప్పిపోయాడు. ఆయనకు తిరిగి స్పృహ వచ్చేసరికి, ఒక చిన్న ఇంటిలో మంచంలో పడుకుని వున్నాడు. ఒక పిల్లవాడు మందులు ఇస్తూ సపర్యలు చేస్తూ ఉన్నాడు.

విషయం అర్థమైన మాధవదాసు...

"స్వామీ! వద్దన్నా ఎందుకు ఇలా నా వెంట ఉండి, సపర్యలు చేస్తున్నావు? నా ఈ పరిస్థితికి అసహ్యం వేస్తోంది. నీ చేత నేను సేవలు చేయించుకోవడం ఏమిటి? నా స్థితిని తప్పించగలవాడివి అయి ఉండి, ఇలా ఎందుకు చేస్తున్నావు?" అని ఏడిచాడు.

"నీ కర్మ ఫలం ఇంకా పదిహేను రోజులు అనుభవించ వలసి ఉంది. అది కూడా అయిపోతే, నీవు మోక్షం పొందుటకు పూర్తి అర్హుడవు అవుతావు. కానీ నీ భక్తికి వశుడిని అయ్యాను. సర్వదా నన్నే స్మరిస్తూ ఏ కష్టానికి చలించని నీ వంటి భక్తులను ఎలా వదులుకుంటాను? అందుకే నీ వెంటే ఉంటున్నాను. నీవు అన్నట్లుగా నేను కర్మ ఫలం తీయగలను. కానీ నీవంటి మహాభక్తునికి కొడుకుగా సేవ చేయడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది. నీ కోరిక మేరకు నువ్వు అనుభవించాల్సిన మిగతా పదిహేను రోజుల కర్మ ఫలం తీసివేసి, నీకు మోక్షం

ప్రసాదిస్తున్నాను! అయితే నీ చరిత్ర అందరికీ తెలిసి, నీ భక్తిని అందరూ స్మరించుకోవాలి. అందుకోసం నీ పదిహేను రోజుల కర్మఫలం అయిన జ్వరం నేను స్వీకరిస్తున్నాను" అని చెప్పి ఆయనకు ముక్తిని ఇచ్చాడు ఆ జగన్నాథుడు.

ఇందుకు గుర్తుగా ప్రతి సంవత్సరం పూరీలో జగన్నాథుడికి జ్వరం వస్తుంది ఇప్పటికీ. డాక్టరుని పిలిచి, ఆయుర్వేదానికి సంబంధించిన ఆహారం మాత్రమే నైవేద్యంగా పెడతారు. ఆ సమయంలో వివిధ రకాల నైవేద్యాలు ఉండవు. ప్రతి సంవత్సరం జగన్నాథ రథయాత్రకు పదిహేను రోజుల ముందు స్వామికి పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తారు. ఆ సందర్భంగా నూట ఎనిమిది బిందెల నీళ్లతో అభిషేకం చేస్తారట. ఆ నీటివల్ల స్వామికి, సుభద్ర, బలభద్రులకు కూడా జ్వరం వస్తుంది. సాధారణంగా జ్వరం వచ్చినప్పుడు స్వెటర్, మఫ్లర్ వేసుకుంటారో అలాగే వాళ్లకు ధరింప జేస్తారట. దర్శనాలు నిలిపివేస్తారు. రథయాత్రకు ముందు రోజు దర్శనం ఉంటుంది. తరువాత రథయాత్ర మొదలు అవుతుంది.

ఇటువంటి భక్తుల చరిత్ర చదివినా, విన్నా మనసు ఆ దేవదేవుని పాదపద్మాలకు చేరకుండా ఉంటుందా? తప్పకుండా మన మనసు ఆయనను చేరుకుంటుంది.

**కాంక్షంతః కర్మణాం సిద్ధిం యజంతే ఇహ దేవతాః।**
**క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిః భవతి కర్మజా॥**

ఈ లోకమున కర్మఫలమును ఆశించువారు ఇతర దేవతలను పూజింతురు. ఏలనన అట్లు చేయుటచే కర్మల వలన కలుగు సిద్ధి వారికి శీఘ్రముగా కలుగుచున్నది.

భగవద్గీత 4 వ అధ్యాయం, 12 వ శ్లోకం లో వారి వారికి కావలసిన దాని నిచ్చునట్టి మంత్రమిది. కామ్యకర్ములకును వేదమందు విశ్వాసము కలుగు కొఱకు వేదమందును అట్టి మంత్రములు చెప్పబడియున్నవి. అట్లు వేదమందు విశ్వాసము కలిగి చూచుచు పోగా ఇంతకంటే ఎక్కువ సుఖమున్నదని కనుగొందురు.

భగవంతుడి మంత్రము సర్వైశ్వర్యముల నిచ్చునది. ప్రతి వారికినీ శరీరసౌఖ్యము లేకయో, ఆలుబిడ్డలు మొదలగువారి వలననో, విద్య మొదలగునవి లేవనియో ఏదేని ఒక వ్యసనం ఉండక మానదు. వ్యసనములను అనుభవించు చున్నప్పుడు పాముచేత కరవబడినట్లు ఉండును. ఇట్టి వారిని కాపాడుమంత్రము, బాల్యయౌవనాదులను అనుభవించుచు భార్యాపుత్రులు మొదలగు వారి విషయమున సంబంధపడి చీకటియందు మునిగి పోనీయక జన్మమును సఫలము చేయు మంత్రము. అటువంటిది శ్రీ కృష్ణ మంత్రము. నాలుకా! దీనిని జపింపుము. అని కులశేఖరాళ్వారులు ఆ మహామంత్రోపదేశం చేస్తున్నారు.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

# మీ ప్రశ్న మా సమాధానం

**నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1. శ్రీమన్నారాయణుడు నాలుగు రకాల నాశనాలు చేస్తాడని విన్నాను. సృష్టి, స్థితి, లయకారులు బ్రహ్మ, విష్ణు మహేశ్వరులు కదా! శివుడు లయకర్త, నాశనం చేయువాడని విన్నాను. మరి శ్రీమన్నారాయణుడు ఏం నాశనం చేస్తాడు? నాశనం చేసినవాడు ఎలా గొప్పవాడయినాడు?**
**శ్రీమతి కీర్తి, శ్రీనాథ్ – షాద్ నగర్**

జవాబు – మీరు విన్నది నిజమే. శ్రీమన్నారాయణుడు విష్ణు సహస్ర నామ స్తోత్రం ప్రకారం చేసే నాశనాలు వేరు, మహేశ్వరుడు లయకర్తగా చేసే వినాశనం వేరు. శ్రీమన్నారాయణుడు చేసేవి 4 రకాల నాశనాలు. అవి 1. శోకనాశనం (632) 2. భయ నాశనం (634) 3. దుః స్వప్న నాశనం (926) 4. పాప నాశనం (992). అనగా విష్ణు సహస్రనామ స్తోత్రంలోని 632, 634, 926, 992 నామాల ప్రకారం స్వామి వివిధ శోక, భయ, దుః స్వప్న, పాపములను పోగొట్టి భక్తులను రక్షిస్తాడు. మహేశ్వరుడు యుగాంతంలో యావత్ సృష్టిని లయింపచేస్తాడని అంటారు.

**2. వ్రతం అంటే ఏమిటి? చాతుర్మాస్య వ్రతం గురించి తెలియజేయండి? దేశికన్ మరింగంటి, తాడేపల్లి**

జవాబు – వ్రతం అంటే నియమం. 'వరం తనోదీతి వ్రతం' – అని శబ్ద వ్యుత్పత్తి. నియమ నిష్ఠలతో భగవంతుని పూజించి, ఆయన అనుగ్రహ నిమిత్తం వ్రతాలు చేయడం జరుగుతోంది. దీనిలో ఎన్నో వ్రతాలున్నాయి. వాటన్నిటిలోనూ భిన్నమైనది, విశిష్టమైనది చాతుర్మాస్య వ్రతం. సంవత్సరంలో ఈ నాలుగు నెలలూ (ఆషాఢం నుంచి) శ్రీమన్నారాయణుడు యోగనిద్రలో ఉంటాడు. వర్షాలుంటాయి. కాబట్టి జీయర్లు, యతులు సంచారం చేయక ఒకే చోట ఉండి స్వామిని ఆరాధిస్తారు.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**
**– ఎడిటర్, శ్రీవేంకటేశం**

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## ఆదిత్య పురాణాంతర్గతం

**గత సంచిక తరువాయి**

నీవు అందరికీ ప్రేరకుడవు. ముక్తులైనవారిని, సంసార బద్ధులైన వారిని కూడా నియమించేవాడవు. అఘటనఘటనా సమర్థుడవు. అనంత కల్యాణ గుణవిభూషితుడవు. ఊహింప నలవిగాని ఆశ్చర్యకర చరిత్రలు కలవాడవు. ఈ బ్రహ్మాండమంతటాలోపల బయట వ్యాపించి ఉన్నవాడవు. అణువు కంటే సూక్ష్ముడవు. మహత్తు కంటే గొప్పవాడవు. సర్వత్రా వ్యాపించినవాడవు. అందరియందు సమభావం కలవాడవు. అన్నిటికీ ఆధార భూతుడవు. అన్నిటికీ సాక్షివి. అందరిచేత కోరబడేవాడవు. సుందరాతి సుందరుడవు. సర్వోత్తముడవు. సర్వజ్ఞుడవు, అందరికీ ప్రభువువు. సకలం ప్రసాదించేవాడవు.

**సర్వాధారః సర్వసాక్షీ సర్వాపేక్ష్యో – తిసుందరః ।**
**సర్వోత్తమశ్చ సర్వజ్ఞః సర్వస్వామీ చ సర్వదః ॥**
**శ్రీ. వేం. మా. ఆదిత్య. పు. అ. 2. శ్లో. 76.**

సర్వశక్తిమంతుడవు. నీ చర్యలు తెలుసుకోవటం ఎవరికీ సాధ్యం కాదు. నీవు భక్తులకు, జ్ఞానులకు గోచరుడవు. భక్తులు కానివారికి, అజ్ఞానులకు అగోచరుడవు. సనాతనుడవు. కేవల పరబ్రహ్మ స్వరూపుడవు. సర్వవ్యాపివి. అనంతుడవు. నిస్సంగుడవు, దోషరహితుడవు. బ్రహ్మణ్యుడవు, శాశ్వతుడవు, శుభ ప్రదుడవు, మంగళ స్వరూపుడవు. చతుర్వర్ణ రహితుడవు, అతీతుడవు. నాలుగు విధాలైన ధర్మములను ప్రకాశింపజేసేవాడవు. చతుర్విధ పురుషార్థాలను యిచ్చువాడవు. సాలోక్య, సామీప్య, సారూప, సాయుజ్యాలనే నాలుగు విధాలైన మోక్షములను ప్రసాదించువాడవు. జ్ఞాన స్వరూపుడవు. అధోక్షజుడవు. అప్రాకృతుడవు. నీ మహిమలనంతములు. నీవు ఈ జగత్తుకు మూల కారణుడవు.

నీ అవతారములు అనంతములు. నీ నామాలు అనంతాలు. నీవు అసంఖ్యాకములైన జ్ఞానము, ఆనందములనే గుణములు కలవాడవు. అనంతములైన వేదములచే తెలియబడువాడవు. ఆ వేదాలకు కూడా అందనివాడవు. నీ భక్తులకు అనంతమైన సౌఖ్యాన్ని ప్రసాదించేవాడవు.

ఓ లక్ష్మీపతీ! నీ పాదపద్మముల యందు మనస్సును లగ్నము చేసినవానికి ఇహపరాలలో సుఖము అభివృద్ధి చెందుతుంది. ఆహా! ఏమి వారి భాగ్యము! వారి అదృష్టం ఏమని చెప్పాలి! నీ అనుగ్రహంలో అణుమాత్రంలో రవ్వంతైనా పొందేవారికి యింక లోకంలో పొందలేని దేముంటుంది? నీ చరిత్రలు అతి విచిత్రములైనవి. మహత్తరమైనవి, అనంతమైనవి. నీవు అనేక అవతారాలు ధరించి నీ భక్తులకు వాటిని దర్శింపజేస్తావు. నీ అనుగ్రహం రవ్వంతే పొందిన ఒక చిన్న పురుగు సామ్రాజ్యాన్ని అనుభవించింది. నీ పాదపద్మముల దివ్యస్పర్శవలన ఒక రాయి

దివ్యసుందరిగా మారింది. ఇక మానవుల సంగతి చెప్పేదేముంది? అందువల్లనే నీవు అర్జునుడికి రథ సారథివయ్యావు. బలికి ద్వారపాలకుడ వయ్యావు. ఇంద్రునియందు మిక్కిలి దయతో నీవు బలిని యాచించావు. క్షుద్రమైన మొసలి బారి నుండి గజేంద్రుని రక్షించడానికి నీవు దూతలను కాని, ద్వారపాలకులను గాని ఆజ్ఞాపించకుండా స్వయంగా నీవే పరిగెత్తుకొనివచ్చావు.

**వైకుంఠం వా పరిత్యక్ష్యే న భక్తాంస్త్యక్తుముత్సహే,**
**అతిప్రియా హి మే భక్తా ఇతి సంకల్పవానసి**
**శ్రీ. వేం. మా. ఆదిత్య. పు. అ. 2. శ్లో. 87, 88.**

'నేను వైకుంఠాన్నైనా వదులుతాను కాని నా భక్తులను విడువజాలను. నాకు నాభక్తులు అత్యంతం ప్రియతములు! అని ప్రతిజ్ఞ చేశావు. ఓ వేంకటేశా! నీవు ఆ శేషాద్రిలో ఉండి, భక్తులకు సర్వాభీష్టాలను ప్రసాదించుట వలన కామధేనువు, కల్పవృక్షము, చింతామణి, ఈ మూడూ నీవే అయ్యావు. ఈ చింతామణి, కామధేనువు, కల్పవృక్షములు కోరికలను తీర్చి అన్నాదులను యిస్తాయి. అంతేకాని, స్వర్గాన్ని గాని, మోక్షాన్ని గాని యివ్వలేవు.– వాటిశక్తి అంతమాత్రమే.

నీవు గనుక అనుగ్రహించావంటే సర్వాభీష్టాలను ప్రసాదిస్తావు. పుట్టు గుడ్డివాళ్ళకు నేత్రాలనిచ్చి నీ దివ్య మంగళమూర్తిని దర్శింపచేస్తావు. చెవిటి వాళ్ళకు శ్రవణ శక్తినిచ్చి నీ దివ్యకథలను వినేటట్టు చేస్తావు. జడుని, మూగవాడిని వాక్కును ప్రసాదించి వేదాధ్యయనపరులుగా చేస్తావు. మందబుద్ధిని మహాప్రాజ్ఞుడుగా చేస్తావు. వారిని సాంఖ్యయోగ నిష్ఠులుగా చేస్తావు. చేతులు లేనివారికి చేతులనిచ్చి వారిచే నిన్ను పూజింప చేస్తావు. కాళ్ళు లేని వారికి కాళ్ళనిచ్చి, వాళ్ళను నీదివ్య తీర్థ క్షేత్రానికి వచ్చేటట్లు చేస్తావు. ఇంతెందుకు? భక్తులకు ఏ ఆపద వచ్చినా వెంటనే వాటిని పోగొడతావు.

ఓ కరుణానిధీ! గూని, కుష్ఠు మొదలగు వ్యాధులను ఆభిచారిక క్రియలను పోగొట్టి శరీర దృఢత్వాన్ని సౌందర్యాన్ని కూడ ప్రసాదిస్తావు. ఓ శ్రీనివాసా! పెక్కుమాటలేల? భక్తులయొక్క సర్వ బాధలను పోగొట్టుటలోను, సర్వాభీష్టములను యిచ్చుటలోను నీతో సమానమైనవాడు ఈ బ్రహ్మాండంలో మరెక్కడా లేడు. ఓ శ్రీహరీ! నీవు ప్రసన్నమైన నీలమేఘం వంటి వాడవు. శ్రీదేవీ భూదేవీ అనే మెరుపులతో కూడి భక్తుల హృదయాకాశంలో వారి ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవికాలనే, మూడు విధాలైన తాపములను పోగొట్టే (చల్లార్చే) సర్వాభీష్టాలను వర్షిస్తున్నావు. నీ భక్తులను సప్తసముద్రములకు అతీతమై నీ కృప అనే ఎనిమిదవ సముద్రములో ముంచి పైకెత్తుతున్నావు. వారిని సర్వాభీష్ట ప్రాప్తి వలన కలిగిన మహానందమనే ఎనిమిదవ ద్వీపంలో (సప్త ద్వీపములకావల) ప్రేమతో ఉంచుతావు. నీ భక్తులకు సకల సౌఖ్యాలు, ఇహ పరాలలో ప్రసాదిస్తావు. స్వర్గాన్ని, ముక్తిని ప్రసాదించి వారికి ఆనందాన్ని అభివృద్ధి చేస్తావు.

## భగవంతుని అవతారములు

ఓ శ్రీనివాసా! దయానిధీ! అనంతములైన వేదములచే తెలియదగినవాడా! లక్ష్మీపతీ! బ్రహ్మాండ సృష్టికర్తా! లయకర్తా! జ్ఞానానంద ఐశ్వర్య పరిపూర్ణా! నీకు నమస్కారము. లోకంలో నక్షత్రాలను, ఇసుక రేణువులను, నిముషాలను అయినా లెక్కించవచ్చు కాని, బ్రహ్మ దేవునికి, లక్ష్మీదేవికి కూడా నీ పరాక్రమాన్ని, కల్యాణ గుణాలను లెక్కించడానికి వీలు కాదు. అయినప్పటికీ నేను నీ దాసానుదాసుడను. నీ భక్తులకు దాసుడను. కావున ఓ వేంకటాధీశా! నీ భక్తుడనైన నేను నీచే ప్రేరేపించబడి యధాశక్తి నిన్ను స్తుతిస్తాను.

ఓ వేంకటేశా! ప్రభూ! జ్ఞానానందస్వరూపా! దయానిధీ! భక్తవత్సలా! ఈ విశ్వమంతా కుటుంబముగా కలవాడా! ఇప్పుడు నన్ను రక్షించు.

**సత్యేశం సత్యసంకల్పం సత్యం సత్యవ్రతం హరిమ్ ।**
**సత్యచర్యం సత్యయోనిం సత్యశీర్షమహం భజే ॥**
**శ్రీ. వేం. మా. ఆదిత్య. పు. అ. 3 శ్లో. 5.**

ప్రభూ! నీవు ఈ జగత్తుకు నిజమైన స్వామివి, రక్షకుడవు. నీవు సత్య సంకల్పుడవు. సత్యస్వరూపుడవు. సత్యవ్రతుడవు. సత్యమైన కార్యములు కలవాడవు (యథార్థ చర్యలు కలవాడవు) సత్య కారణుడవు. సత్యాత్మకమైన సహస్ర శిరస్సులు గలవాడవు అయిన ఓ శ్రీహరీ! నిన్ను సేవిస్తున్నాను. నీ నామాన్ని, నీ కథలను వినుట వలన సర్వ పాపాలూ నశిస్తాయి. వాటిని మననం చేయుటవలన పుణ్యం వర్ధిల్లుతుంది. నిన్ను ధ్యానించుట వలన సకల సిద్ధులను ప్రసాదిస్తావు. నీ దర్శనం వలన మోక్షాన్ని అనుగ్రహిస్తావు. అటువంటి ఓ విష్ణుమూర్తీ! నిన్ను భజిస్తున్నాను.

**శ్రీ వేంకటేశం లక్ష్మీశం అనిష్టఘ్నమభీష్టదమ్ ।**
**చతుర్ముఖాత్మతనయం శ్రీనివాసం భజే–నిశమ్ ॥**
**శ్రీ. వేం. మా. ఆదిత్య. పు. అ.3 శ్లో. 7.**

లక్ష్మీపతి, వేంకటేశ్వరుడు, ఆపదలను పోగొట్టేవాడు, అభీష్టాలను ప్రసాదించేవాడు, చతుర్ముఖ బ్రహ్మ తనయుడుగా కలవాడు అయిన శ్రీనివాసుని ఎల్లప్పుడూ సేవిస్తాను. స్వామి! నీ క్రీగంటి చూపుయొక్క లేశము-- వల్లనే బ్రహ్మాది దేవతలు తమ తమ స్థానాలను పొందారు. అట్టి మహారాజాధిరాజైన శ్రీనివాసుని సదా భజిస్తున్నాను. అనంతమైన వేదములచే తెలియదగినవాడు, దోషరహితుడు, కల్యాణగుణ సముద్రుడు, ఇంద్రియాలకు గోచరము కానివాడు, నిత్యముక్తుడు అయిన శ్రీనివాసుని సదా భజిస్తున్నాను తనను స్మరించినంతనే సర్వ దోషములను పోగొట్టేవాడు, తన కథను వినినంతనే సర్వాభీష్టాలను వర్షించేవాడు దర్శనం మాత్రం చేతనే ముక్తిని ప్రసాదించేవాడు,

మహాపరాక్రమశాలి అయిన శ్రీనివాసుని సేవిస్తున్నాను

సర్వజీవ హృదయవాసి, శేషుడు పాన్పుగా కలవాడు, ఆదిశేషునిపై పవళించినవాడు, శేషాద్రినాథుడు, సర్వమూ తానేయైన వాడు అయిన శ్రీనివాసుని సేవిస్తున్నాను. భక్తులను అనుగ్రహించువాడు, సర్వవ్యాపకుడు, పరమ శాంత స్వరూపుడు, గరుడ ధ్వజుడు, ప్రసన్నమైన వదనము, నేత్రములు కలవాడు, అయిన శ్రీనివాసుని భజిస్తున్నాను.


భక్తుల భక్తి అనే మంచి పాశముతో బంధింపబడిన మంగళకరములైన పాదపద్మములు కలవాడు. సనకాది మహాయోగులకు ధ్యానము వలన తెలియదగినవాడు, గంగాది తీర్థముల పుట్టుకకుకారణమైన పాదపద్మములు కలవాడు, భక్తులను సంసార సాగరమునుండి బాగుగా తరింపజేయువాడు, శంఖ, చక్ర, అభయ వరముద్రలను హస్తములయందు ధరించినవాడు అయిన శ్రీనివాసుని సదా సేవిస్తున్నాను.

సువర్ణ ముఖరీ తీరంలో ఉన్నవాడు, శోభన వర్ణములు గల వేదములచే స్తుతింపబడేవాడు, భక్తులకు సువర్ణం మొదలగు ఐశ్వర్యాన్ని ప్రసాదించే వాడు, బంగారు భామ కలవాడు, స్వర్ణమయమైన ఆభరణాలు ధరించినవాడు, వక్షఃస్థలంలో శ్రీవత్సమనే పుట్టుమచ్చ కలవాడు, శ్రీపతి, రమాలోలుడు, లక్ష్మీదేవిని పరిణయమాడినవాడు, శ్రీమంతుడు సకలైశ్వర్య పరిపూర్ణుడు, శ్రీనిధి, లక్ష్మీదేవిచే స్తుతింపబడేవాడు అయిన శ్రీనివాసుని సదా సేవిస్తున్నాను.

**శ్రీవత్సవక్షసం శ్రీశం శ్రీలోలం శ్రీకరగ్రహమ్ ।**
**శ్రీమంతం శ్రీనిధిం శ్రీద్యం శ్రీనివాసం భజే-నిశమ్ ॥**
**శ్రీ. వేం. మా. ఆదిత్య. పు. అ.3 శ్లో. 16.**

వైకుంఠపురనివాసి, భక్తులను రక్షించుటకై వైకుంఠమును వదిలినవాడు, వైకుంఠుడనే (ఇంద్రుడు) సోదరుడు కలవాడు, వైకుంఠ పదవినిచ్చేవాడు, రైవతమన్వంతరంలో 'వికుంఠ' అను ఆమెకు జన్మించినవాడు మత్స్యావతారం ధరించి వేదాలనుద్ధరించినవాడు, తన సంకల్పానుసారం శుద్ధమైన స్వరూపాన్ని ధరించేవాడు, సత్యవ్రతులను ఉద్ధరించేవాడు, మిక్కిలి లోతైన జలావరణమునకు ఆధారభూతమైనవాడు, కూర్మావతారం ధరించి మందర పర్వతాన్ని పైకెత్తినవాడు, సుందరశరీరుడు, అయిన గోవిందుని సదా భజిస్తాను.

శ్రేష్ఠమైన శ్వేతవరాహరూపం ధరించి భూదేవినపహరించిన హిరణ్యాక్షుని సంహరించి, తన దంష్ట్రలతో భూదేవి నుద్ధరించినవాడు, భాగవతోత్తముడైన ప్రహ్లాదునికి ఆనందమొనగూర్చిన లక్ష్మీనృసింహరూపుడు, భక్తవత్సలుడు, మదించిన ఏనుగుల వంటి రాక్షసులను అణచినవాడు, వామనరూపుడు, పూర్ణకాముడు, పొట్టి బ్రహ్మచారిగా వచ్చి మాయతో బలి చక్రవర్తిని మోహింప చేసినవాడు,



చంద్రబింబమువంటి ఆహ్లాదకరమైన ముఖం కలవాడు, మల్లెపూలవంటి సుందర దంతపంక్తి కలవాడు, దుష్టులైన రాజులను సంహరించినవాడు, గండ్రగొడ్డలిని ధరించినవాడు, భృగు వంశంలో జన్మించిన సుకుమారుడు, పరశురాముడు అయిన శ్రీనివాసుని సదా భజిస్తున్నాను.

పది దిక్కుల వ్యాపించినవాడు, దశేంద్రియాలను నియమించినవాడు, దశముఖుడైన రావణుని సంహరించినవాడు, దశరథుని పుత్రుడు, గోవర్ధన పర్వతాన్ని ఎత్తిన బాలకుడు, వసుదేవుని కుమారుడు, యాదవులలో శ్రేష్ఠుడు, దేవకీదేవి పుత్రుడు, నందనందనుడు, ఆనంద స్వరూపుడు, ఇంద్ర నీలమణివలె నీలమేఘశ్యాముడు, యశోదాదేవికి యశస్సును సంప్రాప్తింప చేసేవాడు, అయిన శ్రీనివాసుని భజిస్తున్నాను.

గోసమూహాలను అడవులకు తోలుకొని పోయేవాడు, బృందావన క్షేత్రంలో నివసించేవాడు, గోకులానికి అధిపతి, వేదాదులచే, కీర్తింపబడినవాడు, జగత్తును మోహింపజేసేవాడు, దేవలోకంనుండి పారిజాత వృక్షాన్ని తెచ్చినవాడు, పాపములను పోగొట్టేవాడు, గోపస్త్రీల మనస్సు నపహరించినవాడు, వారి వస్త్రముల నపహరించినవాడు, గోవులను రక్షించుటకై గోపాలకునిగా మారినవాడు అయిన శ్రీనివాసుని సేవిస్తున్నాను.

కంసుని వధించినవాడు, బ్రహ్మాదులచే స్తుతింపబడువాడు, పరమ శాంత స్వరూపుడు, జనన మరణ సంసార బంధాన్ని పోగొట్టేవాడు, సంశయములను పోగొట్టేవాడు, తత్త్వజ్ఞానము చేత తెలియబడేవాడు, భీమార్జునులకు గురువు ద్రౌపదీమాన సంరక్షకుడు, భక్తాభీష్ట ప్రదుడు, వ్యాసస్వరూపుడు, అర్జునునికి మిత్రుడు, నల్లని కాళీయుడనే సర్పాన్ని మర్దించినవాడు, శ్రీకృష్ణుడు, యమునానదీతీరంలోని ఉపవనాలలో ప్రీతితో విహరించేవాడు, ద్రౌపదికి తండ్రివంటి వాడు, అత్యుత్తముడు అయిన శ్రీనివాసుని సేవిస్తున్నాను.

సజ్జనులకు తత్త్వజ్ఞానాన్ని బోధించే బుద్ధావతారుడు,

దుర్జనులకు తెలియరానివాడు, జ్ఞాన స్వరూపుడు, బుధ ప్రియుడు, దేవతలకు నాయకుడు, జ్ఞానులకు గోచరుడు, గుర్రమునెక్కినవాడు, కల్కిరూపుడు, కలిదోషాన్ని పోగొట్టేవాడు, శుభాలనిచ్చేవాడు, కలిని నాశనం చేసినవాడు, శ్రీహరి, 'హంస' అనే పేరు గలవాడు, కృష్ణుడు, అనంతుడు, నరసింహుడు, మధువైరి, హృషీకేశుడు, యజ్ఞ స్వరూపుడు, కపిలుడు, ఋషభుడు హయగ్రీవుడు, నరుడు, వ్యాసుడు, నారాయణుడు, పాపరహితుడు, ఆత్మస్వరూపుడు, అమృతస్వరూపుడు, దత్తాత్రేయుడు, ధన్వంతరి మొదలగు రూపాలను ధరించిన శ్రీనివాసుని సేవిస్తున్నాను.

అనేక రూపములను ధరించినవాడు, అనేక కార్యములు చేసినవాడు, అనంతములైన వేదములచే వర్ణింపబడినవాడు, అనంతములైన పేర్లు కలవాడు, అనంతమైన స్వరూపం కలవాడు, అంతము లేనివాడు, మంగళకరములైన జ్ఞానానందాది అనంతగుణములచే పరిపూర్ణుడైన శ్రీనివాసుని సేవిస్తున్నాను.

అనంత శక్తిమంతుడు, అనంత విక్రముడు, అనంత జీవుల శరీరములందు శయనించువాడు, సర్వేశ్వరుడు, అనంతైశ్వర్యము కలవాడు, అనంతములైన నేత్రములు, హస్తములు, పాదములు కలవాడు, అనంత సౌఖ్యాన్ని ప్రసాదించేవాడు, అయిన శ్రీనివాసుని సేవిస్తున్నాను.

రాక్షసులనే పర్వత సమూహములను ఛేదించుటకై చక్రాయుధమును ధరించినవాడు, పాపములనే పర్వతపంక్తులను నశింపజేయటానికి వజ్రాయుధమును ధరించినవాడు, దయా సముద్రుడు, మేరుపర్వతాన్ని మించిన ఐశ్వర్య సంపన్నమైన పద్మాన్ని ధరించినవాడు, అయిన శ్రీనివాసుని భజిస్తున్నాను.

ఓ వేంకటాచలపతీ! నీవు లోకంలో భక్తులకు అనేక పురుషార్థములను యిచ్చుటలో మహానేర్పరివి. లేనిచో అందరికీ కనపడేటట్టు భక్త జనులందరికీ దర్శనమిస్తూ మహోన్నతమైన శేషగిరిపై ఎందుకు నివసిస్తావు? జ్ఞానానందాది గుణములచే నిరవధికుడవు. మెరయుచున్న రత్నహారము కలవాడవు. నీ నామస్మరణ చేసినంతనే భక్తుల దోషములను పోగొట్టేవాడవు, నీ భక్తులకు సకలాభీష్టములను ప్రసాదించేవాడవు, శేషగిరిపై నివసించేవాడవు, ఎల్లప్పుడు చిరునవ్వులు చిందించేవాడవు, లక్ష్మీదేవితో చిద్విలాసంగా సరససల్లాపాలు చేసేవాడవు అయిన వేంకటేశ్వరుని సేవిస్తున్నాను.

ఓ వేంకటేశా! గంగాది సర్వ తీర్థాలకు నిలయమైన నీ పాదములను నేను శరణు వేడుతున్నాను. లక్ష్మీదేవి, బ్రహ్మ, శివుడు, గరుడుడు, వాయుదేవుడు, శేషుడు, ఇంద్రుడు, సూర్యుడు, చంద్రుడు, అగ్ని మొదలైన వారంతా సేవించే నీ దివ్యపాదపద్మములకు నమస్కరిస్తున్నాను. ఓ శ్రీనివాసా! లోకపావనా! మంచి కుంకుమ వర్ణం కలిగినవి, లక్ష్మీ ప్రదములు, దేవతలకు, ఋషులకు, మానవులకు శ్రీ సంపత్కరములు. ఋగ్వేదము, నిగమాలు, ఆగమాలు మొదలైన వాటిచే తెలియబడే నీ చరణములకు నమస్కరిస్తున్నాను.

తనను భజించేవారికి సుఖాన్నిచ్చేవాడు, తన భక్తులను దయాదృష్టితో వీక్షించేవాడు, మహోత్కృష్టుడు, ఉత్తమోత్తముడు, శంఖ చక్ర గదాపద్మములను ధరించినవాడు, చతుర్భుజుడు, అధోక్షజుడు, ఇంద్రియములకు గోచరము కానివాడు, బ్రహ్మరుద్రాది దేవతలచే పూజింపబడేవాడు, వరములతో మదించిన అనేకమంది దుష్టులను అతిశీఘ్రంగా సంహరించినవాడు, అయిన శ్రీనివాసుని సదా భజిస్తున్నాను.

**అజ్ఞానసాగర సముత్తరణే ప్రశస్తం**
**సుజ్ఞాన సేతురచనే నిపుణం బుధేడ్యమ్ ।**
**లక్ష్మీపతిం సురవరార్చిత వేంకటేశం**
**దారిద్ర్యదుఃఖ దురితౌఘ నిశాచరఘ్నమ్ ॥**
**శ్రీ. వేం. మా. ఆదిత్య. పు. అ.3. శ్లో. 43.**

భక్తులను అజ్ఞాన సాగరం నుండి తరింప చేయుటలో నేర్పరి. సుజ్ఞానమనే సేతువును నిర్మించుటలో నిపుణుడు, జ్ఞానులు, పండితులచే స్తుతించబడేవాడు, లక్ష్మీపతి, బ్రహ్మాది దేవతలచే పూజింపబడేవాడు, దారిద్ర్యదుఃఖమును, పూర్వజన్మార్జిత పాపసమూహములను పోగొట్టేవాడు, రాక్షసులను సంహరించేవాడు అయిన వేంకటేశ్వరుని సేవిస్తున్నాను.

లక్ష్మీపతి, పద్మదళముల వంటి నేత్రములు కలవాడు, హారములు, భుజ కీర్తులు మొదలగు ఆభరణములు ధరించినవాడు, బ్రహ్మాండమంతా వ్యాపించినవాడు, అనేక కల్యాణగుణ పరిపూర్ణుడు, దుఃఖాది దోషరహితుడు, దయాసముద్రుడు, తననాశ్రయించినవారి ఆధిదైవిక, ఆధి భౌతిక, ఆధ్యాత్మిక తాపత్రయములను పోగొట్టువాడు, పుట్టుక లేనివాడు, ప్రకృతికి అతీతుడు, లోకవిలక్షణుడు, లోకాతీతుడు, పరాత్పరుడు, పురుషోత్తముడు, అసదృశుడు, నాకిష్టదైవము అయిన శ్రీనివాసుని ధ్యానిస్తున్నాను.

**లక్ష్మీనాథం కమలనయనం హారకేయూరభూషం**
**సర్వవ్యాప్తం బహుగుణభరం దోషదూరం దయాబ్ధిమ్ ।**
**స్వానాం తాపత్రయహరమజం నిర్విశేషం విశేషం**
**లోకాతీతం పురుషమతులం భావయామీష్ట దేవమ్ ॥**
**శ్రీ. వేం. మా. ఆదిత్య. పు. అ.3 శ్లో. 44.**

ఓ వేంకటేశా! నీ పాదకమలం నుండి ఉద్భవించిన గంగానది జగత్తునంతా పావనం చేస్తుంది. నీ కరుణా కటాక్ష వీక్షణములు బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు, సూర్యుడు మొదలగు దేవతలకు సర్వాభీష్టాలను ప్రసాదిస్తాయి. నీ నామస్మరణం మహాపాతకరాశిని దహించివేసి స్వర్గాన్ని, మోక్షాన్ని కూడ ప్రసాదిస్తుంది. నీ దివ్యపాద పద్మ యుగళములను భక్తితో సేవించేవారిని బ్రహ్మాదులు కూడ పూజిస్తున్నారు. అటువంటి

నిన్ను సేవిస్తున్నాను.

**సృ(దృ)ష్ట్యాద్యత్యంతదూరం నిగమనిచయసంవేద్య**
**(వేద్యాత్మ) మాహాత్మ్యపూర్ణం**
**సర్వేషా మాదిమిత్రం రవిశశినయనం పూర్ణకారుణ్యదేహమ్।**
**నిర్వాణం నిష్ప్రపంచం నిరవధికసమామ్నాయసంస్తైరసంగైః**
**కీర్వాణాద్యైరజస్రం స్తుతినతినియమైకాంత భక్తైశ్చ పూజ్యమ్ ॥**
**శ్రీ. వేం. మా. ఆదిత్య. పు. అ. 3 శ్లో. 46.**

సృష్టి స్థితి లయములకు అత్యంత దూరుడు, ఇంద్రియములకు అగోచరుడు, వేదాదులచే తెలియదగిన మహిమచే పరిపూర్ణుడు, సర్వ ప్రాణులకు అనాది మిత్రుడు, సూర్య చంద్రులు నేత్రములుగా కలవాడు, పరిపూర్ణకృప మూర్తీభవించినవాడు, జనన మరణ రూపసంసార బంధము లేనివాడు, దోషసంసర్గములేని అనంతములైన వేదములచేతను, దేవతలచేతను నిరంతరం స్తుతింపబడేవాడు, ఏకాంత భక్తులచే శ్రవణ మననాదులనే సాధనంతో, నియమంతో ఆరాధించబడే శ్రీహరిని సేవిస్తున్నాను.

నీ భక్తుడైన శంకరుని యందు మిక్కిలి ప్రీతిగల ఓ వేంకటేశా! నీకు నీ భక్తులపై చాలా దయ కలదు. సకల లోకాల్లోను నీ చరిత్రను ఆదిశేషుడు, శుకమహర్షి, పైలుడు, నారదుడు మొదలగు వారిచే భక్తులకు తెలియజేస్తున్నావు. శ్రీ వేంకటేశ్వరుని భక్తితో అనుసరించి సేవించేవారి కీర్తి దశ దిక్కులలోను వ్యాపిస్తుంది. వారికి అధిక సౌభాగ్యముకలిగి ఇహలోకంలో భోగాలను, తరువాత స్వర్గసుఖాలను పొంది, తమ తమ యోగ్యతలనుబట్టి మోక్షాన్ని, భగవంతుని సాయుజ్యాన్ని పొందుతారు. మదాంధుడై నిన్ను అపహాస్యం చేసేవాడు, దుఃఖాన్ని పొందుతాడు. చనిపోయిన తరువాత రౌరవము, కుంభీపాకము, మహారౌరవమనే నరకాలలో పడతాడు.

కావున ఆపదలను పోగొట్టువాడవు, శుభాలనిచ్చేవాడవు, భక్త పరాధీనుడవు, సర్వలోకపూజ్యుడవు, లక్ష్మీ పతివి అయిన నిన్ను ప్రతిజన్మలోను సేవిస్తాను ఓ శ్రీనివాసా! నీవు భక్తులననుగ్రహించుటకై ఉత్తమోత్తమమైన వైకుంఠమును వదలి భూలోకంలో అవతరించావు. నీవు సర్వ శ్రేష్ఠుడవు. భక్తులచే పూజింపబడుతూ వారికి వరాలనిస్తున్నావు.

ఓ సత్యసంధా! లోకంలో ఇతరుల వస్తువెంతచిన్నదైనా దానిని అపహరించరాదు కదా! కాని నీవు మానవులు అనేక జన్మలలో చాల కష్టపడి సంపాదించిన పాపరాశినంతటిని కేవలం నిన్ను స్మరించినంతమాత్రముననే కొంచెం కూడ మిగలకుండ అపహరిస్తున్నావు. నీవు అవాఙ్మానసగోచరుడవు. నిన్ను విలక్షణునిగను, స్థావర జంగమాత్మకమైన ప్రపంచ నియామకునిగను, విశ్వరూపునిగను, అనేక మాయోపాయ విశారదునిగను దర్శిస్తున్నాను.

నీ రూపాలు, నీ చరిత్రలు అనంతాలు. వాటిని భక్తితో స్మరించే వారికి మహావైభవాన్ని ప్రసాదిస్తాయి. గొప్ప వారికి కూడ ఇహ పరాల్లో అపరిమిత సుఖాలను, ఆత్మోద్ధారకములైన పురుషార్థములను ఇస్తాయి. ఇక అల్పుల విషయమేమని చెప్పాలి? వాళ్ళనుద్ధరిస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

పుండరీకాక్షుడు, జగత్ప్రభువు, భక్తులననుగ్రహించువాడు, లోకోత్తరుడు, లోకనాథుడు, పరాత్పరుడు, సర్వవ్యాపి అయిన శ్రీనివాసుని శరణు వేడుచున్నాను. నా పూర్వపుణ్యవిశేషంచేత, నీ దయ వలన నాకు నీదివ్య దర్శన భాగ్యం లభించింది. అందువలన నా భయం తొలగింది. భగవంతుడవు, సర్వ జగద్వంద్యుడవు, భూత భవిష్యద్వర్తమాన కాలములకు ప్రభువువు అయిన నిన్ను శరణు వేడుచున్నాను. నీ నుండే సర్వజీవరాశులు ఉద్భవిస్తున్నాయి. ఈ విశ్వమంతా నీతోనే నిండి ఉంది. ప్రాణులన్నీ నీ వలనే జీవిస్తున్నాయి. ప్రళయకాలంలో నీలోనే లయమవుతున్నాయి. నిన్నే పొందుతున్నాయి. నీవు దీపము, మెరుపు, నక్షత్రములు, చంద్ర సూర్యాదుల కంటె కూడ మిక్కిలి ప్రకాశం కలవాడవు. భక్త్యాది యోగములచే యోగులచే తెలియబడేవాడవు. దృష్టిగోచరుడవు, అభక్తులకు అగోచరుడవు. వినబడేవాడవు. వినబడనివాడవు అయిన నిన్ను సేవిస్తున్నాను.

## భగవంతుని విశ్వరూపవర్ణన

ఓ వేంకటేశా! నా స్వామీ! నీకు నమస్కరించిన వారి దుఃఖములను పోగొట్టేవాడా! జ్ఞానము, ఆనందము, దయచే పరిపూర్ణుడా! నా ఈ విన్నపాన్ని దయతో ఆలకించు. నీ ముఖము నుండి బ్రాహ్మణులు, నీ బాహువుల నుండి క్షత్రియులు, నీ తొడలనుండి వైశ్యులు, నీ పాదములనుండి సేవకులైన శూద్రులు ఉద్భవించారు. నీ శిరస్సునుండి ఆకాశము (స్వర్గలోకము) పుట్టింది. నీ నేత్రముల నుండి సహస్ర కిరణుడైన సూర్యుడు, ముఖమునుండి ఇంద్రుడు, అగ్ని, నీ శ్రోత్రములనుండి దిగ్దేవతలు ఆవిర్భవించారు. నీ మనస్సునుండి చంద్రుడు, ప్రాణమునుండి వాయువు, నాభినుండి అంతరిక్షము, పాదములనుండి భూమి పుట్టినవి. కోమలములైన నీ అవయవముల నుండి పదునాలుగు లోకములు ఉద్భవించినవి. నీ సుకుమారమైన నాభికమలములో బ్రహ్మకు కూడా ఆశ్రయమైన బ్రహ్మాండం ఆవిర్భవించింది.

ఓ లక్ష్మీనాథా! జనులంతా నీ మాయచే మోహితులై నిన్ను తెలిసికొన లేకపోతున్నారు. నీ మాయను దాటటానికి ఎవరికీ సాధ్యం కాదు. నీవు మహామాయావివి. నిన్ను, నీ మాయను నీవు మాత్రమే జయించగలవు. నిన్ను శరణు వేడుతున్నాను. ప్రభూ! నా అజ్ఞానమనే మాయను తొలగించు.

నీవు కేవలం తర్కముతో తెలియబడేవాడవు కావు. కాని భక్తులకు, జ్ఞానులకు ఊహించుటకు వీలైనవాడవు. సకల సద్గుణ పరిపూర్ణుడవు, గుణరహితుడవు. (దోషగుణములు లేనివాడవు.)

త్రిగుణాతీతుడవు.అంతములేనివాడవు,(అనంతుడవు).సర్వమును అంతము చేయువాడవు. భక్తులకు, జ్ఞానులకు తెలియబడువాడవు. వేథాస్త్రాదుల చేత కూడ తెలిసి కొనుటకు వీలుకాని స్వరూపం కలవాడవు. అటువంటి నీకు నమస్కరిస్తున్నాను.

ఓ దేవాధిదేవా! నీవు నీ భక్తులకు సర్వసిద్ధులను ప్రసాదిస్తావు. నేను నీచే ప్రేరేపించబడి నీ అనుగ్రహమును పొందుటకై నీ పాదములను శరణువేడుచున్నాను. నేను నీ పాదకమలములయందు భక్తికలవాడను, నీవు జీవుల లోపల, వెలుపల వ్యాపించి ఉండి, సర్వాంతర్యామివై, సర్వసాక్షిగా ఉన్నావు. అటువంటి నీకు నేను ప్రత్యేకంగా విన్నవించుకోవలసినదేమున్నది?

నీ పదపద్మములనాశ్రయించిన అంబరీషాది రాజులు ఇంద్రాది దేవతా శ్రేష్ఠులు, బ్రహ్మాది దేవతలు సుఖంగా తమతమ స్థానాలలో ఉండి నిన్ను సేవిస్తున్నారు. ఓ సుఖప్రదాతా! దేవతలకు, మునులకు మిత్రుడా! నాకు కూడ తాపశాంతిని కలిగించి నాకు సుఖమునిమ్ము.

ఓ వేంకటేశా! ఈ సంసారారణ్యము మహాభయంకరమైనది రక్షకులు లేనిది, మహత్తరమైన దుర్గాలు కలది. యమునివంటి భయంకరమైన సర్పాలతో కూడినది. శబ్దాది విషయాలనే ఎండమావులు కలది. దుఃఖాలనే దావాగ్నితోను ద్వంద్వాలనే దుష్టమృగాలతోను కూడినది. (జయాపజయములు, మానావమానములు) ఆశాపాశములచే బద్ధుడనై ఈ సంసారమనే మహారణ్యంలో చిక్కుకొని, దీనినుండి బయటపడే మార్గము తెలియని అజ్ఞానినైన నేను సర్వలోక శరణ్యుడవైన నీ దివ్య పాదపద్మములను ఎప్పుడు శరణు పొందుదునో కదా!

**భవాబ్ధితారం కటివర్తి హస్తం స్వర్ణాంబరం**
**రత్నకిరీటకుండలమ్ ।**
**ప్రలంబిసూత్రోత్తమ మాల్య భూషితం**
**నమామ్యహం వేంకటశైలనాయకమ్ ॥**
**-ఆదిత్యపురాణం.అధ్యా.4. శ్లో.**

(సశేషం)

# విజయ దశమికి కుమారీ పూజ

– కౌతా నిర్మల

విజయదశమి పండుగ స్త్రీ శక్తికి ప్రతీక. దుర్గాదేవి అయిన జగన్మాత తొమ్మిది రోజులు మహిషుడు అనే రాక్షసునితో యుద్ధం చేసి, పదవ రోజున ఆ రాక్షసుని సంహరించి విజయాన్ని పొందినందుకు గాను, ఆ రోజును విజయదశమిగా పిలుచుకుంటున్నారు. విజయ దశమి సందర్భంగా తొమ్మిది రోజుల పాటు రెండు సంవత్సరాల నుంచి పది సంవత్సరాల లోపు బాలికలను చక్కగా అలంకరించి పూజిస్తారు. ఒక్కొక్క రోజున పూజించే బాలికను ఒక్కొక్క పేరుతో పిలుస్తారు. ఆ బాలికకు అభ్యంగన స్నానం చేయిస్తారు. కొత్త బట్టలను ధరింపచేసి ఆసనం మీద కూర్చోబెడతారు. పాదాలకు పసుపు రాసి, అందంగా పారాణిని తీర్చి దిద్దుతారు. వివిధ ఆభరణాలతో ఆ బాలికను అలంకరింపచేస్తారు. జడనిండా పూలు పెడతారు. ఆమెను (ఆ బాలికను) అమ్మవారుగా భావించి, ఆమెకు పూజ చేస్తారు. విందు భోజనం పెట్టి ఆ బాలికకు దక్షిణ తాంబూలాది నూతన వస్త్రాలనుచ కానుకలను సమర్పిస్తారు. దానినే కుమారీపూజ అంటారు. పాడ్యమి నుంచి నవమి వరకు బాలికలను పూజిస్తారు.

మొదటి రోజున రెండు సంవత్సరాలున్న బాలికను 'కుమారి' అన్న పేరుతో పూజిస్తారు. కుమారిని పూజించడం వల్ల దారిద్ర్యం, దుఃఖం తొలగిపోతాయి. రెండవ రోజు మూడు సంవత్సరాల బాలికను 'త్రిమూర్తి'గా పూజిస్తారు. త్రిమూర్తిని పూజిస్తే ధనధాన్యాలు పెంపొందుతాయి. పుత్ర పౌత్రాభివృద్ధి కలుగుతుంది. మూడవరోజు 'కళ్యాణి' పేరుతో నాలుగు సంవత్సరాల వయసున్న బాలికను అమ్మవారిగా పూజిస్తారు. కళ్యాణిని పూజిస్తే విద్యాభివృద్ధి కలిగి, ఉన్నత పదవులు పొందుతారు. రాజకీయాలలో చక్కగా రాణిస్తారు. నాలుగవ రోజున ఐదు సంవత్సరాల వయసున్న బాలికను 'రోహిణి' గా పూజిస్తారు. ఆ పూజ వల్ల మంచి ఆరోగ్యాన్ని పొందుతారు. ఐదవ రోజున ఆరు సంవత్సరాల బాలికను 'కాళిక' స్వరూపంగా భావించి పూజ చేస్తారు. కాళికను పూజిస్తే శత్రు నాశనం కలుగుతుంది. పిరికితనం, అధైర్యం తొలగిపోయి మనోధైర్యం కలుగుతుంది. ఆరవ రోజున 7 సంవత్సరాల బాలికను 'చండిక' పేరుతో పూజిస్తారు. చండికా మాతను పూజిస్తే లేమి తొలగిపోయి సిరిసంపదలు, ధనధాన్యాలు లభిస్తాయి. ఏడవ రోజున 'శాంభవి' అన్న పేరుతో, ఎనిమిది సంవత్సరాల బాలికను పూజిస్తారు. ఈ దేవిని పూజిస్తే చేపట్టిన పనికి అంతరాయం కలుగకుండా ఆ పనులను పూర్తి చేస్తారు. ఎనిమిదవ రోజు తొమ్మిది సంవత్సరాల బాలికను 'దుర్గ' నామంతో పూజిస్తారు. దుర్గాదేవిని పూజిస్తే సుఖసంతోషాలతో జీవిస్తారు. ఎనిమిదవ రోజు పూజను ముగించిన తరువాత తొమ్మిదవ రోజున పది సంవత్సరాలున్న బాలికను 'సుభద్ర' గా భావిస్తూ పూజిస్తే సకల కోరికలు నెరవేరుతాయి.

పురాణాల ద్వారా అగస్త్య మహర్షి భార్య లోపాముద్ర ఈ కుమారీ పూజను చేసినట్లుగా తెలుస్తోంది. విజయదశమి పండుగ జరుపుకునే రోజుల్లో కుమారీ పూజను చేయడం వల్ల వారి కోరికలు నెరవేరడమే కాకుండా వారు తలపెట్టిన పనులు పూర్తవుతాయి. ధనధాన్యాలతో, సిరిసంపదలతో సుఖప్రదమయిన జీవితాన్ని గడుపుతారు.

# శ్రీ కృష్ణ తత్వం



**ధారావాహికం**

- రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

ఆ తరువాత కామధేనువు తన సంతానంతో వచ్చింది. కృష్ణ భగవానుని సమీపించింది. అంటోంది–

**కృష్ణ!కృష్ణ! మహాయోగిన్ విశ్వాత్మన్ విశ్వసంభవ।**
**భవతా లోకనాథేన సనాథా వయమచ్యుత ॥**

కృష్ణా!కృష్ణా! మహాయోగీశ్వరుడవు నీవు. సకల చరాచర జీవకోటికి అంతరాత్మవు. ఈ విశ్వం ఉత్పత్తి స్థితి లయకారుడవు నీవు. సకల లోకాలకు నాథుడవు నీవే. మేమందరమునూ సనాథులం అయ్యాం.ఓ అచ్యుతా! నీవే మాకందరికీ శరణ్యుడవు అని అంటూ తన క్షీరాలతో కృష్ణదేవుని అభిషేకించింది. ఐరావతం ఆకాశం నుంచి తీసుకువచ్చిన గంగాజలాలతో కృష్ణ భగవానుని గోవింద గోవింద యని కీర్తిస్తూ అభిషేకించాడు ఇంద్రుడు.

ఇక త్వరలో రాబోతున్న శరత్ రాత్రులలో మీరందరూ నాతోపాటు విహరించగలరని– వస్త్రాపహరణ సమయంలో వ్రజగోపభామలకు కృష్ణుడు మాట ఇచ్చాడు. ఆ శరత్ ఋతువు వచ్చేసింది. తన యోగమాయని ఆశ్రయించి గోపికల కోసం రాసక్రీడను సలపాలని సంకల్పించాడు కృష్ణుడు.

వెన్నెల రేయి – యమునా తీరం–ఇసుక తిన్నెలు – ఒకచోట కూర్చున్నాడు కృష్ణుడు.వేణుగానం ఆలపించాడు. ఆ వేణుగానం బృందావన గోపికలకు వినపడింది. ఆకర్షితులై–కృష్ణభగవానుని సన్నిధికి పరుగులు తీసారు.

కళ్లు నోరు చెవులు చేతులు కాళ్లు ఏంచేస్తున్నప్పటికీ గోపికల మనసులు భగవదర్పితమైనాయి. యమునాతీరం వెన్నెలరేయి– నల్లనయ్య వేణుగానం గోపికల చెవులకి సోకింది. దూడలను ఆవుల దగ్గరికి వదల్లేదు. ఇక ఆవుల పాలను పితకలేదు. కాచిన పాల కుండల్ని దించలేదు. దించిన పాలను పిల్లలకు పట్టలేదు. తమ తమ భర్తలకు అన్నాల వడ్డనల వూసేలేదు.ఇంక పెద్దలను సేవించలేదు. ఇక తమ తమ అన్నాల్ని మరచిపోయారు. తలలను దువ్వుకోలేదు. కొప్పులలో పూలను ముడవలేదు. అన్నదమ్ములైతేనేమి– అత్తమామలైతేనేమి– అడ్డొస్తున్నట్టి వాళ్లందరినీ తోసేస్తూ–ఆగిపోకుండానే నడుస్తూవుంటే– జారి పోతున్నట్టి పైటల్ని సవరించుకోలేదు. కృష్ణా అని నిరంతరమూ గోవిందదివ్యపాదార్పిత చిత్తవృత్తులై పరుగులమీద పరుగులతో యమునాతీరానికి చేరుకున్నారు గోపికలంతా. పడవ ఎటు పోతున్నప్పటికీ చుక్కాని మాత్రం వుత్తరం వైపునకే చూపుతుంది.

కృష్ణదేవుని దగ్గరికి వెళ్లలేక ఇంట్లో వుండిపోయిన గోపికలు– తమ తమ మనసుల్లో కృష్ణుని ధ్యానించసాగారు. తీవ్రమైన విరహ తాపంతోవాళ్లందరికోరికలుసంస్కారవాసనలుసమసిపోయాయి. ఆ అచ్యుతుని ఆలింగనంలోని ఆనందానుభవంలో–వారి పుణ్య పాప కర్మరాశి సమస్తమూ నశించింది. ఇక సర్వ కర్మల నుంచి బంధవిముక్తులైనారు. వాళ్లందరూ కృష్ణభగవానునిలో ఐక్యమైపోయినారు. గోపికల రాసక్రీడను పెద్దలు ఎందరో అశ్లీలమంటూ– విమర్శించారు. అయితే పవిత్రులైనవారికి మాత్రమే If you are pure and perfect–రాసలీలలు అర్థం కాగలవు అన్నారు వివేకానందస్వామి.

పరీక్షిత్తు మహారాజు కూడా శుకమహర్షిని అడిగాడు ఇలా– మహర్షీ! వ్రజగోపికలు కృష్ణుని కేవలం తమ ప్రియుడనుకుని భావించారు. పరబ్రహ్మ యని తలచలేకపోయారు. భౌతిక విషయాసక్తులైనవారు– సత్వరజస్తమో గుణాలతో కూడుకున్న దేహాన్ని విడిచిపెట్టినవారు– ఏవిధంగా విముక్తులైనారో చెప్పవా! దానికి చెబుతున్నాడు శుకబ్రహ్మ–

**కామం క్రోధం భయం స్నేహమైక్యం సహృదయేవచ।**
**నిత్యం హరో విదధతో యాంతి తన్మయతాం ॥**

కామంతో గోపభామలునూ క్రోధంతో శిశుపాలాదులును భయంతో కంసుడునూ– స్నేహంతో అర్జునుడునూ–సౌహార్ద్రంతో ఉద్ధవుడునూ అనునిత్యం భగవానునితో సంబంధాన్ని కలిగివుంటే– వాళ్లందరునూ ఆ స్వామిలో ఐక్యమైపోతారు. (ముక్తిని పొందుతారు)

కృష్ణ భగవానుని కోసం పరుగులు తీసిన గోపపల్లెలోని ఒకతెను– అత్తమామలు–భర్త అడ్డగించారు. ఆవిడను ఒక గదిలో ఒక స్తంభానికి కట్టిపడేసారు. అలా ఆవిధంగా బంధింపబడిన

గోపిక– కృష్ణభగవానుని స్మరిస్తూ– తను కూడా యమునా తీరానికి వెళ్లినట్లు–ఆ కృష్ణదేవునితో– ఆడుతూ పాడుతూ–ఆ భావనలో తన్మయురాలైంది. తన మనసులోనే స్వామి చింతన చేస్తూ– రాత్రంతయూ– భగవదనుభవ ప్రవాహంలో తృప్తిగా మునకలువేస్తూ– భగవానునినిలో ఐక్యమైపోయిందామె. భగవత్ చింతనలో ముక్తి పొందిందని ఆ వ్రజగోపికకు చింతయంతి యని పేరు పెట్టారు మన పెద్దలు.

ఆరోజు రాత్రి అజగ్ముః అన్యోన్య అలక్షిత ఉద్యమాః– బృందావన గోపికలు ఎవరికి వారు ఒకరికి ఒకరు తెలియకుండా యమునాతీరానికి వచ్చేసారు. కృష్ణుడు చూసాడు.అంటున్నాడు–

స్వాగతం మహాభాగాః! భాగ్యశాలినులైన గోపికలారా! రండి.రారండని స్వాగతం పలికాడు. క్రూరమృగాలు సంచరించే సమయంలో– కోమలాంగులైన మీరు ఇలా రాకూడదు.మీరు కనిపించలేదని మీవాళ్లు కంగారు పడొచ్చు. పిల్లలను లాలించి– నిదురపుచ్చాలి. పెద్దలకు భర్తలకు సేవలు చేయాలి. నా కథలు వింటూ నా లీలలు తెలుసుకుంటూ నన్ను ధ్యానిస్తూ స్మరిస్తూ కీర్తిస్తూ వుండండి. అపుడే నామీద అనన్యమైన భక్తిప్రపత్తులు కలుగుతాయి. ఇక మీ మీ ఇండ్లకు వెళ్లండి.

కృష్ణ భగవానుడు నిర్దయతో పలికిన మాటలని విన్న గోపికల ముఖాలు వాడిపోయినాయి. ఎంతో పెంచుకున్న ప్రేమను తుంచేసాడు.ఇక నోటమాట రాలేదు. తమ మనసు పొరల్లోనుంచి దుఃఖం పొంగిపొర్లింది. వారి కళ్లల్లో నీళ్లు సుళ్లు తిరుగుతున్నాయి. వారి కన్నులు ఎర్రబారినాయి. ఎలాగైతేనేం తమాయించుకున్నారు. అంటున్నారు ఈ విధంగా–

అయ్యో! మేం నిన్ను నమ్మి వచ్చాం. నీవు క్రూరుడవు అని అనడం తగదు. మరి మా మా ఇండ్లల్లో అన్నింటినీ అందరినీ తోసేసి–నీ పాదపద్మాలను పూజించాలని వచ్చాం. కృష్ణా! నీవు మాకు ప్రభుడవు.ఆదిపురుషుడవు. ముముక్షువుల్ని ఏవిధంగా రక్షిస్తావో–అదే విధంగానే మమ్మల్ని కాపాడు. అయితే మమ్మల్ని ఎందుకు తిరస్కరిస్తున్నావో–నీకు అది భావ్యం కాదు.

**త్వమేవ మాతా చ పితా త్వమేవ త్వమేవ బంధుశ్చ గురుత్వమేవ ।**
**త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ త్వమేవ సర్వం మమ దేవదేవ ॥**

దీనాతిదీనంగా అంటున్నారు గోపికలు ఇలా– కృష్ణా! నీ చెంత నీ సేవలో మాకు అమితానందం లభిస్తుంది. సంసారంలో ఏముంది? అది అంతా దుఃఖపూరితమే కదా. కృష్ణా!మా ప్రేమను పెంచు. తుంచకు.కరుణించు. మా తాపాన్ని చల్లార్చు. నీ దివ్యపాద పద్మాలను సేవించాలని వచ్చాం. మమ్మల్ని తిరిగిపొమ్మంటే మా కాళ్లు కదలవు.

కృష్ణా! మురిపించే నీ చిరునవ్వు–ప్రేమని కురిపించే నీ చూపులు– అమృతాన్ని అందించే నీ పెదవులు– శరణార్థులకు ఆశ్రయాన్ని చేకూర్చే నీ విశాలమైన హృదయం– అమితంగా ఆకర్షిస్తున్న నీ దివ్యసౌందర్య రూపం– మధురమైనట్టి నీ వేణుగానం–మా మా హృదయాల్లో విరహాగ్నిని రగిల్చాయి. మా దేహాలను కాల్చివేస్తున్నాయి.నిన్ను విడిచిపెట్టి ఒక క్షణం కూడా వుండలేక వచ్చేసాం. అందుకుగాను మావాళ్లందరునూ ఎంతో ఆక్రోశించారు. అయినా లెక్కచేయలేదు. మర్యాదలు మంటగలిపాం. కట్టుబాట్లుని తెంచేసాం. నిందలపాలైనాం. ఇదంతా నీ కోసం. గోకులంలోని గోపికల పరితాపాన్ని విని– యోగీశ్వరుడు ఆత్మారాముడైన కృష్ణుడు చిరునవ్వులు చిందిస్తూ– వైజయంతీమాలను ధరించి– ఎందరు గోపికలు వున్నారో– అందరు కృష్ణులై– వారితో విహరించాడు.

కృష్ణ భగవానుని దివ్య మంగళకర కళ్యాణ గుణాలను– లీలావిలాసాలను కీర్తిస్తూ– గోపికలు అందరూ కలిసి పాడినారు. ఆడినారు. ఇక కృష్ణుడు వాళ్లందరితో తన చేతులను చక్కగా కలుపుతూ– కౌగలించుకుంటూ–వారి ముంగురులను అందంగా సవరిస్తూ– సరసాలాడుతూ తరుణీమణులను ఆనందింపచేసాడు. సమస్త కోరికలు నెరవేరగా– తమలాంటి భాగ్యవంతులు లేనేలేరని–ఒకరికి మరొకరు ఎంతగానో గొప్పలు చెప్పుకుంటున్నారు. వారి దురభిమానాన్ని సౌభాగ్యమదాన్ని– గమనించిన స్వామి హఠాత్తుగా అంతర్ధానమయ్యాడు.

కృష్ణ భగవానుడు ఎక్కడా కూడా కనపడకపోతే–ఆ స్వామి కోసం అన్వేషించసాగారు గోపభామలు. మగ ఏనుగు కనపడక పోయినపుడు– ఆడ ఏనుగు దిక్కుతోచకపోగా–దుఃఖిస్తు నాలుగువైపులా చూసినట్లు కృష్ణదేవుని కోసం వెతుకుతున్నారు. చెట్టుపుట్టల్ని అడగడం మొదలుపెట్టారు.

**నల్లనివాడు పద్మనయనంబుల వాడు కృపారసంబు పై**
**చల్లెడివాడు మౌళిపరిసర్పిత పింఛమువాడు నవ్వు**
**రాజిల్లెడి మోమువాడొకడు చెల్వల మానధనంబు దోచె**
**ఓ మల్లియలారా!మీ పొదల మాటున లేడు కదమ్మ చెప్పరే?**

పేరు పేరునా ఒక్కొక్క చెట్టుపుట్టను అడుగుతున్నారు గోపికలు.అందరూ గుమిగూడి ఒక్కటై కృష్ణభగవానుని దివ్యమైన గుణగణాలను– ఇంకనూ లీలలనూ– సరసాలనూ–కృష్ణ దేవుని గమన గతులను–చల్లని చూపుల్నీ– హాస లీలా విలసాలను– బాగా ఆడుతూ పాడుతూ కృష్ణునిపై ప్రేమానురాగాలతో రకరకాలైన చేష్టలతో పిచ్చి వాళ్లలా తిరుగుతున్నారు.

అంతలో ఒకరు మాధవుడను నేనంటే– నేనేమో గోవిందుడను అంటూనే కృష్ణభగవానుని స్మరిస్తూ అనుకరిస్తున్నారు. ఒక గోపిక రాక్షసి పూతనలాగా–శకటాసురునిలాగా మరొకతె– వేరొకతె కృష్ణపరమాత్మగా భావించి– కాలితో తన్నడం– ఒకతేమో మోకాళ్లతో దోగాడుతుంటే– చనుబాలని ఇస్తున్న యశోదలా–ఒకతే కాళియమర్దనం చేస్తున్నట్లుగా–ఇంకొకతె వస్త్రాలపహరణాలతో ఒకతె అభినయిస్తున్నారు. **(సశేషం)**

# తిరుమల సర్వస్వం

– పల్లపోతు వాణిశ్రీ



## సామాజిక సేవా కార్యక్రమాలు

**గత సంచిక తరువాయి**

తిరుమల – తిరుపతి దేవస్థానం వారు దేశవ్యాప్తంగా అనేక సామాజిక సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు. వాటన్నింటి కార్యకలాపాలు దాదాపు తిరుపతి కేంద్రంగా కొనసాగుతున్నాయి. వీటిలో చాలావరకు వైద్య, విద్యా రంగాలకు చెందినవే.

ఈ సేవలన్నీ అణగారిన వర్గాల వారికి ఉచితంగానే అందజేయబడతాయి. మిగిలినవారికి నామమాత్రపు రుసుము వసూలు చేయబడుతుంది.

**తితిదే ఆధ్వర్యంలో నడుస్తున్న కొన్ని సామాజిక సేవా పథకాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.**

**శ్రీ బాలాజీ దివ్యాంగుల శస్త్ర చికిత్స, పరిశోధన పునరావాస ట్రస్ట్ (BIRRD)** – దీనిద్వారా పోలియో మెల్లిటస్, సెరిబ్రల్ పాల్సీ, కంజెనిటల్ ఎనామలీస్, వెన్నెముక గాయాలు వంటి వ్యాధులకు, అత్యధిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పూర్తి ఉచితంగా చికిత్స అందిస్తారు.

**శ్రీ బాలాజీ వర ప్రసాదిని పథకం (SVIMS)** – ఈ పథకం కింద 2007 సంవత్సరంలో ఒక సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్మించబడింది. దీన్ని 'శ్రీవేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ'గా పిలుస్తారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) తరహాలో దీనిని అభివృద్ధి పరిచే ఉద్దేశ్యంతో ప్రణాళికలు రచించారు. ఈ సంస్థ ప్రాంగణం నుంచి శ్రీ పద్మావతి మహిళా కళాశాల, నర్సింగ్ కళాశాల, ఫిజియో థెరపీ విభాగం కూడా నడుప బడుతున్నాయి. ఇందులో కూడా పూర్తి ఉచితంగా, లేదా నామమాత్రపు రుసుముతో అత్యాధునిక వైద్య సేవలను అందిస్తారు.

**శ్రీనివాస శంకర నేత్రాలయ ట్రస్ట్** – 2010 వ సంవత్సరంలో ప్రారంభించబడిన ఈ ట్రస్ట్ ద్వారా నేత్ర సంబంధిత వ్యాధులతో బాధపడేవారికి పూర్తి ఉచిత వైద్యసహాయంతో పాటుగా, కావలసిన వైద్య పరికరాలను కూడా ఉచితంగా ఇస్తారు.

**శ్రీవేంకటేశ్వరా ప్రాణదానం ట్రస్ట్** – దీనిద్వారా నిరుపేద వర్గాలకు చెందిన వారికి గుండె, మూత్రపిండాలు, కాలేయం, మెదడు సంబంధిత ప్రాణాంతక వ్యాధులకై ఉచితంగా చికిత్స చేస్తారు.

**ఇతర వైద్య సేవలు** – తిరుమల యాత్రికులకు అత్యవసర వైద్య సేవలందించే నిమిత్తం అన్ని హంగులతో కూడుకున్న మరికొన్ని వైద్యశాలలను కూడా తి.తి.దే నడుపుతోంది. వినికిడి సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు చేయూత నివ్వడం కోసం 'శ్రవణం' అనే ప్రాజెక్టును తితిదే చేపట్టింది. కుష్టువ్యాధి గ్రస్తులకు వైద్యసహాయం అందించడానికి, 'శ్రీవేంకటేశ్వర పేదల గృహం' అనే పేరుతో, ఒక ఆసుపత్రితో కూడుకున్న పునరావాస కేంద్రాన్ని కూడా నడుపుతోంది. అలాగే కొండపైన, భక్తులకు అత్యవసర వైద్యసేవలు అందించడం కోసం 'అశ్విని' అనే వైద్యశాలను

నిర్వహిస్తోంది.

ఇవన్నీ ఒక ఎత్తైతే, కరోనా కష్టకాలంలో తితిదే అందించిన వైద్యసేవలు చరిత్రపుటల్లో శాశ్వతంగా నిలిచిపోతాయి. ఇపుడు తితిదే చేపడుతున్న మరికొన్ని సేవలను పరికిద్దాం.

**శ్రీవేంకటేశ్వర ట్రైనింగ్ సెంటర్ ఫర్ హాండీక్రాఫ్ట్** – ఈ కేంద్రం ద్వారా దివ్యాంగులకు, దృష్టిలోపం ఉన్నవారికి, బధిరులకు వృత్తి విద్యలలో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పించబడుతుంది.

**శ్రీవేంకటేశ్వర కేంద్ర గ్రంథాలయం మరియు పరిశోధనా కేంద్రం** – 1993వ సంవత్సరంలో స్థాపించబడిన ఈ కేంద్రంలో, లక్షకు పైగా పురాతన గ్రంథాలు, వ్రాతప్రతులు, తాళపత్రాలు, శిలాశాసనాలు భద్రపరిచారు. యూజీసి ఈ పరిశోధనా కేంద్రానికి చరిత్రలో డాక్టరేట్ చేస్తున్న విద్యార్థులకు పరిశోధనా కేంద్రంగా గుర్తింపునిచ్చింది. ఈ కేంద్రంలో ఉన్న పత్రాలన్నింటినీ డిజిటలీకరించే ప్రక్రియ చేపట్టబడింది.

**శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్** – దీనిద్వారా చేపట్టే ఉచిత అన్నదాన పథకం వివరాలను ఇంతకుముందే తెలుసుకున్నాం. ఒకరోజుకు సరిపడా ఉదయపు అల్పాహారం గానీ, మధ్యాహ్నం లేదా రాత్రి భోజనం గానీ తమకు కావలసిన తిథిలో అందజేయడానికి సరిపడే మొత్తాన్ని ఈ ట్రస్టుకు విరాళంగా అందించవచ్చు. ఆరోజు ఉభయ దాతలుగా వారి పేరును అన్నప్రసాద సముదాయంలో ప్రకటిస్తారు.

**శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్ట్** – 1963వ సంవత్సరంలో స్థాపించబడిన 'శ్రీవేంకటేశ్వర బాలమందిరం ట్రస్ట్' పేరు మార్చుకుని 'శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు'గా రూపాంతరం చెందింది. దీనిద్వారా అనాథలైన బాలబాలికలకు, నిరుపేదల తల్లితండ్రుల పిల్లలకు ఉచితంగా విద్యాదానం చేయబడుతుంది. ఎందరెందరో పేదవర్గాల పిల్లలు దీనిలో ప్రాథమిక విద్యనభ్యసించి, జీవితంలో ఉన్నత శిఖరాలకెదిగారు.

**శ్రీవేంకటేశ్వర వేదపరిరక్షణ ట్రస్ట్** – వేదాలను, సనాతన ధర్మాన్ని పరిరక్షించే నిమిత్తం ఈ ట్రస్ట్ ద్వారా నడుపబడుతున్న వేద విద్యాసంస్థల గురించి ఇంతకు ముందే తెలుసుకున్నాం.

**శ్రీవేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్ట్** – 2002 వ సంవత్సరంలో స్థాపించబడ్డ ఈ ట్రస్ట్ కార్యక్రమాలను కూడా ఇంతకుముందే చెప్పుకున్నాం.

**శ్రీవేంకటేశ్వర విద్యాలయ ట్రస్ట్** – ఈ ట్రస్ట్ ద్వారా ప్రతి సంవత్సరం ప్రభుత్వ, స్థానిక సంస్థల, తితిదే ఆధ్వర్యంలో నడుస్తున్నటువంటి ప్రైవేట్ మరియు ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుకుంటున్న వెయ్యి మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనం అందజేస్తారు.

**ఇతర విద్యా సేవా కార్యక్రమాలు** – 1876వ సంవత్సరంలోనే అప్పటి ఆలయ యాజమాన్యం మహంతుల పర్యవేక్షణలో విద్యారంగంలో ప్రవేశించి, తిరుపతి, వెల్లూరు పట్టణాల్లో పాఠశాలలు, కళాశాలలు స్థాపించింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఏర్పడిన తరువాత, వృత్తి విద్యా కళాశాలలు, ప్రాచ్య కళాశాలలు, డిగ్రీ మరియు జూనియర్ కాలేజీలు, ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు ప్రారంభించబడ్డాయి. ఢిల్లీలో ఒక డిగ్రీ కాలేజీని కూడా నడుపుతోంది. దేశవ్యాప్తంగా నడుపబడుతున్న అనేక ప్రైవేట్ వేదపాఠశాలలకు నిధులు సహాయం చేస్తోంది.

**శ్రీ వాణి ట్రస్ట్** – 2019వ సంవత్సరంలో ప్రారంభించిన ఈ ట్రస్ట్ ద్వారా ఆలయాల నిర్మాణానికి, చిన్న ఆలయాల నిర్వహణకు, భక్తులకు సౌకర్యాలు కల్పించడానికి సహాయం చేయబడుతోంది.

ధార్మిక కార్యక్రమాలు, హరికథలు, భజనలు, బుర్రకథల వంటి కళారూపాల ద్వారా, చిన్న ఆలయాలకు కావలసిన



సాధన సంపత్తులను అందించటం ద్వారా, ధార్మిక సాహిత్యాన్ని ప్రచురించడం ద్వారా, అన్నమాచార్య, దాససాహిత్య, దివ్యప్రబంధ, శ్రీనివాస కళ్యాణోత్సవం వంటి ప్రత్యేక ప్రాజెక్టుల ద్వారా, హైందవ మత ప్రచారం కోసం విశేషమైన కృషి సలుపుతోంది. దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక కార్యకలాపాలను నిర్వహించడం కోసం హిందూధర్మ ప్రచార పరిషత్ అనే ప్రత్యేక విభాగం ద్వారా అనేక ధార్మిక కార్యక్రమాలు చేపట్టబడుతున్నాయి. తితిదే ఆధ్వర్యంలో దేశం నలుమూలలా అద్భుతమైన ఆలయాలు నిర్మించబడ్డాయి.

**యాత్రికులకు వసతి సదుపాయాలు** - తిరుమలకు విచ్చేసిన యాత్రికుల్లో 90 శాతానికి పైగా తితిదే వసతి గృహాలలోనే బస చేస్తారు. యాత్రికులందరికీ అతి తక్కువ ధరలలో పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన వసతి ఏర్పాటు చేయబడుతుంది. శ్రీనివాసం, మాధవం, విష్ణునివాసం, వేంకటేశ్వర ధర్మశాల, కోదండరామస్వామి ధర్మశాల వంటి వసతి గృహాలు తిరుపతి పట్టణం నడిబొడ్డులో రైల్వేస్టేషన్ మరియు బస్ స్టాండుకు అత్యంత సమీపంలో ఉన్నాయి. అలాగే తిరుమలలో ఆళ్వార్ టాంక్, అంజనాద్రి, గరుడాద్రి, మంగళం బావి కాటేజెస్, మరియు రాం బగీచా అతిథి గృహాలు ముఖ్యమైనవి.

శ్రీవేంకటేశ్వర భక్తిఛానల్ అనే ఉచిత బుల్లితెర ఛానల్ ద్వారా అనేక ధార్మిక కార్యక్రమాలు, తితిదే ఆధ్వర్యంలోని దేవాలయాల్లో జరిగే ఉత్సవాలు, అచ్చం తిరుమల ఆలయంలా ఉండే తిరుపతిలోని నమూనా ఆలయంలో జరిగే శ్రీవారి సేవలు మున్నగునవి నిరంతరం ప్రసారం చేయబడతాయి. దాదాపుగా ప్రతి ఉదయం తిరుమలలోని 'నాద నీరాజనం' వేదికపై జరిగే పురాణ శ్రవణ కార్యక్రమాల ప్రత్యక్షప్రసారం చేయబడుతుంది.

తితిదే ప్రచురణల విభాగం సనాతన హైందవ ధర్మాన్ని, శ్రీవేంకటేశ్వర భక్తితత్వాన్ని మరింత ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు ఈ విభాగం ఇంతవరకు 4000 పైగా గ్రంథాలను తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, సంస్కృతం, ఆంగ్ల భాషల్లో ప్రచురించి ఉచితంగానూ, రాయితీ ధరల్లోనూ పంపిణీ చేస్తోంది. ఈ గ్రంథాలను విక్రయించడం కోసం తిరుమల, తిరుపతితో పాటు, అనేక ముఖ్య పట్టణాలలో విక్రయ కేంద్రాలున్నాయి. ఈ విభాగం గత ఏప్రిల్ మాసంలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని 751 గ్రంథాలను అంతర్జాలం ద్వారా అందుబాటులోకి తెచ్చింది. ఏదైనా ప్రైవేట్ గ్రంథాలయం వారు తితిదే పుస్తకాలను ప్రదర్శించటానికి ఆసక్తి కనబరిస్తే, వారికి 15,000 విలువైన పుస్తకాలను ఉచితంగా అందజేస్తారు. ఈ సంస్థ ప్రచురించే గ్రంథాలలో వేద, పౌరాణిక, కావ్యప్రబంధ, సంకీర్తన, ఆలయ సాహిత్యాలకు సంబంధించిన గ్రంథాలున్నాయి.

సప్తగిరి అనే ఆధ్యాత్మిక మాసపత్రిక తితిదే ద్వారా నడుపబడుతోంది. ఈ పత్రిక తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, సంస్కృతం మరియు ఆంగ్ల భాషల్లో వెలువడుతోంది. దీనికి అనుబంధంగా చిన్నారుల కోసం 'బాల సప్తగిరి' అనే చిరు పుస్తకాన్ని కూడా ఈ మధ్యనే వెలువరిస్తున్నారు. రాయితీ ధరల ద్వారా అందించే ఈ పత్రిక ద్వారా పురాతన దేవాలయాల చరిత్ర, తితిదే అనుబంధ ఆలయాలపై ప్రత్యేక కథనాలు, తిరుమల – తిరుపతి దేవాలయాలలో జరిగే నిత్య, వార, పక్ష, మాస, సంవత్సరోత్సవాల వార్తలు, భారతీయ శిల్పకళా వైభవం, భక్తాగ్రేసరుల కథనాలు, మంత్రోచ్చారణా పద్ధతులు, పురాణ ప్రవచనాలు మొదలైనవి ప్రచురిస్తూ, హిందూధర్మ ప్రచారానికై యథాశక్తి కృషి చేయబడుతోంది.

దాతల సంచాలక వ్యవస్థ (డోనర్ మేనేజ్మెంట్ సిస్టమ్) – ద్వారా తిరుమలలో అతిథి గృహాలు నిర్మించడానికి దాతలను ప్రోత్సహిస్తోంది. అటువంటి దాతలకు లభించే సదుపాయాలను పారదర్శకంగా అందించేందుకు అంతర్జాలంలో ఒక వెబ్ సైట్ ను కూడా తితిదే ప్రారంభించింది.

కళ్యాణ వేదిక – పేద, మధ్యతరగతి వర్గాల వారు తక్కువ ఖర్చులో, సకల సదుపాయాలతో పెళ్ళిళ్ళు జరుపుకోవడానికి దేశవ్యాప్తంగా 300 కు పైగా కళ్యాణ మండపాలు నిర్మించి, వాటిని ఆన్ లైన్లో బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని తితిదే కల్పించింది. ఆంధ్రప్రదేశ్ లో అత్యధికంగా 187, తెలంగాణలో 65 కళ్యాణ మండపాలు నడుపబడుతున్నాయి. కుప్పం, రాజాం, నర్సాపూర్, మహబూబ్ నగర్, బెంగుళూర్ లలోని తితిదే కళ్యాణ మండపాలు అత్యద్భుతమైన సేవలందిస్తూ ఐఎస్ఓ గుర్తింపు తెచ్చుకున్నాయి.

పైన చెప్పబడిన అనేక ట్రస్టులకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంది. ఆయా ట్రస్టులకు అందించే విరాళాలపై కూడా దాతలు ఆదాయపు పన్ను రాయితీని పొందవచ్చును.

పైన ఉదహరించినవి – తితిదే చేపడుతున్న అసంఖ్యాకమైన సేవాకార్యక్రమాల్లో అతికొద్ది మాత్రమే. శ్రీవారి చల్లని చూపుతో తితిదే సామాజిక సేవా రంగంలో మరింతగా ఎదగాలని, బడుగు – బలహీన వర్గాల వారికి మరింత చేయూత నివ్వాలని కోరుకుందాం.

అలాగే తితిదే ఆధ్వర్యంలో అత్యంత పారదర్శకంగా, ఏ విధమైన వివాదాలకు తావు లేకుండా, సేవాభావంతో నడుపబడుతున్న ట్రస్టులకు ఉడతా భక్తిగా మన వంతు ఆర్థిక సహాయాన్ని అందించి, వారు చేస్తున్న సమాజ సేవలో మనం కూడా తోడ్పడుదాం.

**(సశేషం)**



# దుర్గా నవరాత్రి ఉత్సవం

**- డాక్టర్ దేవులపల్లి పద్మజ**

**దుర్గా దుర్గార్తి శమనీ దుర్గాపద్వి నివారిణీ।**
**దుర్గమచ్ఛేదినీ దుర్గా సాధనీ దుర్గనాశినీ ॥**

లోకకల్యాణార్థం, మన కుటుంబసౌఖ్యం కోసం, సంకల్ప సిద్ధి కొరకు కానీ మనకున్న అవకాశాలతో ఉత్సాహంగా జగజ్జనని ఆరాధనలు చేస్తూ నియమానుసారం విశేష సేవల ద్వారా అనుగ్రహం పొందే సంప్రదాయం మనది. ఆ దుర్గాదేవి మన నిత్య జీవితంలో దుఃఖం లేకుండా సుఖసంతోషాలతో కుటుంబం అభివృద్ధి దశలో ప్రశాంతంగా సాగిపోవాలని కోరుకుంటూ ఆలయాల్లో దేశం సుభిక్షంగా, పాడిపంటలతో ధనధాన్యాలతో సాగిపోవాలనే సంకల్పంతో నవరాత్రులలో నవ అవతారాలలో మనకి దర్శింప చేస్తారు.

“ప్రథమా శైలపుత్రీచ, ద్వితీయ బ్రహ్మచారిణి, తృతీయ చంద్రఘంటేతి, కూష్మాండేతి చతుర్థకీ, పంచమా స్కంద మాతేతి, షష్ఠా కాత్యాయనేతిచ, సప్తమా కాళరాత్రీచ, అష్టమాచాతి భైరవీ, నవమా సర్వసిద్ధిశ్చాత్ నవదుర్గా ప్రకీర్తితా”.

శ్రీమాతను ఆరాధించే విధానమును శ్రీమార్కండేయ మహర్షికి బ్రహ్మ చెప్పినట్లు మనకు పురాణాలద్వారా తెలుస్తోంది. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి దశమి వరకు శరన్నవరాత్రులుగా మనం జరుపుకునే దసరా ఉత్సవాలు శక్తి రూపిణి అయిన దుర్గామాతను వివిధ రూపాలలో ప్రత్యేక పూజలతో పూజిస్తాము.

శక్తి ఆరాధన చేయదలచినవారు ప్రథమంగా గణపతిని పసుపుతో ప్రతిష్ఠించి నిర్విఘ్నంగా నవరాత్రుల దుర్గాపూజలు పూర్తిగావించి అఖండ ఫలితాలను ఆ తల్లి అనుగ్రహంతో పొందాలని సంకల్పం చెప్పుకోవాలి. నవరాత్రి కలశను ప్రతిష్ఠించి, నవధాన్యాలను కూడా ఒక పాత్రలో ప్రక్కనే పెట్టుకోవాలి. నవరాత్రులు శక్తికి ప్రతిరూపం కాబట్టి సక్రమంగా జరిపే పూజలు అద్భుతమైన ఫలితాలను ప్రసాదిస్తుంది. అదే విధంగా ఆచార విరుద్ధంగా సాగించే పూజలతో చెడు ఫలితాలు కూడా చవిచూడవలసి వస్తుంది. కలశం స్థాపన వీలుకాక పోతే మామూలుగా కూడా తల్లిని పూజింపవచ్చును. నైవేద్యం విషయంలో కూడా శక్తి కలిగిన విధంగా చేయవచ్చును. ఈ నవరాత్రి వ్రతము చేయువారు ఏకభుక్తము చేయాలి. ప్రతిదినము ఉదయము మరియు సాయంత్రము అమ్మవారి పూజ

విధివిధానాలతో చేయాలి.

**1.స్వర్ణ కవచాలంకారము:**

ప్రథమంగా పాడ్యమి నాడు స్వర్ణకవచ అలంకారంతో దుర్గాదేవిగా విధివిధానాలతో, షోడశోపచార పూజలతో పూజిస్తారు. ఆ రోజు చేమంతి పూవులను వినియోగిస్తారు. దుర్గా అష్టోత్తర నామములతో పూజ సల్పి, పులిహోర నైవేద్యంగా సమర్పిస్తారు. దుర్గా కవచ పారాయణ విశేష ఫలితాన్నిస్తుంది.

**2. బాలాత్రిపుర సుందరి:**

శరన్నవరాత్రులలో విదియ నాటి అవతారము బాలాత్రిపురసుందరి. పరమేశ్వరుడే తనకు పతి కావాలని కోరుకుంది. త్రిపురుని అర్ధాంగి కావటం వలన, అన్ని లోకాలలో ఈ తల్లి సౌందర్యవతి గావున బాలాత్రిపురసుందరిగా ఈ తల్లిని పిలుస్తారు. బాలా త్రిశతి స్తోత్రం అత్యంత ఫలదాయకము. ఈ రోజు అమ్మవారికి పొంగలి నైవేద్యం పెట్టి అర్చిస్తే అభీష్ట సిద్ధి కలుగుతుంది. అమ్మవారిని ఆకుపచ్చ రంగు వస్త్రముతో అలంకరించి, గులాబీలతో అర్చిస్తే శుభప్రదము. శ్రీశైలం దేవస్థానములో అమ్మవారిని బ్రహ్మచారిణి రూపంలో అలంకరిస్తారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారిని బాలాత్రిపురసుందరి అవతారంలో అలంకరిస్తారు.



**3. గాయత్రిదేవి:**

దుర్గానవరాత్రులలో మూడవ రోజైన తదియనాడు అమ్మవారిని గాయత్రి అవతారంలో అర్చిస్తాము. సకల మంత్రాలకు మూలశక్తి అయిన గాయత్రీదేవి ముక్త, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలతో కూడిన అయిదు ముఖాలతో శంఖము. చక్రము, గద మరియు అంకుశం ధరించి దర్శనమిస్తుంది. గాయత్రిదేవిని త్రిశక్తి స్వరూపంగా భావిస్తారు. విజయవాడలో కొలువైయున్న కనకదుర్గ ఈరోజు గాయత్రిమాత అలంకారంలో దర్శనమిస్తుంది. శ్రీశైలంలోని భ్రమరాంబ ఈ రోజు చంద్రఘంట అవతారంలో దర్శనమిస్తుంది. అర్ధాకృతిలోని చంద్రరేఖను శిరస్సుపై ధరించే రూపం చంద్రఘంట. ఈ రోజు అమ్మవారికి ఎరుపు రంగు వస్త్రము, కనకాంబరాలతో అలంకరించాలి. ఈమెకు పాయసం, అల్లపు గారెలు నివేదన చేయాలి.

**4. అన్నపూర్ణ:**

దసరా నవరాత్రులలో నాల్గవరోజైన చవితినాడు అమ్మవారిని అన్నపూర్ణమాతగా ఆరాధిస్తారు. ఈమె ఒక చేతిలో అక్షయ పాత్రతో మరియొక చేతిలో గరిటెతో దర్శనమిస్తుంది కావున ఈమెను అన్నపూర్ణగా పూజిస్తారు. సాక్షాత్తు పరమేశ్వరునికే భిక్షనొసంగిన అన్నపూర్ణ అక్షయములైన శుభాలను అందిస్తుంది. అన్నపూర్ణాష్టక పారాయణ శుభదాయకము. ఈమెకు పులిహోర, పెసరపప్పు పాయసం నివేదన చేయాలి. విజయవాడ కనకదుర్గమ్మ అన్నపూర్ణ మాతగా దర్శనమిస్తారు. శ్రీశైలంలోని భ్రమరాంబ కూష్మాండ రూపంలో దర్శనమిస్తారు. కూరగాయలతో చేసిన కదంబం నివేదన చేయాలి.

**5. లలితా త్రిపురసుందరి:**

దసరా నవరాత్రులలో అయిదవ రోజైన పంచమి తిథినాడు అమ్మవారు లలితాత్రిపురసుందరిగా ఆరాధిస్తారు. శ్రీచక్రముపై ఎడమ పాదమును మోపి, చెరకు విల్లు, పుష్ప బాణములు ధరించి బంగారు సింహాసనముపై ఆశీనురాలైవుంటుంది. లలితా కవచపారాయణ, లలితా సహస్రనామ పారాయణ అత్యంత ఫలదాయకము. లలితాదేవికి గులాబీరంగు వస్త్రము ధరింపచేసి, నీలంరంగు పువ్వులతో పూజచేసి పాయసం నైవేద్యంగా సమర్పించాలి. విజయవాడ కనకదుర్గమ్మ ఈరోజు లలితా త్రిపురసుందరీగా దర్శనమిస్తుంది. శ్రీశైలం భ్రమరాంబ ఈరోజు స్కందమాతగా దర్శనమిస్తుంది. గోధుమ రవ్వతో చేసిన కేసరి, మిరియాల పొంగలి నివేదన చేయాలి. నీలం రంగు వస్త్రములతో అలంకరిస్తారు.

**6. మహాలక్ష్మి:**

దుర్గా నవరాత్రులలో ఆరవరోజైన షష్ఠి తిథినాడు అమ్మవారిని మహాలక్ష్మి అవతారంలో అర్చిస్తారు. సిరిసంపదలకు, సౌభాగ్యానికి, సుఖసంతోషాలకు, సంతానానికి ప్రతీక. జగత్తు స్థితి కారకుడైన శ్రీమహావిష్ణువునకు తోడుగా మహాలక్ష్మి ఉద్భవించినదని దేవీభాగవతంలో చెప్పబడినది. విజయవాడ కనకదుర్గమ్మ ఈ రోజు

భక్తులకు మహాలక్ష్మీ అవతారంలో దర్శనమిస్తారు. ఈ తల్లిని శ్రీసూక్త పారాయణతో, మహాలక్ష్మి సహస్రనామములతో, మహాలక్ష్మాష్ట స్తోత్రముతో స్తుతించాలి. ఈ తల్లికి తెలుపురంగు చీరను సమర్పించి, కలువపూవులతో, తామరపూవులతో అర్చించాలి. నైవేద్యంగా పూర్ణం బూరెలు సమర్పించాలి. శ్రీశైలం భ్రమరాంబ ఈరోజు కాత్యాయని అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఈమెను పసుపు రంగు వస్త్రాలతో అలంకరించిఈ మాతకు బెల్లం అన్నం, ముద్ద పప్పు నైవేద్యంగా సమర్పించాలి.

**7. సరస్వతీమాత:**

దుర్గానవరాత్రులలో ఏడవ రోజైన సప్తమి తిథినాడు అమ్మవారిని సరస్వతి అవతారంలో ఆరాధిస్తారు. దేవతామూర్తులలో చదువుల తల్లిగా సరస్వతీ దేవి కొలువబడుతుంది. త్రిమూర్తులలో ఒకరైన బ్రహ్మ పట్టపురాణి. సృష్టి కార్యం నిర్వహించటానికి బ్రహ్మకు తోడుగా ఈమెను మహాశక్తి సృజించినట్లుగా దేవీభాగవతం తెలియచేస్తోంది. తెల్లని పద్మముపై ఆసీనురాలై వీణ, దండ, కమండలం, అక్షమాల ధరించి అభయముద్రతో దర్శనమిస్తూ భక్తులకు జ్ఞానజ్యోతిని ప్రసాదిస్తుంది. ఈ రోజు మూలా నక్షత్రము గావటం వలన సరస్వతీ అవతారంలో దర్శనమిస్తుంది. విద్యార్థులచేత అక్షరాభ్యాసాలు చేయిస్తారు. ఈ మాతకు తెల్లని లేదా పసుపు రంగు వస్త్రాలు సమర్పించి, బెల్లం అన్నం, ముద్దపప్పు నైవేద్యంగా సమర్పించాలి. విజయవాడ కనకదుర్గమ్మ ఈ రోజు సరస్వతీ అవతారంలో దర్శనమిస్తారు. శ్రీశైలం భ్రమరాంబ ఈరోజు కాళరాత్రి అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఈ తల్లికి ఆకుపచ్చ వర్ణం వస్త్రాలతో అలంకరించి దద్ధోజనం, చక్కెర పొంగలి నైవేద్యంగా సమర్పించాలి.

**8. మహాదుర్గ:**

దుర్గానవరాత్రులలో ఎనిమిదవ రోజైన అష్టమినాడు అమ్మను మహాదుర్గగా ఆరాధిస్తారు. పంచ ప్రకృతి రూపాలలో మొదటిది దుర్గా రూపము. సింహవాహనముపై అధిరోహించి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేస్తుంది. దుర్గముడనే రాక్షసుని సంహరించి, దుర్గతులను నాశనమొనరించి నందువలన ఈమెను దుర్గాదేవి అని కూడా పిలుస్తారు. రోజు దుర్గాసప్తశతి, చండీ పారాయణ, దుర్గా స్తోత్రము విశేష ఫలదాయకము. ఎరుపు రంగు వస్త్రము, ఎరుపు రంగు పూవులు అమ్మవారికి సమర్పించాలి. అమ్మవారికి పొంగలి, పులిహోర, పులగం నైవేద్యంగా సమర్పించాలి. విజయవాడలో కనకదుర్గమ్మ ఈరోజు మహాదుర్గగా భక్తులకు దర్శనమిస్తుంది. శ్రీశైలం భ్రమరాంబ ఈరోజు మహాగౌరిగా భక్తులను అనుగ్రహిస్తుంది. ఈ తల్లికి గారెలు, పులిహోర నైవేద్యంగా సమర్పించాలి.

**9. మహిషాసుర మర్ధిని:**

తొమ్మిదవ రోజైన నవమిని మహార్నవమి అని కూడా వ్యవహరిస్తారు. మహిషాసుర మర్దిని స్తోత్రమును భక్తి శ్రద్ధలతో దుర్గానవరాత్రులలో నవమి రోజన మహిషాసుర మర్ధిని రూపంలో యున్న అమ్మ అనుగ్రహం కోసం భక్తులు పఠిస్తారు. మహిషుడు గర్వమునకు, మదమునకు అంధకారమునకు ప్రతీక. ఈ రోజు దుర్గాసప్తశతి పారాయణ, ఖడ్గమాలా స్తోత్ర పారాయణ అత్యంత ఫలదాయకము. ఈ రోజు అమ్మవారికి పానకం, వడపప్పు, గారెలు, పులిహోర నైవేద్యంగా సమర్పించాలి. ఎరుపు రంగు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించాలి. విజయవాడ కనకదుర్గమ్మ ఈ రోజు మహిషాసుర మర్ధిని రూపంలో భక్తులకు దర్శనమిస్తుంది. శ్రీశైలం భ్రమరాంబను ఈ రోజు సిద్ధిధాత్రి అవతారంలో అలంకరిస్తారు. ఈ రోజు ఛండీ సప్తశతి, ఖడ్గమాల పారాయణ చేయాలి. ఈ తల్లికి కొబ్బరి అన్నం, నిమ్మకాయ పులిహోర నైవేద్యంగా సమర్పించాలి.

**10. రాజరాజేశ్వరీ దేవి:**

దుర్గానవరాత్రులలో ఆఖరి అవతారము శ్రీరాజరాజేశ్వరి. పరమేశ్వరుని అంకముపై ప్రకాశముతో వెలుగొందుతూ, పరమేశ్వరుని వామాంకములో ఆసీనురాలై భక్తులకు ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తిని ప్రసాదించే అవతారము శ్రీరాజరాజేశ్వరి. ఈరోజు ఈ తల్లిని లలితా సహస్రనామ పారాయణ చేసి ఆరాధించాలి. చేమంతులతో పూజ చేయాలి. భక్ష్య, భోజ్యములతో మహానివేదన చేయాలి. బంగారు కవచధారణ చేస్తారు లేదా బంగారు వర్ణముగల వస్త్రముతో అలంకరిస్తారు. ఈ రోజున విజయదశమిగా పూజిస్తాము. ఈ రోజు అశ్వపూజ, ఆయుధపూజ, ఉచ్చైశ్రవ పూజ, వాహన పూజ నిర్వహిస్తారు. శ్రీరాముడు విజయదశమి రోజున రావణుని సంహరించి విజయం పొందాడు. దశమి రోజు సాయంత్రము నక్షత్ర దర్శన సమయంలో శమీవృక్షము వద్ద అపరాజితాదేవిని స్మరిస్తారు. "శమీ శమయతే పాపం, శమీ శతృవినాశిని ' అర్జునస్య ధనుర్ధారి రామస్య ప్రియ దర్శినీ" అనే ఈ మంత్రముతో తమ తమ గోత్రనామాలు చెప్పుకుని జమ్మి వృక్షాన్ని పూజ చేసి మూడు ప్రదక్షిణలు చేస్తారు.

దేవీ ఉపాసకులు అంతవరకు తాము చేసిన జప సంఖ్య ననుసరించి తగువిధముగా హోమాలు చేస్తారు. నవరాత్రి వ్రత సమాప్తి గావించిన వారికి సర్వ సిద్ధులు, సర్వాభీష్ట సిద్ధి కలుగుతుంది.

దసరా నవరాత్రులలో వైభవోపేతమైన దుర్గాదేవి పందిళ్ళు మనకి వాడవాడలా శోభాయమానంగా ఆహ్వానం పలుకుతాయి. శ్రీ మాతాదేవ్యైనమః.

**శుభం భూయాత్**

# బతుకమ్మ సంబరాలు

– డా|| దేవులపల్లి పద్మజ

**సర్వ మంగళ మాంగళ్యే శివే సర్వార్ధ సాధికే!**
**శరణ్యే త్ర్యయంబికే గౌరీ నారాయణి నమోస్తుతే!**



ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి మహర్నవమి వరకూ తొమ్మిది రోజుల పాటు సద్దుల బతుకమ్మ, గౌరీ పండుగ, సౌభాగ్య వ్రతం అని వాడుకలో ఉన్న నవరాత్రి వ్రతమే ఆంధ్ర దేశంలో కొన్ని ప్రాంతాల్లో ముఖ్యంగా తెలంగాణలో ఘనంగా జరుపుకొనే బతుకమ్మ పండుగ.

తెలంగాణ మరియు గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతాల్లో కొన్ని గ్రామాలలో సద్దుల బతుకమ్మ పండుగను శ్రద్ధాభక్తులతో జరుపుకొంటారు. బతుకమ్మ పండుగ దసరాకి రెండు రోజుల ముందు వస్తుంది. మహాలయ అమావాస్య నుంచి దుర్గాష్టమి వరకు జరుపుకునే 9 రోజులు దసరాకి సంబంధిత పూల పండుగగా జరిపించే పండుగ గా చెప్పవచ్చు.

రంగు రంగుల పూలతో త్రికోణాకారంగా పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ సంతోషంగా చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ మధ్యలో పూలతో తయారు చేసిన గౌరీ దేవిని అమర్చి పాటలతో గౌరి దేవికి విన్నపాలు చేసుకుంటారు.

ఏ రూపంలో ఉన్నా ఆ జగజ్జనని గౌరీదేవి మూలమే కనుక ఎవరికి నచ్చిన రూపంలో వారు ఆ తల్లిని చూసుకుంటూ మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ, 2 వ రోజు అటుకుల బతుకమ్మ 3 వ రోజు ముద్దపప్పు బతుకమ్మ 4వ రోజు నాన బియ్యం, 5వ రోజు అట్ల బియ్యం, 6వ రోజు అలిగిన, 7వ రోజు వేప కాయల, 8 వెన్నముద్దల బతుకమ్మ, 9 సద్దుల బతుకమ్మ ఇలా తొమ్మిది రోజులు పూజించి ఆఖరి రోజున బతుకమ్మలను బావిలో లేదా ప్రవహించే నీటిలో నిమజ్జనం చేస్తారు. మహిళలు తమ కష్టాలను నీటిలో కలిపేసి సుఖం, స్నేహం, ప్రేమ, బంధుత్వం, భక్తి తత్వంతో భావి జీవితం గడిపేటందుకు ఆశీర్వదించమని గౌరీదేవిని కోరుకుంటారు, ప్రార్థిస్తారు.

ఈ సంబరాలలో మొదటి ఎనిమిది రోజులు కన్యకలు బతుకమ్మ పాటలు పాడుతూ , మంచి మనసున్న భర్తను, తల్లిలా ఆదరించే అత్తగారిని , తండ్రివలె ఆదరణ చూపే మామగారిని కుటుంబ సభ్యులుగా ఇవ్వమని వేడుకుంటూ, తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మగా పండుగ చేసుకుంటూ గౌరీదేవిని కోరుకుంటారు. ఆంధ్రప్రదేశ్ లోని మాచెర్ల, కంభంపాడు, కారంపూడి గ్రామాలలో ఈ తొమ్మిది రోజులు బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఆశ్వయుజ మాసం సంవత్సర మధ్యమం కాబట్టి ఎక్కువ వేడి, ఎక్కువ శీతలం కాకుండా మంచి ఆహ్లాదకరమైన కాలం. వర్ష ఋతువుతో నిండిన చెరువులు తొణికిసలాడుతూ ప్రకృతి రమణీయంగా ఉంటుంది. పండిన పంట భారం చేత వంగి నమస్కరిస్తున్నట్లు ఉంటుంది. జొన్న చేలు, పచ్చగా పెరిగే పైరు సంపద, విరబూసిన చెట్లతో ప్రకృతి సౌందర్యవంతంగా విలసిల్లుతుంది. ఈ పండుగ రోజుల్లో మహిళలూ పుట్టమన్నుతో ఒక బొమ్మను చేసి, బహుళపంచమి నాడు దానిని ప్రతిష్ఠించి దానిపైన ఒక కలశాన్ని ఉంచి, ఆ కలశంపై పసుపు ముద్దతో గౌరమ్మను నిలిపి పూలతోనూ, పసుపు కుంకుమ, వివిధ వర్ణ పుష్పాలను అలంకరిస్తారు. ఈ విధంగా ప్రతి ఇంటిలోనూ చేయలేకపోయినా గ్రామంలో ఎక్కడ చేసినా కూడా ఆ గౌరీ పార్వతి ఆశీర్వదిస్తుందని నమ్మకం. గౌరమ్మను నిలిపిన పిదప సమీపంలోని కన్యకలందరూ అలాగే మహిళలూ బాలికలు ఆ బతుకమ్మ వద్దకు చేరుకుంటారు. శోభాయమానంగా ఆ ప్రదేశమంతా కేళీవిలాసాలతో వినోదమయమై కన్యకలచేత పూజలు చేయిస్తూ ఆడుకుంటారు. 9వ రోజున కోడికూసే సమయానికి స్త్రీలు నిద్రలేచి పరిసరాలన్నీ తిరిగి రకరకాల పూలు సేకరించి, గోరు వెచ్చని జీడిగింజల నూనె తలకు రాసుకుని అభ్యంగన స్నానం చేసి, నూతన వస్త్రాలు ధరించి, అలికి ముగ్గులు వేసిన ఇంట్లో చాపువేసి బతుకమ్మను పేర్చి, గుమ్మడి పూవు అండాశయాన్ని తుంచి పసిడి గౌరమ్మను ఏర్పాటు చేస్తారు. పసుపుతో ముద్ద గౌరమ్మను చేసి పెట్టి అగరవత్తులు వెలిగించి పసుపు కుంకుమలతో అలంకరించి పగలంతా అలాగే వుంచుతారు.

సంధ్యా సమయంలో పిల్లలు, పెద్దలు, స్త్రీలందరూ నూతన వస్త్రాలతో అలంకరించుకొని బతుకమ్మలను చేతబట్టుకొని చెరువుకట్టకో కాలువగట్టుకో, దేవాలయానికీ వెళ్లి బతుకమ్మలను మధ్య లో ఉంచి మహిళలు వాటిచుట్టూ తిరుగుతూ చప్పట్లు చరుస్తూ గొంతెత్తి విన్నపాలను పాటరూపంలో వినిపిస్తూ గౌరమ్మను స్తుతిస్తారు. ఒకరు పాట పాడగా వలయాకారంలో తిరుగుతూ ఆ పాటను అనుసరిస్తూ పాడతారు. ఈ పాటల్లో లక్ష్మీ సరస్వతుల స్తోత్రాలే కాకుండా పౌరాణిక గాథలైన, శశిరేఖా, సతీ అనసూయ కృష్ణ లీల, సీతాదేవి వనవాసం మొదలైనవి, అలాగే స్ఫూర్తి నిచ్చే సారంగధర, బాలనాగమ్మకు సంబంధించిన పాటలు కూడా పాడుతూ ఉంటారు. ఆంధ్రప్రదేశ్ లో బతుకమ్మ సంబరాలను ఉత్సాహంతో సంతోషంగా చేసుకుంటారు. భగవంతుడు ఏ ఒక

ప్రాంతానికో భాషకో సంబంధించిన నిర్ణీత రూపం కాదు కనుక లోక కల్యాణం కోరుతూ కొన్ని ప్రాంతాల్లో జరుపుకుంటారు. తమ ఇళ్ళల్లో వివాహం చేస్తే ఎటువంటి మానసికోల్లాసంతో చేస్తామో అలాగే నూతన ఉత్సాహం వెల్లివిరుస్తుంది. పెళ్ళైన ఆడబడుచులను ఈ సంబరాలకోసం పుట్టింటికి తీసుకొస్తారు. కొత్తగా వివాహమైన ఆడపిల్లలను అత్తగారి ఇంటనుంచి కాగితపు పూలతో చేసిన బతుకమ్మను వాయినంగా పంపుతారు...పుట్టింటి పిలుపు ఎపుడు వస్తుందా అని అత్తవారింటి నుంచి ఎదురు చూసే ఆడపిల్లలు తన అన్న వచ్చి తీసుకొనివెళ్ళాలని ఎదురుచూస్తూ బతుకమ్మను ఇలా పాడుతూ ప్రార్థిస్తారు.

**బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో**
**బంగారు బతుకమ్మ ఉయ్యాలో**
**నా నోము పండింది ఉయ్యాలో**
**మా అన్నలొచ్చారు ఉయ్యాలో**
**బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో**
**బంగారు బతుకమ్మ ఉయ్యాలో**
**పుట్టింటి గౌరమ్మను నే కొలువగ ఉయ్యాలో**
**సద్దుల బతుకమ్మ దీవించరాగా ఉయ్యాలో**

ప్రతి దినం ఈ తొమ్మిది రోజులు మహిళలు బొడ్డెమ్మ కలశంలో పోసిన బియ్యం తొమ్మిదవ రోజు, ఆ బియ్యంతో పాయసం చేసి అందరికీ పంచి, చెరువు దగ్గరకి చేరి,

**బొడ్డెమ్మ బొడ్డెమ్మ బిడ్డలెందరే**
**బావిల పడ్డవారికి – వారిద్దరమ్మా**
**చెర్లబడ్డవారికి –చేరిద్దరమ్మా**
**కుంట్లబడ్డవారికి – కోరిద్దరమ్మా**
**నిద్రపోయే బొడ్డేమ – నిద్రపోవమ్మా**
**నిద్రకు నూరేండ్లు – నీకి వెయ్యేండ్లు**
**నినుగన్న తల్లికి – నిండు నూరేళ్ళు**

అంటూ బొడ్డెమ్మను చెరువు లేక బావిలో వదులుతారు. నీటిలో నిమజ్జనం చేసి ఆపై భగవంతుని ఈ విధంగా తలుచుకుంటారు..

**కోసలాధీసుడూ ఉయ్యాలో..దశరథ నాముండు ఉయ్యాలో**
**కొండకోనలు దాటి ఉయ్యాలో.. వేటకే బోయెను ఉయ్యాలో**
**అడవిలో తిరిగెను ఉయ్యాలో.. అటూఇటూ జూచెను ఉయ్యాలో**
**చెట్టు గుబురుచాటు ఉయ్యాలో... చెరువొకటి కనిపించే ఉయ్యాలో**

ఇలా దశరథుని శాప వృత్తాంత కథను , రామాయణ స్మృతిలో ఆధ్యాత్మిక సందేశమందించే బతుకమ్మ పాటతో ముగిస్తారు.

సంక్రాంతి సంబరాలలో డిసెంబర్, జనవరి నెలల మధ్య పుష్యమాసంలో ఇలాగే కన్యలు, బాలికలు గొబ్బెమ్మల పూజ ప్రత్యేకంగా జరిపించే విధానం బతుకమ్మ పూజను పోలి ఉంటుంది.

గొబ్బిళ్ళు పుష్యమాసంలో పల్లెటూర్లో ప్రత్యేక ఆకర్షణ. గొబ్బెమ్మలను గోవుపేడ ముద్ద తో గుండ్రంగా చేసి, ఒక పెద్దది , రెండు చిన్నవి, లేక ఒక పెద్దది నాలుగు చిన్నవి మూడు లేక ఐదు ముద్దలను పసుపు రాసి కుంకుమ అలంకరించి, సిద్ధం చేసుకుని శుభ్రం చేసి, రంగవల్లులు తీర్చి దిద్దిన ముంగిట్లో లేక మైదానంలో ఈ గొబ్బిళ్ళు ఏర్పాటు చేసి వాటిపై బంతి లేక చామంతి పూలను అందంగా పేర్చి, సంధ్యాసమయంలో నూతన వస్త్రాలు, పట్టుపావడాలతో బాలికలు గొబ్బిపూజ చేసి చక్కని గీతాలు పాడుతూ గొబ్బెమ్మల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఆ పార్వతీదేవికి విన్నపాలు చేసుకుంటారు.

**సుబ్బీ గొబ్బెమ్మా! సుబ్బీ గొబ్బెమ్మా!**
**తామరపూవంటీ తండ్రీనివ్వవే**
**తుమ్మా పూవంటీ తల్లీనివ్వవే**
**సంపంగి పూవంటీ సోదరునివ్వవే**
**చామంతి పూవంటీ చెల్లెలనివ్వవే**
**మందారమంటీ మరదలినివ్వవే**
**సుబ్బీ గొబ్బెమ్మా! సుబ్బీ గొబ్బెమ్మా!**
**సూడసక్కనీ కూడికనివ్వవే**
**సుఖశాంతగూడీ కుటుంబమివ్వవే....**

ప్రశాంతమైన జీవనం ఆప్యాయత అనురాగాలు పంచే కుటుంబ సభ్యులతో బాంధవ్యాలు కోరుకుంటూ పాటలు పాడతారు. వచ్చిన బాలికలందరూ తలొకపాట పాడినంతవరకూ ప్రదక్షిణలు చేస్తూనే వంత పాడతారు. కనులవిందుగా ఈ గొబ్బెమ్మల సాయంత్రం సంక్రాంతి మాసం కళకళలాడుతూ ఉంటుంది. పూజ పూర్తి చేసి గొబ్బెమ్మలకి నైవేద్యం చేసిన అటుకులు బెల్లం ,పండ్లు, .బియ్యం పాయసం వంటి వాటిని అందరికీ పంచిపెడతారు. ఇటువంటి సంబరం జరిగిన ఇంటిలో త్వరలోనే కల్యాణ తోరణాలు కట్టబడతాయని నమ్మకం. ధనవంతులైతే బాలికలందరికీ కలిగినంతలో వస్త్ర తాంబూలాదులు యిచ్చి సంతోషంగా పంపిస్తారు.

ఏ మాసమైనా ఏ కార్యక్రమం అయినా సుఖసంతోషాలు సౌభాగ్యం, సత్సంబంధాలతో వర్ధిల్లడమే లక్ష్యం కాబట్టి కుటుంబ శ్రేయస్సు కోరుతూ వాడవాడలా సంక్రాంతి గొబ్బిళ్ళు ఏర్పాటు చేస్తారు. గొబ్బెమ్మలు, బతుకమ్మలు నాయధేయం ఏదైనా మనల్ని కాచి కాపాడే గౌరమ్మ రూపమే. ఆ జగన్మాతకి మనం భక్తి తో సమర్పించే ప్రణతుల సమాహారమే ఇటువంటి పూజా సమర్పణలు.

చివరగా హారతులిచ్చి,

**నిత్య సుమంగళి నిత్య కల్యాణి భక్త జనుల మా కల్పవల్లివై ..**
**కమలాసనవై కరుణనిండగా కనకవృష్టి కురిపించే తల్లి... సౌభాగ్య లక్ష్మి రావమ్మా!...**

అంటూ మరల మరల చేసుకోవాలని నువ్వు రావాలని మాకు నీసేవలు చేసే అవకాశం ఇచ్చి, మీ అనుగ్రహం మాకు కలిగించు...తల్లీ అని మొక్కుతారు..

**శుభం భూయాత్**

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**
(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులు తెలియని సమస్యలతో సతమతమవ్వగలరు. ఏ విషయమైన చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఇంకొక ప్రక్క భయపడవలసిన పరిస్థితులు కనిపించును. స్త్రీ మూలంగా సమస్యలు. నమ్మినవారు మోసం చేయుట. దుర్గాదేవికి పూజలు, నిత్య దీపారాధన చేయండి.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఇతరుల వలన కొన్ని సమస్యలు రాగలవు. చాలా జాగ్రత్తగా ఉండవలసిన రోజులు. ఆకస్మిక ధనాదాయం కలిగి ఉన్నారు. చదువుల విషయంలో సర్వసతీదేవి ద్వాదశి నామాలు చేయవలెను. సంఘంలో గౌరవ మర్యాదలు, అమ్మవారి పూజలు తప్పక చేయండి.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అధికారుల ఒత్తిడి, కొన్ని సందర్భములలో తెలియని భయము, అవసరములలో డబ్బు సమస్యలు ఎక్కువగా ఉండగలవు. అనారోగ్య సమస్యలు. మూడవ వారంలో కొంత ఉపశమనం ఉంటుంది. దుర్గాదేవి పూజలు చేయండి. ఆ తల్లి దయతో అన్ని సమస్యలు తొలగిపోగలవు.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులు ప్రతి విషయంలో నిర్లక్ష్యం లేకుండా సామరస్య ధోరణి కలిగి ఉండాలి. అహంకారం వలన అనేక విధములైన పరిణామములు ఉండగలవు. ఒక తప్పుకు ఎన్నో అబద్ధములు చెప్పాలి. చాలా జాగ్రత్తగా ఉండాలి. నవగ్రహ జపదానములు ప్రదక్షిణలు చేయండి. ఆర్థికంగా బాగుంటుంది. దుర్గాదేవి పూజలు చేయండి.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలమైన రోజులు. దుర్గాదేవి పూజలు చేయుట వలన, దర్శనం వలన ప్రతి విషయంలో ప్రగతి ఉంటుంది. శుభవార్తలు విందువినోదములు ఆర్థికముగా సంతృప్తి ఉంటుంది. ఆనందంగా ఉంటారు. యోగ, ధ్యానం చేయండి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు చాలా ఉన్నతమైన రోజులు. ఎవరితో గొడవలకు అవకాశమివ్వరాదు. ప్రశాంతంగా ఉండి దానికి ప్రయత్నములు చేయండి. మీ తొందరపాటు నిర్ణయం వలన అనేక సమస్యలు రాగలవు. అనారోగ్యం చూడగలరు. ఆయుర్వేదముతో పరిష్కారమున్నది. దైవబలం, ఆ దుర్గా మాత, గాయత్రి, శ్రీ లలితా దేవి పూజలు సంతానం కలుగును.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులు విఘ్నేశ్వరుని ఆరాధనలతో ఆనందంగా ఉంటారు. దేవి నవరాత్రులలో ప్రతినిత్యం ప్రసాదములు పంచండి. ఎంత ఎక్కువగా ప్రసాదములు పంచితే అంత ఫలితము ఉంటుంది. పి తృదేవతల అమావాస్య ఆరాధనలు చేయండి. అనుకూలంగా ఉంటుంది.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉన్నది. కాని చాలా జాగ్రత్తగా ఏ విషయంలోనైనా చాకచక్యంగా వ్యవహరించాలి. కొంతవరకు వెసులుబాటు కలిగి ఉంటారు. వస్తు వాహన గృహోపకరమైనవి రాగలవు. అమ్మవారి అనుగ్రహం కోసం పూజలు ఆచరించండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలమైన కాలం. ప్రతి విషయంలో ముందడుగు వేయగలరు. పెండింగ్ మరియు ఆగిపోయిన పనులను ప్రారంభించి ఎలాంటి భయం లేకుండా ముందుకు సాగండి. సూర్యనారాయణ నమస్కారములు చేయండి.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులు తెలియని ఆకస్మికముగా ధనము ఖర్చు చేయగలరు. దుర్గా నవరాత్రులకు కనకదుర్గాదేవికి పూజలు చేయుటవలన సమస్యలకు పరిష్కారము ఉంటుంది. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ఖర్చులు పెరిగి అనేక విధములుగా మాటలు పడగలరు.

## కుంభరాశి

**ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులు మెరుగైన జీవన విధానమునకు ప్రాధాన్యత ఇవ్వండి. మీరు ఊహించినట్లు జరుగనప్పుడు కొన్ని విషయాలలో ప్రయత్న లోపం గమనించి ఇతరుల సలహాలు, గురువులను ఆశ్రయించి విషయ సేకరణ చేయండి. దుర్గా నవరాత్రులలో అమ్మవారిని పూజించండి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. నిరాశ వదలి సుబ్రహ్మణ్యేశ్వర ఆరాధన వలన నిత్యపూజలు శరవణభవ నామస్మరణ వలన అనారోగ్య సమస్యలు గుండె సంబంధమైన దోషములకు గాయములకు పరిష్కారములు కలిగి ఉన్నారు. నవగ్రహ ప్రదక్షిణలు చేయండి.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**





**శ్రీ వేంకటేశం**
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com


**ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.**

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. వామన జయంతి ఎప్పుడు?
2. గోవిందదాసును స్వామివారు ఆలింగనం చేసుకున్నదెప్పుడు?
3. బలి చక్రవర్తి చేసిన యాగమేది?
4. ఆస్తీకుని తల్లితండ్రులెవరు?
5. సర్పజాతి రక్షణ ఎవరితో ప్రారంభమయింది?
6. అనంత పద్మనాభ వ్రతాన్ని ఎవరు ఎవరికి వివరించారు?
7. వినాయకుడు మహాభారతాన్ని దేనితో వ్రాశాడు?
8. సుందరకాండకు మరోపేరు?
9. ఆంజనేయుడు ఎక్కడ నుండి సముద్రం పైకి ఎగిరాడు?
10. మైనాక పర్వతాన్ని రక్షించింది ఎవరు?
11. శ్రీనివాస నాయక్ గా జన్మించింది ఎవరు?
12. శ్రీనివాస నాయక్ ఎవరిగా ప్రసిద్ధి?
13. అనలాసురుడు ఎవరి కొడుకు?
14. దేవశర్మ ఎవరి శిష్యుడు?
15. అనలాసురుని నమిలి మింగేసింది ఎవరు?

1. ____________________
2. ____________________
3. ____________________
4. ____________________
5. ____________________
6. ____________________
7. ____________________
8. ____________________
9. ____________________
10. ____________________
11. ____________________
12. ____________________
13. ____________________
14. ____________________
15. ____________________

### గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. వినత, 2. చ్యవనుడు, 3. ఉద్దాలక మహర్షి, 4. జనన మరణాలు, 5.సంపాతి, 6. కేసరి, 7. జాంబవంతుడు, 8. ప్రాచీన బర్హి, 9. అనూరుడు, 10. జాంబవంతుడు, 11. కాత్యాయని వ్రతం, 12. తిమ్మప్ప నాయుడు, 13. వ్యాస రాయలు, 14. కనకదాసు, 15. ఉగ్రసేనుడు

### సరైన సమాధానాలు రాసినవారు

1. సి.హెచ్.బి.ఎస్. కృష్ణకిషోర్
2. చిల్లర సీతారామావు
3. డి. హనుమంతు

పేరు: ____________________

చిరునామా: ____________________

____________________

____________________

____________________

పిన్‌కోడ్: ____________________

ఫోన్: ____________________

### లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

## చిల్లర సీతారామావు



Postel Registration No:
HSE/879/2022-2024

Published on 28th and Licenced to
Post On 29th & 30th of Every Month

RNI No.:
APTEL/2008/23122



If Un Delivered Please Return to:

**SRI VENKATESHAM,**

(Sri Venkateshwara Maha Mantra Peetham)

H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/
1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq